
# యెహెజ్కేలు గ్రంథ పరిచయము



టి.పి వరప్రసాద రెడ్డి

# యెహెజ్కేలు గ్రంథ పరిచయము


రచయిత

టి.పి. వరప్రసాద రెడ్డి



ప్రతులకు

టి.పి. వరప్రసాద రెడ్డి

షాలోమ్ చర్చి, జె.యన్.టి.యు పోస్టాఫీస్

అనంతపురము - 515002

సెల్: 94402 85883

Date of Publishing: 09-09-2013

**వెల : రూ. 30.00**

**ప్రతులకు :**

**1. లోగోస్ బుక్ సెంటర్**

10/1, అరండల్‌పేట గుంటూరు - 522 002

ఫోన్ : (0863)2336927 సెల్:9866296843

**2. టి.పి. వరప్రసాదరెడ్డి**

షాలోమ్ చర్చి, జె.యన్.టి.యు పోస్టాఫీస్

అనంతపురము - 2

సెల్: 94402 85883

**3. మోరే ప్రార్థన మందిరము**

1088, 3వ ఫేజ్, కె.పి.హెచ్.బి. కాలనీ,

హైదరాబాద్-72, సెల్: 7396202017

**4. జి. రాజారావు**, పెద్దకాకాని - 522 509,

గుంటూరు జిల్లా

**5. టి. రత్నారెడ్డి**, మేనేజర్, ముత్తూట్ ఫైనాన్స్,

గిద్దలూరు, ప్రకాశం జిల్లా. సెల్: 9490000789

# విషయ సూచిక


| వ.సం. | అంశము -అధ్యాయములు | పేజి నెం. |
|---|---|---|
| 1. | ప్రవక్తల పెద్ద గ్రంథముల పరిచయము | 4 |
| 2. | యెహెజ్కేలు గ్రంథ పరిచయము | 6 |
| 3. | 1-3అ. ప్రవక్త నియామకము | 11 |
| 4. | 4-7అ. నాశనమును గూర్చినాలుగు సూచనలు - నాలుగు శిక్షలు | 19 |
| 5. | 8-11అ. నాశనమునకు కారణమైన నాలుగు పాపములు | 26 |
| 6. | 12-15అ. నాశనమును గూర్చి నాలుగు ప్రదర్శనలు - నాలుగు సామెతలు | 31 |
| 7. | 16-19అ. నాశనమును గూర్చి నాలుగు ఉపమానములు - సామెతలు | 36 |
| 8. | 20-24అ. చిట్ట చివరి దినములలో నాశనమును గూర్చి ఉపమానములు, సూచనలు, ప్రదర్శనలు | 43 |
| 9. | 25-28అ. పొరుగు అన్య దేశములకు తీర్పును గూర్చిన ప్రవచనములు | 51 |
| 10. | 29-32అ. ఐగుప్తు దేశమునకు తీర్పును గూర్చిన ప్రవచనములు | 60 |
| 11. | 33-35అ. కాపరులకు, ఎదోముకు ప్రవచనము | 65 |
| 12. | 36-39అ. ఇశ్రాయేలీయుల సమకూర్పు - విజయము | 67 |
| 13. | 40-43అ. వేయి ఏండ్ల కాలములో క్రొత్త మందిర వివరాలు | 73 |
| 14. | 44-46అ. క్రొత్త ఆరాధన క్రమము | 77 |
| 15. | 47-48అ. క్రొత్త పవిత్ర స్వాస్థ్యము | 82 |

# ప్రవక్తల పెద్ద గ్రంథముల పరిచయము

యూదా ఇశ్రాయేలు వారికి మూల పురుషుడైన అబ్రాహాము, కల్దీయుల దేశము (ప్రస్తుత ఇరాక్ దేశము) లోని ఊరు అను గ్రామమునకు చెందినవాడు. అబ్రహాము పితరులు యితర దేవతలను పూజించేవారు. (యెహోషువ 24:1-2). మహిమ గల దేవుడు అబ్రహామునకు ప్రత్యక్షమై నేను నీకు చూపించు దేశమునకు రమ్మనగా దేవుని యందు విశ్వాసముంచి క్రీ.పూ. 2075 సం॥ కనాను దేశమునకు వచ్చి నివసించాడు. (అపో 7:1-4వ). అబ్రహాము క్రీ.పూ 2004 సం॥లో ఇస్సాకును, ఇస్సాకు క్రీ.పూ. 1944లో యాకోబును కనెను. యాకోబు 12గురు కుమారులను కుమార్తెలను కనెను. యాకోబు సంతానము ఇశ్రాయేలీయులుగా పిలువబడిరి, యాకోబు కుమారుడైన యోసేపు క్రీ.పూ. 1857లో పుట్టెను. క్రీ.పూ 1836-40లో అన్నలు అమ్మివేయగా ఐగుప్తుకు వెళ్ళెను. ఇశ్రాయేలు తన సంతానమైన 12 గోత్రముల వారితో క్రీ.పూ. 1814లో ఐగుప్తుకు వెళ్ళెను. ఇశ్రాయేలీయులు క్రీ.పూ. 1440లో మోషే నాయకత్వాన ఐగుప్తును విడచి క్రీ.పూ. 1400లో కనానుకు తిరిగివచ్చారు.

కనానులో అప్పుడు నివసించు ఏడు జాతుల వారిని సంహరించి యెహోషువ ద్వారా ఆ దేశమంతటిని దేవుడు 12 గోత్రముల ఇశ్రాయేలీయుల వారికి క్రీ.పూ. 1400-1370 వరకు పంచి పెట్టాడు (అపో.13:20). అప్పటి నుండి అది ఇశ్రాయేలు దేశమని పిలువబడినది. యెరూషలేము నుండి క్రింది భాగము బెన్యామీను, యూదా గోత్రముల వారికి పంచిపెట్టబడెను. యెరూషలేము నుండి, పై నున్న ఉత్తర దేశము మిగిలిన 10 గోత్రముల వారికి పంచిపెట్టబడెను. న్యాయాధిపతుల గ్రంథమందు క్రీ.పూ. 1370 నుండి 1060 వరకు సుమారు 310 యేండ్లు దేవుడు వారిని న్యాయాధిపతుల ద్వారా పాలించెను. తరువాత ప్రజల కోరికపై దేవుడు వారికి రాజుల నిచ్చాడు. ఇశ్రాయేలు 12 గోత్రముల వారిని సౌలు రాజు (క్రీ.పూ 1050-1010), దావీదు రాజు (క్రీ.పూ 1010-970), సొలొమోను రాజు (క్రీ.పూ. 970-930) పరిపాలించిన తదుపరి రాజైన రెహబాము కాలమందు రాజ్యము రెండు భాగములై యూదా, బెన్యామీను గోత్రాలవారు యూదావారని పిలువబడిరి. యూదా ప్రజలను 20 మంది రాజులు యెరూషలేము నుండి క్రీ.పూ. 930-586 వరకు పాలించిరి. వారిలో 8 మంది మంచివారు, 12 మంది చెడ్డవారు, మిగిలిన 10 గోత్రాల ప్రజలు ఇశ్రాయేలు వారని పిలువబడి 19 మంది రాజులచే షోమ్రోను, తిర్సాలు ముఖ్య పట్టణములుగా నుండి క్రీ.పూ. 930-721 వరకు పాలించబడిరి. వారందరు చెడ్డవారు. అందుచేత వారు (క్రీ.పూ. 732, 721)లో అష్షూరు చెరకు వెళ్ళి నేటికి తిరిగిరాలేదు. యూదా వారిని పాలించిన రాజులలో 8 మంది మంచివారు,

మిగిలిన 12 మంది రాజులు, ప్రజలు చెడ్డవారైనందున దేవుడు వారిని క్రీ.పూ. 606, 597, 586లో మూడు విడతలుగా బబులోనుకు చెరకు పంపెను. సొలొమోను రాజు క్రీ.పూ. 967-960 వరకు యెరూషలేములో కట్టించి క్రీ.పూ. 959లో ప్రతిష్ఠించిన మందిరము క్రీ.పూ. 586లో పడగొట్టబడెను. యెరూషలేము పట్టణము కాల్చబడెను. 606 నుండి 70 ఏండ్ల చెర పిదప క్రీ.పూ. 536లో బబులోను నుండి యూదులు తిరిగి వచ్చిరి. క్రీ.పూ. 535-516 వరకు మందిరము నిర్మించబడినది. క్రీ.పూ. 959-516 వరకు నున్న 70 విశ్రాంతి సంవత్సరములు దేశము అనుభవించినది. క్రీ.పూ. 458 మందిరము ఎజ్రాచే అలంకరించబడినది. క్రీ.పూ. 445లో నెహెమ్యాచే పట్టణ ప్రకారము కట్టబడిన తరువాత క్రీ.పూ. 396 వరకు మలాకీ గ్రంథ రచన ద్వారా ప్రజల జీవితములు కట్టబడినవి. యూదా వారు విగ్రహములను పూజించిన కారణమున మరియు ధర్మశాస్త్రమును మీరిన కారణమున దేవుడు యెషయా ద్వారా క్రీ.పూ. 760 నుండి 700 వరకు 60 ఏండ్లు యిర్మీయా ద్వారా క్రీ.పూ. 626 నుండి 586 వరకు 40 ఏండ్లు బుద్ధి చెప్పిననూ వారు విననందున యూదావారిని క్రీ.పూ. 606లో రాజైన యెహోయాకీము దినములలో బబులోనుకు మొదటి విడతగా చెరకు పంపాడు. చెరకు వెళ్ళినవారిలో ప్రముఖులైన దానియేలు, షద్రకు, మేషాకు, అబేద్నెగోలు కలరు. యూదయలో మిగిలినవారు ఇంకను జీవితాలు దిద్దుకొననందున రెండవ విడతగా క్రీ.పూ. 597లో యెహోయాకీను రాజు దినాలలో యూదావారిని చెరకు బబులోనుకు పంపాడు. వీరిలో ప్రముఖుడైన యెహెజ్కేలు ద్వారా క్రీ.పూ. 592 నుండి 572 వరకు 20 ఏండ్లు బుద్ధి చెప్పారు. తదుపరి చివరి రాజైన సిద్కియా దినాలలో క్రీ.పూ. 586లో యూదా దేశము పతనమై యెరూషలేము పట్టణము, నాశనము కాగా యిర్మీయా విలపించిన గ్రంథము విలాపవాక్యములు. దేశములో మిగిలిన వారు యిర్మీయా యొద్దకు వెళ్ళి ప్రార్థించి దేవుని చిత్తమును తెలుపుమనికోరగా యిర్మీయా ప్రార్థించాడు. జవాబుగా దేవుడు మిగిలినవారు ఎక్కడకు వెళ్ళవద్దని యూదయలోనే ఉండవలెనని సెలవిచ్చాడు. కాని దేవుని మాట వినక మిగిలిన సామాన్యులు యిర్మీయాను వెంటబెట్టుకొని ఐగుప్తుకు వెళ్ళిరి. క్రీ.పూ. 606లోని మొదటి విడత చెర నుండి 70 ఏండ్లకు క్రీ.పూ. 536 పారశీకులు రాజైన కోరేషు దినాలలో చెర నుండి విడుదల పొంది యెరూషలేముకు తిరిగి వచ్చిరి. క్రీ.పూ. 606 నుండి 533 వరకు సుమారు 80 ఏండ్లు రాజనగరు నుండి దానియేలు ప్రవచించాడు. యెషయా దేవుని రక్షణను గూర్చి, యిర్మీయా దేవుని తీర్పుల గూర్చి, యెహెజ్కేలు దేవుని ప్రభావము గూర్చి, దానియేలు దేవుని మహిమను గూర్చి ప్రవచించిరి. క్రీ.పూ. 535-515 మధ్య యూదులు దేవాలయమును కట్టిరి. వివరములు ఎజ్రా గ్రంథమందు, హగ్గయి, జెకర్యా గ్రంథములందు గలవు. పాడైన పట్టణ ప్రాకారమును నెహెమ్యా కాలములో క్రీ.పూ. 445లో బాగు చేసిన

వివరములు నెహెమ్యా గ్రంథమందు కలవు. యూదా ప్రజల జీవితములు కట్టబడుట హగ్గయి, జెకర్యా, మలాకీ గ్రంథములందు కలదు. యూదావారిని శిక్షించిన బబులోనీయులను, వారికి సహకరించిన చుట్టునున్న శత్రు దేశాలను 1. అష్షూరు 2. ఫిలిష్తీయ 3. మోయాబు 4. దమస్కు 5. కూషు 6. ఐగుప్తు 7. అరేబియా 8. తూరు 9. ఎదోమును 10. అమ్మోను 11. తూరు 12. సీదోను అనువారిని దేవుడు తదుపరి శిక్షించాడు. రమారమి దానియేలు 80 ఏండ్లు, యెషయా 60 ఏండ్లు, యిర్మీయా 40 ఏండ్లు యెహెజ్కేలు 20 ఏండ్లు ప్రవచించిరి.

## యెహెజ్కేలు గ్రంథ పరిచయము

గ్రంథకర్త: యెహెజ్కేలు కాలము: 592-572.

**గ్రంథ ఉద్దేశ్యము:** ముందుగా ప్రవక్తల పెద్ద గ్రంథ పరిచయము చదవండి. యెహోవాను విడచి విగ్రహాలను యూదావారు పూజించి నిబంధనను మీరి విశ్రాంతి సంవత్సరాలను లేవీ 25:1-12 వచనాల ప్రకారము పాటించనందున దేవుడు హెచ్చరించి తీర్పు తీర్చి 70 ఏండ్లు బబులోనులో శిక్షించినట్లు రెండవ దినవృత్తాంతము 36:27లో చూచుచున్నాము. క్రీ.పూ. 967-960లో సొలొమోను రాజు మందిరమును నిర్మించి క్రీ.పూ. 959లో ప్రతిష్ఠించినది మొదలు క్రీ.పూ. 516వరకు అనగా 442 సం॥రాలు విశ్రాంతి సంవత్సరాలు పాటించలేదు. (ప్రతి 7వ సం॥ ప్రతి 50వ సం॥ భూమికి విశ్రాంతి (లే.వీ॥25:4,8). 442సం॥ కాలానికి ప్రతి 50సం॥ 8 విశ్రాంతి సంవత్సరములు కనుక 400సం॥ 64 విశ్రాంతి సం॥. మిగిలిన 42సం॥ 6 విశ్రాంతి సం॥లు. కనుక 442 సం॥లకు 64+6=70 విశ్రాంతి సంవత్సరాలు 606లో యూదావారిని దేవుడు మొదటి విడతగానూ, 597లో రెండవ విడతగాను 586లో మూడవ విడతగాను చెరకు పంపి 70 ఏండ్ల కాలములో 606-536 వరకు వారిని శిక్షించి భూమికి విశ్రాంతి నిచ్చారు. కొన్ని ప్రాంతాలలో 586-516 వరకు భూమికి విశ్రాంతి ఇవ్వబడినది. మొదటి విడతగా చెరలో దానియేలు, షద్రకు, మేషాకు, అబెద్నెగోలు, రెండవ విడత చెరలో (597) యెహెజ్కేలు వెళ్ళిరి. 70 ఏండ్ల చెర తీరిన తర్వాత యెహోషువా, జెరుబ్బాబెలుల నాయకత్వాన సుమారు 50,000 మంది ప్రజలను యెరూషలేముకు నడిపించి మందిరమును నిర్మించెను. మొదటి విడత చెరకు ముందు 20 ఏండ్ల నుండి (క్రీ.పూ 626) మూడవ విడత చెర వరకు క్రీ.పూ. 586 వరకు తదుపరి కొంతకాలము మొత్తము 40 ఏండ్ల పైబడి యిర్మీయా యూదయలోను ఐగుప్తులోను ఉండగ యెహోవా వాక్కు 40 మారులు ప్రత్యక్షమగుట ద్వారా ప్రకటించాడు.

అయిననూ యూదా వారిలో మార్పు రాలేదు. రెండవ విడత చెర నుండి 5వ సంవత్సరమున అనగా క్రీ.పూ. 592 నుండి క్రీ.పూ 572 వరకు సుమారు 20 ఏండ్లు

బబులోను చెరలో నున్న యెహెజ్కేలు ద్వారా 50 పర్యాయాలు యెహోవా వాక్కు ప్రత్యక్షమగుట ద్వారా దేవుడు ప్రకటించాడు. యెహెజ్కేలు ప్రకటనలు చివరివాడైన సిద్కియా రాజు పరిపాలించిన కాలంలో ఆరంభమయ్యాయి. ఈ గ్రంథములో 1-24వ అధ్యాయములలో క్రీ.పూ. 592-586వరకు ప్రదర్శనల సూచనలు, సామెతలు, ఉపమానముల ద్వారా హెచ్చరించిన తదుపరి యూదావారు క్రీ.పూ. 586లో మూడవ విడత చెరకు వెళ్ళుటను గమనించగలము.

25-48 అధ్యాయాలలో అంత్యకాలములో జరుగబోవు సంగతులు కలవు. 25-32 అధ్యాయాలలో ఇశ్రాయేలీయుల చుట్టునున్న పొరుగు దేశాలపై దేవుని తీర్పులు కలవు. 33-39 అధ్యాయములలో అంత్యకాలమందు ఇశ్రాయేలీయుల పునరుద్ధరణ వారి ఔన్నత్యము కలదు. 40-48 అధ్యాయాలలో అంత్యకాలమందు వెయ్యియేండ్ల పాలనలోని యెరూషలేము మందిర వివరములు, క్రొత్త ఆరాధన క్రమము, ఇశ్రాయేలీయుల క్రొత్త స్వాస్థ్య వివరములు కలవు. ఈ గ్రంథమందు సూచనలు, ప్రదర్శనలు, సామెతలు, ఉపమానముల ద్వారా యూదులకు రానున్న శిక్ష విధము తెలుపబడినది. 14:21లో మనుష్యులను పశువులను నిర్మూలము చేయుటకు 1) ఖడ్గముచేత 2) క్షామముచేత 3) దుష్టమృగములచేత 4) తెగులుచేత ఈ నాలుగు విధముల తీర్పు యెరూషలేము మీద తీర్చుదునన్నాడు. నాలుగు విధములు అను అంశము ఈ గ్రంథమందున్న ప్రత్యేకత. కనుక సూచనలు, ప్రదర్శనలు, సామెతలు, ఉపమానములు, శిక్షలు, తీర్పులు అన్నియు నాలుగుగా నుండుట గమనింతుము.

**యెహెజ్కేలును గూర్చిన పరిచయము:-** యెహెజ్కేలు బూజీ కుమారుడు, యాజక వంశమునకు చెందినవాడు. యెహెజ్కేలు క్రీ.పూ 597లో చెరకు వెళ్ళి బబులోనులోని కెబారు నది దగ్గర తేలాబీబు అను స్థలములో కాపురముండి (3:15) చెరలో నున్నను బానిసగా కాక తన ఇంట స్వతంత్రుడుగా ఉండెను. (8:1). తనతో కనులకు యింపైన భార్య నివసించుచుండగా (24:15) సూచనగా ఆమెను దేవుడు ఒక్క దెబ్బతో తీసివేతునని తాను అంగలార్చక, ఏడ్వక, కన్నీరు విడువక విలాపము చేయక నిశ్శబ్దముగా నిట్టూర్పు విడువవలెనని, జనుల ఆహారము భుజింపకూడదనియు, శిరోభూషణములు ధరించుకొని చెప్పులు తొడుగుకొని ప్రజలకు దేవుని వర్తమానము అందించవలెనని చెప్పగా అలాగే చేసెను.

లేవీయకాండము 21:1-3వ.లలో యాజకుని సమీప బంధువులు చనిపోయినప్పుడే తన్ను అపవిత్రపరచుకొనవచ్చును అను ఆజ్ఞ ఉన్ననూ యెహెజ్కేలుకు

మాత్రము ప్రత్యేకముగా దేవుని చేత కనీసము దుఃఖమైనా పొందకూడదని సెలవియ్యబడింది. యెహెజ్కేలు 4:14 ప్రకారము బాల్యము నుండి తానెన్నడును అపవిత్రత నొందినవాడు కాదని తెలియబడుచున్నది.

యెహెజ్కేలు ఈ గ్రంథములో దేవుడైన యెహోవాకు సాదృశ్యంగా ఉన్నందున పాపమునుబట్టి జీవితములు దిద్దుకొనని యూదా ప్రజలను యెరూషలేము పట్టణమును, యెరూషలేములోని దేవాలయమును దేవుడు నాశనము చేయును కాని తాను దుఃఖపడడు అనుటకు సూచనగా యెహెజ్కేలు తన భార్యను కోల్పోయిననూ దుఃఖపడకూడదని సెలవిచ్చెను.

చెరకు వెళ్ళక యూదయలో నున్న వారి దగ్గర యిర్మియా ప్రవచించుచుండగా చెరలోని రాజభవనములో దానియేలును, బబులోను చెరలో ప్రజల దగ్గర యెహెజ్కేలు ప్రవచించుచున్నారు. భవనంలో దానియేలును, చెరలో ప్రజల దగ్గర నన్ను ప్రభువు పెట్టాడు అని యెహెజ్కేలు అనుకోలేదు. ఒక్కొక్కరి విధానం ప్రభువుదే! యెహెజ్కేలు సుమారు 20 సం॥రాలు (క్రీ.పూ. 592-572) ప్రవచించాడు.

ఈ గ్రంథములో యెహెజ్కేలు, యెషయా గ్రంథము, ప్రకటన గ్రంథములవలెనే అంత్యకాలములోని సంభవాలను కూడా ప్రకటించుచున్నారు. యెషయా ప్రభువు పరిశుద్ధతను యెష 6:4లో చూచినట్లుగా, యెహెజ్కేలు ప్రభువు ప్రభావమును (యెహె. 1:28) చూచెను. యెషయా దేవుని రక్షణ గూర్చి, యిర్మీయా దేవుని తీర్పును గూర్చి, దానియేలు దేవుని మహిమను గూర్చి మాట్లాడుచున్నారు. 10:18లో దేవుని మహిమపోవుట 43:2లో అంత్యకాలములో దేవుని మహిమ తిరిగివచ్చుట, అంత్యకాలములో భూలోక మందిరమును నింపుట చూడగలం.

ఈ గ్రంథమందు 50పార్లు యెహోవా వాక్కు ప్రత్యక్షమై సంగతులు తెలుపజేయబడినవి. 131 సార్లు యెహోవా వాక్కు అనుపదము యెహోవాను నేను - నేను యెహోవాను - అను పదము 200 సార్లు, యెహోవా సెలవిచ్చుచున్నాడు అని 140 సార్లు, నరపుత్రుడా అని 93 సార్లు కన్పించును.

## గ్రంథ విభజన

ఈ గ్రంథమందు మొదటి 24 అధ్యాయాలు పాపమునుబట్టి యెరూషలేము పట్టణము, దేవాలయము, దేశము నాశనమగుననియూ, తెలుపబడినది. 24వ అధ్యాయాల తర్వాత నాశనము జరిగినట్లుగా చూడగలము. 25-48 అధ్యాయంలో నాశనమునకు

పిదప తెలుపబడిన ప్రవచనములు కలవు. 25-32 అధ్యా. యెరూషలేము చుట్టునున్న పొరుగుదేశాలపై తీర్పు, 33-39 అధ్యా. ఇశ్రాయేలీయుల అంత్యకాలము 40-48 అధ్యా.లో వేయ్యియేండ్ల కాలము గూర్చిన ప్రవచనాలు కలవు.

I. **1-24 అధ్యాయాల విభజన :** (3+4+4+4+4+5) :24 అధ్యా.

**25-48 అధ్యాయాల విభజన :** (4+4+3+4+4+5=24 అధ్యా.)

| వరుస | అధ్యాయాలు | అంశము | ప్రత్యక్షతలు |
|---|---|---|---|
| (1) | 1-3 అధ్యా. | ప్రవక్త నియామకము | 2 |

1వ అధ్యా. సేవాజీవితాన్ని చూపుట. 2వ అధ్యా. సేవా జీవితాన్ని చెప్పుట. 3వ. సేవా జీవితానికి నియమించుట.

(2) **4-7** అధ్యా. **నాశనము గూర్చిన 4 సూచనలు -4 శిక్షలు** 2

4-5 అధ్యా. నాశనమును గూర్చిన 4 సూచనలు. (1-3వ, 4-8వ, 9-13,5:1-4వ)

6-7 అధ్యా. 4 శిక్షలు. (6:1-10వ, 6:14వ, 7:1-13వ, 7:14-19వ)

(3) 8-11 అధ్యా. **నాశనము చేయదానికి కారణమైన 4 పాపములు, 4 శిక్షలు** 1

8వ. అధ్యా. యూదావారి నాలుగు పాపాలు. (8:5-6వ, 7-12వ, 13-14వ, 15-16వ).

9వ. అధ్యా. మొదటి శిక్ష. 10వ అధ్యా. రెండవ శిక్ష 11 అధ్యా. మూడవ, నాల్గవ శిక్ష. (11:9వ; 11:23-24వ).

(4) 12-15 అధ్యా. **నాశనమును గూర్చి 4 ప్రదర్శనలు (4 శిక్షలు) - 4 సామెతలు** 9

12వ అధ్యా రెండు ప్రదర్శనములు, (1-16వ. 17-20వ) 13వ. అధ్యా. మూడవ, నాల్గవ ప్రదర్శనలు. (13:1-12వ, 17-23వ) 14-15వ అధ్యా. నాలుగు సామెతలు. (14:1-11వ, 12-20వ, 21-23, 15:1-8వ).

(5) 16-19 అధ్యా. **4 ఉపమానాలు - రెండు సామెతలు** 4

16వ అధ్యా. మొదటి ఉపమానం. 17వ అధ్యా. రెండవ ఉపమానం. 18వ అధ్యా. మూడవ ఉపమానం. 19వ. అధ్యా. నాల్గవ ఉపమానం.

సామెతలు (16:44, 18:2).

(6) 20-24 అధ్యా. **నాశనమగు చిట్టచివరి దినములలో ఉపమానాలు, సూచనలు, ప్రదర్శనలు.** 12

20 అధ్యా. నాలుగు పాపములు. (1-9వ, 10-17వ, 18-26, 27-33వ)

21 అధ్యా. నాలుగు సూచనలు. (1-7వ, 8-17వ, 18-23, 24-27)

22వ. అధ్యా. పాపమును గూర్చి నాలుగు ప్రకటనలు.

23వ. అధ్యా. ఉపమానము

24వ. అధ్యా. ఉపమానము- ప్రదర్శన.

II. 25-32 అధ్యాయాల విభజన: (4+4)=8 అధ్యా.

25-32 అధ్యాయాలలో యెరూషలేము చుట్టూవున్న అన్యదేశములపై దేవుని తీర్పును గూర్చిన ప్రవచనము.

(7) 25-28 అధ్యా. **పొరుగు అన్యదేశములకు ప్రవచనము** 6

అమ్మోనీయులు (25:1-7వ) మోయాబీయులు (25:8-11వ) ఎదోమీయులు (25:12-14వ) ఫిలిష్తీయులు (25:15-17వ), 26,27,28 అధ్యాయాలలో తూరు అను దేశమును గూర్చి తీర్పులు ప్రవచించబడెను.

(8) 29-32 అధ్యా. **ఐగుప్తు దేశమునకు తీర్పు గూర్చిన ప్రవచనము** 7

III. 33-39 అధ్యా. 3+4=7 అధ్యా. ఇశ్రాయేలీయుల అంత్యఆశల పునరుద్ధరణ

(9) 33-35 అధ్యా. **కాపరులకు, ఎదోముకు ప్రవచనము** 4

33-34 అధ్యా. కాపరులను గూర్చి, 35 అధ్యా. ఎదోమును గూర్చిన తీర్పులు ప్రవచనము.

(10) 36-39 అధ్యా. **ఇశ్రాయేలీయుల సమకూర్పు - విజయము** 3

ఇశ్రాయేలీయుల సమకూర్పు (36-37 అధ్యా.)గోగు మాగోగులతో యుద్ధం - ఇశ్రాయేలీయుల అంతిమ విజయం (38,39 అధ్యా).

IV. 40-48 అధ్యా. (4+3+2=9 అధ్యా.) వెయ్యియేండ్ల కాలంలోని మందిర, ప్రజల, పట్టణ విషయాలు.

(11) 40-43 అధ్యా. **క్రొత్త మందిరపు వివరాలు:**

40వ అధ్యా. మందిరము చుట్టు, ఆవరణ వివరములు.

41 అధ్యా. మందిరము లోపల వివరములు

42 అధ్యా. యాజకుల గదులు - ప్రతిష్ఠతమైన స్థలము.

43 అధ్యా. దేవుని మహిమ తిరిగి వచ్చుట - పరిశుద్ధతకొరకై పిలుపు (12.వ).

**(12) 44-46 అధ్యా. క్రొత్త ఆరాధన క్రమము**

44 అధ్యా. యాజకుల కట్టడలు - నిబంధనలు

45. అధ్యా. దేశము - విధులు

46 అధ్యా. అధిపతి, యాజకుల జనుల ఆరాధనను గూర్చిన విధులు.

**(13) 47-48 అధ్యా. క్రొత్త పవిత్ర స్వాస్థ్యము**

47 అధ్యా. క్రొత్త నది - భూమి.

48 అధ్యా. భూమి 12 గోత్రముల ఇశ్రాయేలీయులకు పంచిపెట్టబడుట - పట్టణ వివరము.

☐ కలవి ప్రత్యక్షతలు. మొత్తము 50 ప్రత్యక్షతలు.

**(1) 1-3 అధ్యా. ప్రవక్త నియామకము**

**1వ అధ్యా. సేవా జీవితాన్ని చూపుట: 2వ అధ్యా. సేవా జీవితాన్ని చెప్పుట: 3వ అధ్యా. సేవా జీవితానికి నియమించుట.**

# 1వ. అధ్యాయము (3+11+11+3=28వ)

అంశము:- సేవా జీవితమును చూపుట

**1-3వ. ఉపోద్ఘాతము. 4-14వ.కెరూబుల దర్శనము. 15-25వ. కెరూబు పరిచర్య. 26-28వ ప్రభువు ప్రభావదర్శనము**

**1-3వ. ఉపోద్ఘాతము:-** యెహెజ్కేలును యెహోయాకీను చెరకు వెళ్ళిన క్రీ.పూ. 597 నుండి 5 సం॥లకు అనగా 592లో దేవుడు దర్శనము ద్వారా ప్రవక్తగా నియమించాడు. అప్పుడు వారు కెబారు నదీ తీరమున తెలాబీబు అను స్థలమున నివసించిరి. (3:15). కెబారు అనగా విస్తారము (లేదా) కలిసికొనుట అని అర్థము. కెబారు నది యూఫ్రటీస్ మహానది నుండి, వేరై కొన్ని ప్రాంతములలో పారి పిదప యూఫ్రటీస్ నదిలోనే కలియును.

యూదులు యెరూషలేము నుండి వేరై బబులోనుకు వచ్చిననూ కొద్దికాలమునకు మరలా యెరూషలేము వారిని కలిసికొందురు అను సత్యమునకు సూచనగా ఉన్నది.

30వ సం॥ అనగా ప్రవక్త 30 సం॥ వయస్సు అని తలంచిన ఎడల 20 సం॥ ప్రవక్తగా మొత్తము 50 సం॥ల వయస్సు వరకు ప్రవచించినట్టు తలంచగలము. చెరలో కొద్దిమంది బానిసలుగాను, కొద్దిమంది బంధకములలోను, మరికొందరు స్వేచ్ఛగా నివసించెదరు. యెహెజ్కేలు స్వేచ్ఛగా నివసించు వారిలో చేరినవాడు. తరచుగా యూదుల పెద్దలు తన యింటికి వచ్చి దైవిక విషయముము తెలిసికొనుచున్నారు. (14:1; 8:1). తాను స్వేచ్ఛగా ఉన్నాడని తలంచగలము. ఇటువంటి దేవుని దర్శనం క్రొత్త నిబంధనలో కూడా అపొ 7:55 స్తెఫను చూచాడు.

**4-14వ కెరూబుల దర్శనము:-** 4వ. నేను చూడగా దేవుడు చూపించుట - యెహెజ్కేలు చూచుట మాత్రమే తప్ప ఈ భాగంలో దేవుడు మాట్లాడటంగాని, యెహెజ్కేలు మాట్లాడటం

గాని లేదు. కనుక ముందు మన జీవితంలో చూచుట ప్రాముఖ్యమైనదని గమనించగలము. తుఫాను ఉత్తర దిక్కునుండి వచ్చుట కీర్త 107:25లో దేవుడే తుఫాను రేపును అని మరియు కీర్త 29:3 యెహోవా స్వరము జలము మీద వినబడుచున్నది అని ఉంది. కీర్త 48:2. ప్రకారము మహారాజు పట్టణము, సీయోను పర్వతము ఉత్తర దిక్కున ఉన్నది. కనుక ఉత్తర దిక్కు దేవుని నివాసమును గుర్తు చేయును. యెషయా 14:13లో ఉత్తర దిక్కున సభా పర్వతము, మహోన్నతుడు ఉన్నారని వ్రాయబడింది. కావున ఉత్తర దిక్కు నుండి వచ్చు తుఫాను తీర్పును పంపువాడు దేవుడే అని స్పష్టమవుచున్నది. రెండవ దిన. 36:19లో కల్దీయురాజు తీర్పు తీర్చుటకై వచ్చును. యిర్మీయా 4:6లో, 6:22లో ఉత్తర దిక్కు నుండి ఒక జనము వచ్చునని వారు నాశనము చేయుదురని చెప్పబడింది.

గొప్ప మేఘము గుండ్రముగా ఉన్నా అగ్ని కనబడినందున 1 పేతురు 4:12 ప్రకారము అగ్ని మహాశ్రమలకు గుర్తు. మేఘము, అగ్ని నిర్గ 13:21 దేవుని సన్నిధిని సూచించును. కావున ఈ తీర్పు అంతటికి దేవుడే కారణమనియు, హెబ్రీ 12:29 ప్రకారము దేవుడు దహించు అగ్ని అయినందున తీర్పు తప్పక తీర్చగలవాడనియు గమనించగలము. ఆ అగ్నిలో కరగబడినదై ప్రజ్వలించుచున్న అపరంజి వంటిది ఒకటి కనబడెను. పరమగీతము 5:11 ప్రకారం అపరంజి ప్రభువును సూచించును. పై భాగములన్నియు తీర్పు తీర్చువాడు దేవుడేనని స్పష్టము చేయుచున్నది.

5వ. దానిలో 4 జీవుల రూపములు కనబడెను. ఆ జీవులు కెరూబులేనని 10:20లో చూచుచున్నాము. వాటి రూపము మానవస్వరూపము అయినందున ఈ జీవులు మనకు సూచనగా ఉన్నవి. 6వ. వాటికి 4 ముఖములు, అనగా మనుష్యముఖము, సింహముఖము, ఎద్దుముఖము, పక్షిరాజు ముఖము గలదు. 7వ. అవి చక్కగా పెయ్యకాళ్ళవంటి కాళ్ళతో నిలువబడి ఉన్నవి. సేవా జీవితంలో చక్కగా నిలుచుట మొదటి అర్హతయై ఉన్నది. రెండవదిగా పెయ్య కాళ్ళు అనగా సేవకు సిద్ధపడిన కాళ్ళు కలిగి ఉండాలి. ఎఫెసీ. 6:15 ప్రకారము సిద్ధ మనస్సును జోడు తొడుగుకొని నిలువబడిరి. తళతళలాడు ఇత్తడి ఆ దినములలోని అద్దము. 2 కొరింథీ. 3:18 ప్రకారం మనము ప్రభువు మహిమను అద్దంవలె లోకమునకు ప్రతిఫలింపజేయువారమై ఉండాలి. లోకములోని మానవులు క్రీస్తును నేరుగా చూడలేరు గాని, తళతళలాడు అద్దములైన మనలో ప్రభువు లక్షణములు, గుణములు చూడగలగాలి. 8వ. వాటి 4 ప్రక్కలు రెక్కలు భూమియొక్క నాలుగు దిక్కులకు వెళ్ళుటకు సిద్ధమనస్సు కలిగి ఉండుటను సూచించును. 9వ. వాటి రెక్కలు ఒకదానికొకటి కలిసికొనుట ఐక్యతకు, భూమి నలుదిక్కుల ఉన్న సేవకులు కలిసి ఉండవలసిన ఐక్యతను జ్ఞాపకము చేయుచున్నది. ఏ వైపునకైననూ తిరుగక చక్కగా ఎదుటికి

వెళ్ళుట సేవా జీవితంలో పరిస్థితులు సమస్యల వైపు చిక్కులుపెట్టు పాపము వైపు గాని హెబ్రీ 12:1-3వ. ప్రకారము ప్రతి భారము వైపు గాని తిరుగక ముందుకు పోవుట. 1. చక్కగా నిలుచుట, 2. చక్కగా నడుచుట, 3. చక్కగా ఎదుటికి పోవుట.

10వ. నాలుగు రూపాల్లో మానవ రూపము తెలివికిని, సింహరూపము ధైర్యమునకు, (సామె 28-1) ఎద్దుముఖము వినయములో కూడిన సేవకు (హెబ్రీ 12:29), పక్షిరాజు ముఖము వేగముగా పని జరిగించుటను సూచించును. 11వ. ఒక జత రెక్కలు వాటి దేహములను కప్పుచున్నందున మన వ్యక్తిగతమయిన దేహ అవసరాలు, శరీరాశలు ఇతరులకు కనబడకుండా జాగ్రత్త వహించాలి. 12వ. చక్కగా ఎదుటికి పోవుచూ వెనుకకు తిరుగక - ఆత్మ ఏ వైపునకు పోవుచుండునో ఆ వైపునకు వెళ్ళుట. ఆత్మ నడిపింపు సేవా జీవితంలో ప్రాముఖ్యము అని గమనించాలి. అపొ. 16:5-6వ.లో ఆసియాలోను, బిథూనియలోను, వద్దు అని మాసిదోనియాకు పరిశుద్ధాత్ముడు నడుపగా పౌలు వెళ్ళినట్లు, ఆత్మ ఏవైపునకు నడిపించునో గమనించి నడవవలెను. (యోహాను 17:24; 2 కొరింథీ. 3:17; 10:38).

13-14వ. ఆ జీవుల రూపములు మండుచున్న నిప్పులు. మంట వెండిలోని మలినమంత తీసివేసి పవిత్రపరచగా (సామె 25:4) మంచిపాత్రగా రూపించుటకు పనికివచ్చును. అలాగే మనం కూడా దేవుని అగ్ని ద్వారా మన జీవితాలను పవిత్రపరచుకొని యజమానుడు వాడుకొనుటకు అర్హమైన పాత్రలుగా సంసిద్ధులమై ఉండాలి. జీవుల రూపములు దివిటీలతో సమానం. దివిటీ వాక్యమును పట్టుకొని లోకమందున్న విశ్వాసులను సూచించును. (ఫిలి 2:16). అలాగే సేవకుడు వాక్యమును పట్టుకొని వెలుగు అనగా సాక్ష్యమును కాపాడుకొనాలి. (మత్త 5:15). ఆ అగ్ని జీవుల మధ్యను, ఇటు అటు వ్యాపించుట పరిశుద్ధత అను అనుభవము అందరిలో వ్యాపించుటను సూచించును. ఆ అగ్నిలో నుండి మెరుపు బయలుదేరి మెరుపు తీగలు ఇటు అటు తిరుగుచూ కనబడుట ఆది.కా. 3:24 లోనే ఏదేను తోటను కెరూబులు కాయుటను సూచించును. అనగా సేవకుడు కావలివాడుగా దేవుని పరిశుద్ధతను, ఏదేను సంఘమునకు గుర్తు అయినందున సంఘమును కాయువాడుగా ఉండవలెనని చూచుచున్నాము.

**15-25వ.** కెరూబుల పరిచర్య (దూతల పరిచర్య):- 15వ. చక్రము- అనగా దేవుని రథము కదిలే సాధనము. దేవుని సేవకుడు సువార్త ప్రకటనకై తన పరిధిలో తిరుగువాడై ఉండాలి. 16వ. చక్రము పని - రక్త వర్ణపురాయివలె నుండెను. చక్రములో చక్రమున్నట్టుగా (గేర్ లాగా) అవి నాలుగు దిక్కులకు వెళ్ళుచున్నవి. రక్తవర్ణపు రాయి రక్తము కార్చిన క్రీస్తుకు గురుతు. మనం నాలుగు దిక్కులలో వెళ్ళాలి. భూదిగంత నివాసులను ప్రభువుకై

సంపాదించాలి. 17వ. వెనుకకు తిరుగక – సేవా జీవితంలో వెళ్ళి వెనుకకు తిరిగి వచ్చే అనుభవాలు కొందరిలో ఉన్నాయి. అబ్రాహాము హెబ్రీ 11:25వ. తన స్వస్థలము మరచినట్లుగా ఉన్నాడు. ఫిలి. 3:13వ. వెనుకున్నవి మరచి ముందున్న దానికి వేగిరపడాలి. యోసేపు కూడా కీడును, నిందలను మరచి కుమారునికి మనష్షేగా పేరు పెట్టాడు. మనష్షే అనగా మరచుట. 18వ. కైవారము భయంకరమైనది. అవి కన్నులతో నిండి ఉండెను. క్రీస్తు దృష్టికి మరుగైనదేదియు లేదు. 19వ. జీవులు, చక్రములు కలిసి జరుగుచుండెను. **20వ. ఆత్మ ఎక్కడికి పోవునో – అవి పోవుచుండెను.** సేవకుడు క్రీస్తును తీసికొని ఆత్మచేత నడిపించబడి సేవలో వెళ్ళాలి. కన్నులు – ఆత్మకు సూచన ప్రకటన 5:6. కన్నులతో నిండియుండు. ఆత్మపూర్ణతకు గురుతు. క్రీస్తు ఆత్మపూర్ణుడు – లూకా 4:18వ. ఆత్మలో నిండిన పూర్ణుడిగా ఉన్నాడు. క్రీస్తు విమోచించుటకై ప్రత్యేకంగా ఆత్మాభిషేకం పొందాడు. 21వ. చక్రములు – వెనుదిరుగక – దేవుడు తీర్పు వెంటనే తీర్చక యెషయా కాలము నుండి 150 సం॥ల చెప్పుచునే ఉన్నందున వారు అవి నెరవేరవు, దేవుడు వాటిని చూసుకున్నాడని తలంచి ఉండవచ్చు. వెనుకకు తిరుగని చక్రములు ఇది సమయాన్ని చూపును. దేవుని కాలచక్రం ఆగదు. వెనుకకు తిరుగదు. నిర్ణయకాలము రావాలి. అప్పుడే ఆ తీర్పును నెరవేర్చుదురు. 22వ. జీవులకు పైన ఆకాశమండలం ఉంది. ఆకాశ విశాలము – పైనున్నది. దేవుడు పైనున్నవాడు. విశాలంలో – అన్ని దిక్కులకు స్పష్టంగా కనిపించును. పైన దేవుడు క్రింద మోయుచున్న దూతలు, మానవులు, ఎప్పుడు దేవుని అనుభవాలు మోయాలి. దేవునిచే చూపించాలి. 23వ. రెక్కలు చాపడం, రెక్కలు కప్పడం ముందుగా చూచాము. 24–25వ. రెక్కల చప్పుడు – ఇప్పుడే వినబడింది. అది ఉదకముల ఘోష అనగా వాక్య ప్రకటన. రెండు రెక్కలు ప్రార్థన, వాక్యము. రెండును అనగా ప్రార్థన, ప్రకటన పరిచర్యలు క్రమముగా జరగాలి. దేవుని మాటల వలె ఉండెను. సేవకుల మాటలు దేవుడు మాటలాడిన మాటలవలె ఉండాలి. దండువారు చేయు ధ్వనివలెను ఉండెను. అనగా సైన్యము చేయు క్రమమైన ధ్వనివలె సువార్త ప్రకటనలు క్రమమైన రీతిగా నుండాలి. 25వ. రెక్కలు వాల్చి, నిలిచి – ఉన్నప్పుడు పై నుండి శబ్దము వినాలి. అనగా సేవా జీవితంలో మనము ఎప్పుడూ ప్రకటనయే కాదు. మనం కొద్దిసేపు ప్రకటన ఆపి అయన స్వరము వినడానికి, ప్రభువు నుండి వచ్చు తలంపులను గ్రహించడానికి చోటివ్వాలి.

**26–28వ. ప్రభువు ప్రభావ దర్శనము:–** జీవులు, వాటిపై విశాలము, దానిపైన సింహాసనము ఉంది. 26వ. ఆయన ఎప్పుడూ సింహాసనాసీనుడైనవాడు – ఎత్తైనవాడు. నరస్వరూపము గలవాడుగా భూమిపై అగుపడెను. ఫిలి. 2:6 ప్రకారము క్రీస్తు మనుష్యుల పోలికగా పుట్టినవాడు. హెబ్రీ. 10:5వ శరీరం ఎందుకు? 9:22 ప్రకారం మానవ పాప క్షమాపణకై మానవ రక్తము అవసరమైనందున శరీరధారిగా లోకానికి క్రీస్తు వచ్చాడు. 27వ. కరుగుచున్న

వెండి - అనగా అపవిత్రత ఉండుటకు వీలులేని పరిస్థితి. ఆయన పరిశుద్ధుడు. నిలువెల్ల ఆయన అగ్ని స్వరూపము గలవాడుగా, ఆయన జీవితమంతా పరిశుద్ధుడుగా తేజోమయుడుగాను కనబడెను. 28వ. ఇంద్రధనస్సు - ఇది నిబంధనకు అనగా ఇక మీదట నరులను జలప్రళయముతో నాశనము చేయనని దేవుడు చేసిన నిబంధనకు గురుతు. యెషయా ప్రభువు పరిశుద్ధత గూర్చిన దర్శనమును, యెహెజ్కేలు ప్రభువు ప్రభావము గూర్చిన - దర్శనమును, యోహాను ప్రభువు ప్రేమను గూర్చిన దర్శనమును చూచిరని ముందుగా తలంచితిమి. ఇక్కడ ప్రభువు ప్రభావమునకు యెహెజ్కేలు సాగిలపడినట్లు మనము సాగిలపడాలి.

వినబడెను - అనగా ఇప్పటి వరకు చూపుచున్నాడు. ఇప్పుడు చెప్పుచున్నాడు.

# 2వ. అధ్యాయము (2+1+1+2+2+2=10వ)

**అంశము:- సేవా జీవితానికి అవసరమైనవాటిని చెప్పుట**

**1-2వ. చక్కగా నిలువబడాలి:-** నరపుత్రుగా, నీవు చక్కగా నిలువబడుము. నేను నీతో మాటలాడవలెను అని ఆయన నాతో మాటలాడినప్పుడు ఆత్మ నాలోనికి వచ్చి నన్ను నిలువబెట్టెను; అప్పుడు నాతో మాటలాడినవాని స్వరము వింటిని. సేవా జీవితానికి చక్కని నడక / నడవడిక అవసరమైనది. మానవులు చక్కగా నిలువలేరు. నిలువవలెనని ఆశ ఉన్నను చక్కగా నిలువలేరు. మనము ఇష్టపడిన పరిశుద్ధాత్మ మనలోనికి వచ్చి నిలువబెట్టుటకు ఇష్టపడుచున్నాడు. స్పర్జన్ గారిని దేవుడు నిలువబెట్టి మూడు వేల ప్రసంగాలు చేసినవి చేయక చేయించాడు. కనుక సేవకులు ఆత్మద్వారా నింపబడి చక్కగా నడవాలి. మనలో చక్కని నడక ఉన్నదో లేదో పరిశీలింతము.

**3వ. పరిశుద్ధాత్మ పొమ్మన్న స్థలములకు పోవాలి:-** నరపుత్రుడా, నా మీద తిరుగుబాటు చేసిన జనుల యొద్దకు ఇశ్రాయేలీయుల యొద్దకు నిన్ను పంపుచున్నాను; వారును వారి పితరులును నేటివరకును నా మీద తిరుగుబాటు చేసినవారు. వారు సిగ్గుమాలినవారును కఠిన హృదయులునై యున్నారు. వారి యొద్దకు నేను నిన్ను పంపుచున్నాను. సేవ మంచి వారి మధ్యకాక తిరుగుబాటు చేయువారు, సిగ్గుమాలినవారు, కఠినహృదయులునైన వారి మధ్యనే యుండునని గుర్తింతము. అపొ 16:6-9లో పౌలు ఆసియాలోని బితూనియకు వెళ్లనియ్యక మాసిదోనియకు వెళ్ళమన్నాడు. పౌలు ఆలాగే వెళ్ళాడు. ప్రభువు పొమ్మన్న వారి యొద్దకే వెళ్ళాలి.

**4వ. ప్రకటన చేయాలి:-** వారు తిరుగుబాటు చేయువారు గనుక వారు వినినను వినక పోయినను తమ మధ్య ప్రవక్తయున్నాడని వారు తెలిసికొనునట్లు ప్రభువగు యెహోవా

ఈలాగు సెలవిచ్చుచున్నాడని నీవు వారికి ప్రకటింపవలెను. సేవా జీవితములో మనుష్యులనుబట్టి కాక దేవుని సెలవు ప్రకారము ప్రకటన చెయ్యాలి.

**5-6వ. భయపడకూడదు:-** నరపుత్రుడా, నీవు బ్రహ్మదండి చెట్లలోను ముండ్ల తుప్పలలోను తిరుగుచున్నావు. తేళ్ల మధ్య నివసించుచున్నావు; అయినను ఆ జనులకు, వారి మాటలకును భయపడకుము. వారు తిరుగుబాటు చేయువారు వారికి భయపడకుము. అపొ 18:9-11వ.లో ప్రభువు నీవు భయపడక మాటలాడుము. మౌనముగా ఉండకుము. నేను నీకు తోడైయున్నాను, నీకు హాని చేయుటకు నీమీదికి ఎవడును రాడు; ఈ పట్టణములో నాకు బహు జనమున్నదని పౌలుతో చెప్పగా అతడు వారిమధ్య దేవుని వాక్యము బోధించుచు, ఒక సంవత్సరము మీద ఆరునెలలు అక్కడ నివసించెను. సేవకుల నివాసము/సేవ ముండ్లతుప్పలు, తేళ్లవంటి ప్రజల మధ్యనే అని గుర్తింతుము. అయినను ప్రభువు పౌలును కాపాడినట్లు మనలను కాపాడును. ప్రభువు మనలను కాపాడును కనుక మనము భయపడక ప్రకటించాలి.

**7-8వ. తిరుగుబాటు చేయకూడదు:-** వారు తిరుగుబాటు చేయువారు గనుక వారు వినినను వినకపోయినను నేను సెలవిచ్చిన మాటను నీవు వారికి తెలియజేయుము. వారు తిరుగుబాటు చేసినట్లు మనము చేయకూడదు. దేవుని మాటకు విధేయత చూపాలి.

**9-10వ. గ్రంథమును భుజించాలి:-** నేను నీతో చెప్పుమాటను విని నోరు తెరచి నేనిచ్చు దాని భుజించుము అనెను. నేను చూచుచుండగా గ్రంథమును పట్టుకొనిన యొక చెయ్యి నాయొద్దకు చాపబడెను. ఆయన దాని నా ముందుర విప్పగా అది లోపటను వెలుపటను వ్రాయబడినదై యుండెను. మహా విలాపమును మనోదుఃఖమును రోదనమును అని అందులో వ్రాయబడి యుండెను. కనుక బైబిలు గ్రంథములో రక్షణ, ఆశీర్వాదాలతోపాటు తీర్పులను కలిగిన గ్రంథమని గుర్తించాలి. బైబిలు గ్రంథములోని తీర్పులు విలాపమును కలిగించునవి. ప్రకటించువారికి వినువారికి ఇది కష్టతరముగా నుండును.

**3:1-3వ. భక్షించి కడుపు నింపుకొనాలి:-** 1-2వ. నరపుత్రుడా, నీకు కనబడిన దానిని భక్షించుము. ఈ గ్రంథమును భక్షించి ఇశ్రాయేలీయుల యొద్దకు పోయి వారికి ప్రకటన చేయుము. నేను నోరు తెరువగా ఆయన ఆ గ్రంథము నాకు తినిపించాడు. బోధించు వారు ముందుగా దేవుని సన్నిధిలో కనిపెట్టి వాక్యమును ఆయన ద్వారా తినిపించబడాలి/ నేర్చుకోనాలి. స్పర్జన్ గారు ఆదివారము ప్రసంగముకై వారమంత ప్రభువు దగ్గర కనిపెట్టి నేర్చుకొని బోధించువాడు.

3వ. నరపుత్రుడా, నేనిచ్చుచున్న యీ గ్రంథమును ఆహారముగా తీసికొని దానితో నీ కడుపు నింపుకొనుమని నాతో సెలవియ్యగా నేను దాని భక్షించితిని; శరీరమునకు ఆహారము

ఎంత అవసరమో ఆత్మకు వాక్య ఆహారము అంత అవసరము. అది నా నోటికి తేనెవలె మధురముగా నుండెను. మనము వాక్యమును విని మన వ్యక్తిగత జీవితములో విధేయత చూపి అందులోని తీపి మాధుర్యమును ముందుగా మనము అనుభవించాలి. జార్జి ముల్లర్ గారు తన జీవిత కాలములో రెండు వందల పర్యాయములు బైబిలు చదివి, ధ్యానించి బోధించాడు. అలాగు మనము బైబిలు చదివి ధ్యానించిన తరువాతనే బోధించాలి.

## 3వ. అధ్యాయము (3+4+4+4+6+6=27వ)

అంశము:- సేవా జీవితానికి నియామకము.

**1-3వ. భక్షించి కడుపు నింపుకొనాలి:-** రెండవ అధ్యాయములో చూచితిమి.

**4-27వ. నియామకపు ఉత్తరువు.**

**4-7వ. దేవునిచేత పంపబడుట (4-5వ.) - వెళ్ళుట (6-7వ).:-** నరపుత్రుడా, నీవు బయలుదేరి ఇశ్రాయేలీయులయొద్దకు పోయి నా మాటలు వారికి తెలియజెప్పుము. నీవు గ్రహింపలేని ఏస మాటలు పలుకు అన్యజనుల యొద్దకు నిన్ను పంపుటలేదు, అట్టివారి యొద్దకు నేను నిన్ను పంపిన యెడల వారు నీ మాటలు విందురు. ఇశ్రాయేలీయుల యొద్దకే నిన్ను పంపుచున్నాను అన్నాడు. ఇశ్రాయేలీయులందరు 1) సిగ్గుమాలినవారు, 2) కఠిన హృదయులు, 3) దేవుడు చెప్పిన మాటల నాలకింపనొల్లరు, 4) యెహెజ్కేలు మాటలు విననొల్లరు. అన్యులు దేవుని మాట వినుటకు ఇష్టపడుట, ఇశ్రాయేలీయులు వినకపోవుట ఎంత భయంకరమో ఆలోచించాలి. కాని యెహెజ్కేలు తన మాటలు విననొల్లని వారి యొద్దకు వెళ్ళి బోధించాలని ప్రభువు చెప్పగా వెళ్ళాడు. విశ్వాసులమైన మనము అనుదినజీవిత విధానములోను/సేవా జీవితములోను ప్రభువు మాట వినుచున్నామో లేదో మనలను మనము పరీక్షించుకోనాలి. ప్రభువు మాట వినుట ఆశీర్వాదకరము.

**8-11వ. దేవుడు చెప్పు మాటలే చెప్పుట:-** ఇదిగో వారిముఖమువలెనే నీ ముఖమును కఠినమైనదిగాను, నీ నుదురును చెకుముకిరాతికంటె కఠినముగా ఉండు వజ్రమువలె చేసెదను; వారికి భయపడకుము, వారందరు తిరుగుబాటు చేయు వారైనను వారిని చూచి జడియకుము అన్నాడు. కొరింథు పట్టణములో ప్రభువు నీవు భయపడక మాటలాడుము, మౌనముగా ఉండకుము. నేను నీకు తోడైయున్నాను. నీకు హాని చేయుటకు నీమీదికి ఎవడును రాడు; ఈ పట్టణములో నాకు బహు జనమున్నదని పౌలుతో చెప్పగా అతడు వారిమధ్య దేవుని వాక్యము బోధించుచు, ఒక సంవత్సరము మీద ఆరునెలలు అక్కడ నివసించాడని ముందు అధ్యాయములో చూచితిమి. (అపొ 18:9).

నరపుత్రుడా, చెవియొగ్గి నేను నీతో చెప్పు మాటలన్నిటిని చెవులారవిని నీ మనస్సులో

ఉంచుకొని బయలుదేరి చెరలోనున్న నీ జనుల యొద్దకు పోయి యీమాటలు ప్రకటింపుము, వారు వినినను వినకపోయినను ప్రభువైన యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడని చెప్పుమని ఆయన నాతో సెలవిచ్చెను. ఇశ్రాయేలీయులు ఇప్పుడు శిక్షగా డెబ్బది ఏండ్ల చెరలో నున్నారు. అయినను దేవుని మాట వినుటకు ఇష్టపడుటలేదు. కాని యెహెజ్కేలు, యిర్మీయా నిరుత్సాహపడక ప్రకటించిరి.

**12-15వ. పని వివరణ (12-13వ) - ఆత్మచేత నింపబడుట (14-15వ.):-** 12-13వ. అంతలో ఆత్మనన్నెత్తికొనిపోగా యెహోవా ప్రభావమునకు స్తోత్రము కలుగును గాక అను శబ్దమొకటి ఆయన యున్న స్థలమునుండి ఆర్భాటముతో నా వెనుక పలుకుట నేను వింటిని. దీని భావము దేవుని స్తుతించుచు పని ప్రారంభించాలని నేర్చుకొందము. మరియు ఆ జంతువుల రెక్కలు ఒక దానికొకటి తగులుటవలన కలుగు చప్పుడును వాటి ప్రక్కనున్న చక్రములధ్వనియు గొప్ప సందడి జరుగుచున్నట్లుగా నాకు వినబడెను. రెక్కల చప్పుడు వాక్య ప్రకటనను, చక్రము ప్రభువును, ధ్వని చక్కని స్పష్టమైన స్వరముతో సువార్త ప్రకటించాలని మనకు గుర్తుచేయుచున్నది.

14-15వ. ఆత్మ నన్నెత్తి తోడుకొనిపోగా నా మనస్సునకు కలిగిన రౌద్రాగ్నిచేత బహుగా వ్యాకులపడుచు కొట్టుకొని పోయినప్పుడు, యెహోవా హస్తము నా మీద బలముగా వచ్చెను. ఆత్మ నన్నెత్తికొనిపోగా అని పదే పదే యెహెజ్కేలు అనుటను బట్టి ఆత్మచేత నింపబడి ఆత్మావశుడై సేవచేశాడని నేర్చుకొందము. రౌద్రాగ్ని, బహుగా వ్యాకులపడుట అను మాటలు యెహెజ్కేలు, సేవమీద కలిగిన భారమును తెలియచేయుచున్నవి. కెబారునది దగ్గర తేలాబీబు అను స్థలమందు కాపురమున్నను చెరపట్టబడిన ఇతరులవలె బానిసగా కాక కొంత స్వతంత్రత కలవాడుగా నున్నాడు. వారి యొద్దకు వచ్చి, యేమియుచెప్పకయు కదలకయునున్నవాడనై యేడు దినములు అనగా సంపూర్ణకాలము ప్రభువు దగ్గర కనిపెట్టుచు వారి మధ్య నుండెను.

**16-21వ. చేయవలసినవి చేయుట - చేయక పోవుట:-** 16-17వ. ఆ యేడు దినములు జరిగిన తరువాత యెహోవా వాక్కు ప్రత్యక్షమై నరపుత్రుడా, ఇశ్రాయేలీయులకు కావలిగా నేను నిన్ను నియమించియున్నానని తెలియపరచాడు. దేవుడు స్పష్టముగా పని వారిని నియమించునని గుర్తించాలి. సేవకు నియమించబడిన వాడు దేవుని నోటిమాట ఆలకించి దానినిబట్టి ప్రజలను హెచ్చరించాలి.

18-19వ. అవశ్యముగా నీవు మరణమవుదువని నేను దుర్మార్గుని గూర్చి ఆజ్ఞ ఇయ్యగా నీవు అతనిని హెచ్చరిక చేయకయు, అతడు జీవించునట్లు తన దుర్మార్గతను విడిచి పెట్టవలెనని వానిని హెచ్చరిక చేయకయు నుండిన యెడల ఆ దుర్మార్గుడు తాను చేసిన దోషమునుబట్టి మరణమవును గాక అతని రక్తమునకు నిన్ను ఉత్తరవాదిగా ఎంచెదను

అన్నాడు. మరియు నీవు దుర్మార్గుని హెచ్చరిక చేయగా అతడు తన దుర్మార్గత నుండి దుష్క్రియల నుండియు మరలని యెడల అతడు తన దోషమును బట్టి మరణమవును గాని నీవు (ఆత్మను) తప్పించుకొందువు అన్నాడు. 20-21వ. నీతి గలవాడు తన నీతిని విడిచి దుర్నీతిని అనుసరించినందున అతని ముందర అభ్యంతరము పెట్టగా అతడు మరణమగును. ప్రవక్త అతనిని హెచ్చరిక చేయని యెడల పూర్వము తాను చేసిన నీతి జ్ఞాపకమునకు రాకుండ అతడు తన దోషమును బట్టి 1 కొరి. 11:30-31వ. ప్రకారము మరణమవును. అయితే అతని ప్రాణ విషయములో ప్రవక్తను ఉత్తరవాదిగా ఎంచుదును అన్నాడు. అయితే పాపము చేయవలదని నీతిగల వానిని ప్రవక్త హెచ్చరిక చేయగా అతడు హెచ్చరింపబడి పాపము చేయక మానిన యెడల అతడు అవశ్యముగా బ్రదుకును, ప్రవక్త తన మట్టుకు తాను (ఆత్మను) తప్పించుకొనును అన్నాడు. దుర్మార్గుని విషయమై - హెచ్చరిక చేయకపోతే అని 18వ.లోను, దుర్మార్గుని విషయములో హెచ్చరికచేస్తే అని 19వ.లోను, నీతిగలవాని విషయమై - హెచ్చరిక చేయకపోతే అని 20వ.లోను, నీతిగలవాని విషయమై హెచ్చరికచేస్తే అని 21వ.లోను చెప్పాడు. నీతిమంతులు సంఘమునకు గురుతుగాను, దుర్మార్గులు లోకములోని అవిశ్వాసులకు గురుతుగాను తలంచగలము. పైన చెప్పబడిన పనులన్ని కావలివారైన పనివారికి అప్పగింపబడ్డాయని గుర్తించాలి. లూకా 17:7వ. ప్రకారము పనివాడు దున్నువాడుగా లోకమునకు సువార్త ప్రకటించాలని, మేపువాడుగా సంఘమునకు వాక్యమను మేతను అందించాలని పనికి నియమించబడినవారు నేర్చుకొనాలి.

**22-27వ. పనిలోని బంధకములు:-** 22-23వ. యెహోవా నీవు లేచి మైదానపు భూమికి వెళ్లుము, అక్కడ నేను నీతో మాటలాడుదునని అన్నాడు. ప్రవక్త వెంటనే లేచి మైదానపు భూమికి వెళ్లగా, కెబారునది దగ్గర యెహోవా ప్రభావము ప్రత్యక్షమాయెను. ప్రవక్త నేలను సాగిలపడినట్లు మనము సాగిలపడాలి. ఆత్మ మనలో ప్రవేశించి చక్కగా నిలువబెట్టిన తరువాత యెహోవా మనతో మాటలాడి సెలవిచ్చును. 24వ. కొన్ని పర్యాయములు ఇతరులు మన మీద పాశములువేసి వాటితో బంధించుదురు గనుక వారి యొద్దకు వెళ్లక మనము ఇంటిలోనే దాగియుండవలెను. 25-26వ. కొన్ని సార్లు మౌనముగా నుండునట్లు దేవుడు మన నాలుకను అంగిటికి అంటుకొనజేయును. 27వ. దేవుడు మన నోరు తెరచు వరకు కనిపెట్టుకొనాలి. మన నోటిని దేవుడు తెరచిన తరువాత తిరుగుబాటు చేయు ప్రజల యొద్దకు పోయి వినువాడు వినునుగాక విననొల్లనివాడు విననొల్లక యుండునుగాక అని యెహోవా సెలవిచ్చుచున్నాడని వారితో చెప్పవలెనని గుర్తుంచుకొందము.

### (2) 4-7 అధ్యా. నాశనమును గూర్చి - 4 సూచనలు 4 శిక్షలు

## 4వ. అధ్యాయము (3+5+9=17వ)

**అంశము:- 4 అధ్యా.లో 3 సూచనలు - 5 అధ్యా.లో - 1 సూచన.**

**1) 4:1-3వ. మొదటి సూచన - పెంకుమీద గీయబడిన యెరూషలేము రూపము**

**2) 4:4-8వ. రెండవ సూచన - కుడి ఎడమ ప్రక్కల పండుకొనిన ప్రవక్త.**

**3) 4-9-17వ. మూడవ సూచన - కొలత ప్రకారం ఆహారం - నీళ్ళు**

**4) 5:1-4వ. నాలుగవ సూచన - మంగలకత్తితో ప్రవక్త పూర్తిగా క్షవరము చేసికొనుట.**

**1-3వ. మొదటి సూచన - పెంకు మీద గీయబడిన యెరూషలేము పట్టణ రూపము:-**

మొదటి సూచన: పెంకు బలహీనమైనది. దానిమీద యెరూషలేము పట్టణము పటము వేసి దాని చుట్టూ ముట్టడివేసినట్లు దాని చుట్టూ కూలగొట్టు యంత్రములున్నట్లు గీయాలి. ఒక రేకు దానిచుట్టూ పెట్టాలి. దానికి వెలుపల ప్రవక్త దృష్టి ఉంచి దాని పైననే చూడాలి.

భావము:- పెంకుపై యెరూషలేము గీయబడింది. యెరూషలేము పట్టణము 7 కొండలు మీద కట్టబడింది. ఇశ్రాయేలీయులు కొండవంటి బలవంతుడైన దేవునిపై ఆధారపడేవారు. కాని ఇప్పుడు వారి పరిస్థితి మారింది. బలహీనమైన పెంకు మీద పట్టణము ఉన్నట్లు - **వారు వారి పట్టణము భక్తిలో ఎంతో బలహీనముగా ఉన్నారు అని చూపుచున్నాడు.** అంతేకాదు, దాని చుట్టూ, ప్రాకారమును కూలగొట్టు యంత్రములు ఉన్నవి. అది పట్టణమును నాశనము చేయును. యెహెజ్కేలు దానిని చూస్తూ ఉన్నాడు. ఇక్కడ యెహెజ్కేలు దేవునికి గుర్తుగా ఉన్నాడు. దేవుడు వారిని కట్టాడు పడగొట్టువాడు ఆయనే. తిరిగి కట్టువాడు ఆయనే. (యిర్మీయా 45:4). కాని క్రీస్తు వీరి మరియు మన బలహీనతల కొరకై, తన బలము అంతయు యిచ్చి కీర్తన 22:15వలో నా బలము ఎండిపోయి చిల్లపెంకువలె ఉన్నదని చెప్పుచున్నాడు. దేవుని మీద వారు, విశ్వాసులమైన మనము ఆధారపడవలెనని భావము.

**4-8వ. రెండవ సూచన - కుడి, ఎడమ ప్రక్కలు ప్రవక్త పండుకొనుట:-**

సూచన: నీవు నీ ఎడమ ప్రక్క 390 దినాలు పండుకొని ఉండి, వారి దోషములు భరింపవలెను. ఆ తర్వాత కుడిప్రక్క పండుకొని 40 దినములు యూదావారి దోషం భరించాలి. అనగా సంవత్సరమునకు ఒక దినము చొప్పున 430 సంవత్సరాలకు 430 దినములు పండుకొని యుండాలి. ఈ సమయములో దేవుడే బంధించుచున్నాడు. భావము: దావీదు క్రీ.పూ. **1010-970,** సొలొమోను క్రీ.పూ. 970 930 వరకు పాలించిరి. సొలొమోను పాలనలో 4వ సం॥క్రీ.పూ. (966)లో దేవాలయ నిర్మాణము ప్రారంభించబడి క్రీ.పూ. 960లో ముగించబడినది. సొలొమోను తదుపరి రెహబాము నుండి 20 మంది రాజులు సిద్కియా వరకు పాలించిరి. క్రీ.పూ. 966 నుండి 536 వరకు యూదావారు దోషులైనందున క్రీ.పూ 606 నుండి 536 వరకు బబులోను చెరలో నుండిరి. 966 నుండి 536 వరకు 430 సంవత్సరముల దోషమునకు బదులు 430 దినాలు ప్రవక్త పండుకొని ఉండుట

అను సూచన జరిగించాడు. ప్రవక్త యిర్మీయా ప్రవచించిన క్రీ.పూ. 626-586 వరకు, 40 సంవత్సరాలు కూడా యూదావారు దోషములు చేయుచుండినందున 40 ఏండ్ల పాపమునకు సూచనగా ప్రవక్త కుడివైపున 430 దినాలలోనే చివరి 40 దినాలు పండుకొని చూపించాడు. వారి దోషములను యెహెజ్కేలు భరించినట్లు క్రీస్తు మన దోషములను సిలువలో భరించాడు. (యెష 53:11).

**9-17వ. మూడవ సూచన - కొలత ప్రకారం ఆహారం తినుట, నీళ్ళు త్రాగుట:-**

9-13వ. గోధుమలు, చొళ్ళు (జొన్నలు) జీలకఱ్ఱ, సజ్జలు, వీటన్నిటిని ఒక పాత్రలో ఉంచి రొట్టెలు చేసి దినమునకు 20 తులములు (200 గ్రాములు) 390 దినములు తినాలి. దినమునకు అరపడి నీళ్ళు వేళవేళకు త్రాగాలి. 20 తులములు (200గ్రా) బహుశా మూడు చిన్న రొట్టెలు కావచ్చును. ఒక పూటకు ఒక చిన్న రొట్టె తినాలి. అరపడి (పడి= $1\frac{1}{2}$ లీటరు); అరపడి = $\frac{3}{4}$ లీటరు నీరు 3 పూటలు త్రాగాలి. ఒక పూటకు $\frac{1}{4}$ లీటరు త్రాగాలి, అనగా ఈ దినాలలో దొరకు ఒక చిన్న నీళ్ళ పాకెటు మాత్రమే ఒక పూటకు త్రాగాలి. ప్రవక్త యొక్క సేవా విధానము ఎంతో కష్టము. 16, 17వ. నీళ్ళు, రొట్టె కొద్ది మోతాదులో ఇవ్వడం అనునది సూచన. దీని నెరవేర్పుగా బబులోను రాజు వచ్చి యెరూషలేమును ముట్టడివేసినప్పుడు పట్టణంలో నీళ్ళు, ఆహారం, విషయంలో కరువు వచ్చుటను చూడగలము. మనకును కరువులు కలిగినప్పుడు శిక్షగా కలిగినదేమోనని ఆలాగే మనము కూడా పరీక్షించుకొనాలి. (2 సమూ 21:1).

## 5వ. అధ్యాయము (4+4+5+4=17వ)

**అంశము:- పాపము - ప్రవర్తనా ఫలము**

**1-4వ. మంగలకత్తితో ప్రవక్త పూర్తిగా క్షవరము చేసికొనుట:-** 1వ. నీ తలవెంట్రుకలు నీవే క్షౌరము చేసికొనుము అన్నాడు. ఎంత కష్టము. వెంట్రుకలు అందమైనవి. వెంట్రుకలు ఘనతను (1 కొరి. 11:15), సౌందర్యమును (2 సమూ. 14:26), బలమును (న్యాయా. 16:17) సూచించును. అవి రాలడం ఇష్టం లేదు కాని కత్తితో నీవే పూర్తిగా క్షౌరము చేసికొనుము. యెహెజ్కేలు దేవునికి గుర్తుగా ఉన్నాడు. దేవుడే తలవెంధ్రుకల వంటి తన కిష్టమైన ఇశ్రాయేలీయులను ఆయనే కత్తితో క్షౌరము చేస్తాడు. తలను క్షౌరము చేయుట (బోడినెత్తి) అవమానానికి గుర్తు. అనగా పాపమును బట్టి యూదావారిని అవమానానికి అప్పగిస్తాడు. సర్వసాధారణముగా యుద్ధములో చెరపట్టిన బానిసలకు గుండు చేయుదురు. యూదావారు బబులోనుకు చెర వెళ్ళు సమయమున వారికి గుండు చేయబడునని దీని భావము. 2వ. పట్టణములో 3వ భాగం కాల్చివేస్తాడు - కరువు, తెగులు ద్వారా

మరణించుట. 2వ భాగము - ఖడ్గమునకు అప్పగిస్తాడని అనగా యుద్ధములో కూలుదురని భావము. మిగిలిన కొన్నిటిని గాలికి వదిలి విసరివేస్తాడు. మిగిలినవారు యుద్ధమునుబట్టి పారిపోవుదురని దీని భావము. వాటిలో కొన్నిటిని చెంగున కట్టుకొనుట; పారిపోవు వారు బంధింపబడి బబులోను చెరకు వెళ్ళుదురని భావము. ఖడ్గము దూసి వాటిని తరుముదును అన్నాడు. రెండవ దిన. 36:17 దీని నెరవేర్పుగా యూదావారు తరుమబడిరి.

అగ్నితో కాల్చుదును - రెండవ దిన. 36:19 ఆకలి అను అగ్నితో చనిపోవుటను చూడగలము. 3వ. అయితే వాటిలో మిగిలిన వాటిని నీ చెంగులో కట్టుకొనుము. అనగా బబులోను చెరలో నీతో ఉన్నవారు క్షేమంగా ఉంటారు అని భావం. 4వ. మిగిలిన వాటిని మరలా తీసి అగ్నివేసి కాల్చుము. అనగా చెరలోనున్న వారు అగ్ని వంటి శ్రమలలో కాలుదురని భావము. (1 పేతురు 4:12). అందరు తగుల బెట్టబడుదురు. అందరు ఒక రాజ్యముగా నుండక తగులబెట్టబడుదురు. నేటికి ఇశ్రాయేలీయులు ఒక రాజ్యముగా గాని, జనాంగముగా గాని లేరు. (వ్యక్తిగతంగా కొందరు మాత్రమే మిగిలారు).

**5-8వ. వారి పాపాన్ని చూపుట:-** 5వ. అన్యుల మధ్యను మిమ్మును ఉంచాను - ఎందుకు? అన్యుల మధ్య ఉంటే వారు మీ సత్క్రియలు చూచినప్పుడు మీరు వారికి వెలుగుగా, దీపముగా కనబడాలి (మత్తయి 5:15). ఇశ్రాయేలు వారు ప్రపంచానికి కేంద్రంగా ఉన్నారు. వార్తాపత్రికలలో కూడా నేటికి వార్తలు వీరి జీవిత, వ్యవసాయ విధానం గూర్చి ఉన్నాయి.

6వ. అయితే వారి పరిస్థితి 1. దేవుని విధులు తృణీకరించుట, 2. కట్టడలు అనుసరించుట 3. దుర్మార్గతను అనుసరించుట 4. అన్యుల కంటె దుర్మార్గులుగా ఉన్నవారు. 7వలో మరలా చెప్పుచున్నాడు. మీరు నా విధులు అనుసరింపక అన్యులకు ఉన్న విధులనైనను అనుసరింపక భ్రష్టులైతిరి. అన్యులకంటెను భ్రష్టులైతిరి అంటున్నాడు.

8వ. కాబట్టి మీకు విరోధినైతిని అంటున్నాడు. రూతు 1:13,21 నయోమి వారి కుటుంబ సభ్యులు దేవుని ఆజ్ఞగైకొనకపోవుట వలన దేవుడు విరోధియాయెను. అందుకే యాకోబు 4:4వ.లో మనము ప్రభువును గాక లోకమును స్నేహిస్తే దేవుడు మనకు శత్రువు, విరోధి అని వ్రాయబడినది.

**9-13వ.లలో దీనినిబట్టి దేవుడు వారికి ఇచ్చు ఫలములు:** 9వ. వారి హేయకృత్యములను బట్టి ముందెన్నడూ చేయని కార్యములను చేస్తానని పౌరుషముగల దేవుడనని చెప్తున్నాడు. 10వ. తండ్రులు - కుమారులను తిందురు. ఇది ఎంత ఘోరమైన విషయము. ఇది కరువు కాలమున జరిగి ఉండవచ్చు. వీరిని నలుదిక్కుల చెదరగొట్టెదను అన్నాడు. **11వ.** వారి పూజా విధానము: నేడు మన ఆరాధన, క్రియలు ఎలా ఉన్నాయో లెక్కించబోవుచున్నాడు.

వారిపట్ల జాలియైనను చూపను. నేడు మనము యోహాను 4:24 ప్రకారము ఆత్మతోను, సత్యముతోను ఆరాధన చేయునట్లు, యోగ్యముగా చేయునట్లు సరిచూచుకొందము. 12వ. 3వ భాగంలో ఖడ్గం, తెగులు, మిగిలిన భాగం కత్తిదూసి నలుదిశల చెదరగొట్టుదురు. 13వ. నీ మీద తీర్పు తీర్చి నా ఉగ్రత తీర్చుకొందును అంటున్నాడు. 1-4వచనములలో వీటి వివరము చెప్పబడినది.

**14-17వ అన్యులు అవమానపరచేటట్టు** చేయుట:- 14వ. అన్యులకు మిమ్మును పాడుగాను, నిందాస్పదముగా చేస్తాను అని అంటున్నాడు. 15వ. నీ పోషణాధారమునైన వాటిని తీసివేస్తాను అన్నాడు. ఎంత తీవ్రమైన తీర్పు; నేడు మన కుటుంబములో కరువులకు, లోటులకు కారణం మన భక్తిహీన జీవితమే. గద్దింతును అని అంటున్నాడు.

16వ. అన్యుల మధ్య నిన్ను నిందకు, హెచ్చరికకు ఆస్పదముగా చేస్తానంటున్నాడు; కొన్ని ప్రభువు పంపు శిక్షలు మనకు హెచ్చరికలు. వాటిని గమనించి విధేయులమైతే దీవెన పొందగలము. ఆది 12 అధ్యా. అబ్రాహాము కరువులో ఐగుప్తు వెళ్ళాడు. కొన్ని ఇబ్బందులు వచ్చాయి. కాని తిరిగి 13 అధ్యాయంలో మొదట ఎక్కడ బలిపీఠము కట్టినాడో అక్కడికే వచ్చి దీవెన పొందాడు. అన్యులకు నిన్ను నిందగాను, అపహాస్యాస్పదముగా ఉంచుదును అన్నాడు. 17వ. దుష్టమృగాలను పంపుదును అన్నాడు. దుష్టమృగాలు అనగా అన్యరాజ్యములు కావచ్చు. అలాగైతే అన్యజనులకు అప్పగిస్తాడు. పుత్రహీనత కలుగజేయుట: నెబుకద్నేజరు దానియేలును అతని మిత్రులను బహుశ నపుంసకులుగా చేసాడు. (యెషయా 39:7) అనగా వారికి పుత్రులు కలిగే అవకాశం లేదు. బహుషా ఇదే నెరవేర్పు కావచ్చు.

## 6వ. అధ్యాయము (6+8=14వ)

**అంశము:- పట్టణము పాడగుట, ప్రజలు హతులగుట అను రెండు శిక్షలు**

దోషమునకు శిక్ష పంపుచున్నాడు. 6:6వ. వారు విగ్రహాలు పెట్టారు, కట్టారు. సూర్యదేవతకు స్తంభాలు నిలిపారు. యిర్మీయా 44:18. ఆకాశరాణికి పూజలు చేశారు. తమ్మూజు దేవతను పూజించారు అని కూడా ఉంది. తమ్మూజు ఒక దేవత వాడు మే నెలలో ఎండలకు చనిపోతాడు. వర్షాల నిమిత్తము స్త్రీలు ఏడ్వగా మరలా వచ్చి వర్షం కురిపిస్తాడు అని బబులోను వారి నమ్మకము. యూదావారు కూడా తమ్మూజు అను వర్షముల దేవతను పూజించేవారు. అందువలన 6:6; 6:10,13,14; 7:4,9,27లో నేనే యెహోవానై ఉన్నాని తెలుసుకొందురు అని వ్రాయబడినది. మొత్తము ఏడు పర్యాయములు 6,7 అధ్యాయాలలో నేనే యెహోవానై ఉన్నాని చెప్పుచున్నాడు.

అదేవిధంగా యోహాను సువార్తలో 7సార్లు యేసు ప్రభువు నేనే అన్న పదాలున్నాయి. (1) జీవాహారము నేనే 6:35. (2) నేను వెలుగును 8:12. (3) ద్వారము నేనే 10:7 (4) నేను మంచికాపరిని 10:11. (5) పునరుత్థానము జీవము నేనే 11:25. (6) నేనే మార్గము 14:6. (7) ద్రాక్షావల్లిని నేను 15:10.

**1-6వ. పట్టణము పాడగుట:-** 1-2వ. ఇశ్రాయేలీయుల పర్వతముల తట్టుచూచి ప్రకటించుము అన్నాడు. అనగా పర్వతములు మీద ఉన్న ప్రతిచెట్టు క్రింద విగ్రహాలు, పూజలు చేస్తున్నారు. అందుకే ఆ తట్టు చూచి ప్రకటన చేయడం. 3వ. వాటన్నిటిని - అనగా విగ్రహాలను, స్తంభాలను, బలిపీఠములను అన్నిటిని నాశనము చేస్తాను అంటున్నాడు. 4వ. మీ ఎదుటనే వాటిని నాశనం చేతును. 1 సమూ. 5:1-11. 5-6వ. అన్నిటిని నాశనము చేస్తాను అన్నాడు. అందుకు నేను యెహోవానై ఉన్నానని తెలిసికొందురు. కొన్నిసార్లు మనమీదికి దేవుడు పంపు శిక్షను బట్టి మనము ఆయనను తెలుసుకొంటాము. మరియ, మార్తల యింటిలో లాజరు మరణం పునరుత్థానము అనే తీర్పు విధానం ద్వారా ఆయన, నేనే పునరుత్థానం, జీవము అనే విషయాన్ని ఆ కుటుంబస్థులే కాక అనేక యూదులు కూడా తెలుసుకున్నారు.

ఈ రీతిగా వారి విగ్రహాలను నాశనం చేయుటయే మొదటి శిక్ష.

**7-14వ. ప్రజలు హతులగుట (రెండవ శిక్ష):-** 7-10వ. కొద్దిమందిని శేషముగా అన్యజనుల మధ్య ఉంచగా వారీ సంగతులు చూచి దేవుని గ్రహింతురని సెలవిచ్చుచున్నాడు. 11-14వ. విగ్రహారాధననుబట్టి పట్టణములో ప్రజలు హతులగుట: నీ చేతలు చరచి, నేలతన్ని అయ్యో, అని అరవాలి అన్నాడు. యెహెజ్కేలు ఎందుకు ఏడ్చుచున్నాడు; అనగా దేవుడు కూడా వారి విషయమై ఏడ్చుచున్నాడు అనే దానికి గుర్తుగా ఉన్నది. ఎన్నిసార్లు తప్పిదములు చేసినా ఆయన దీర్ఘశాంతుడు గనుక చూస్తూనే ఉన్నాడు. ప్రసంగి 8:11, 2 పేతురు 3:9,15; భయం విడచి తిరిగితే తగిన కాలంలో శిక్షవచ్చును. 12-13 వచనాలలో వారందరు హతులగుదురని సెలవిచ్చుచున్నాడు. ఇది రెండవ శిక్ష.

## 7వ. అధ్యాయము (14+13=27వ)

**అంశము:- యూదా వారికి ప్రవర్తన (గర్వమును) ఫలమును బట్టి బబులోను ద్వారా కలుగు నాశన తీవ్రత - మూడు, నాలుగు శిక్షలు.**

**1-14వ. మూడవ శిక్ష - దేశమునకు శిక్ష:-** 1-5వ. యెహోవా వాక్కు ప్రత్యక్షమై ఇశ్రాయేలీయుల దేశమునకు అంతము వచ్చియున్నది. నలుదిక్కుల దేశమునకు అంతము వచ్చేయున్నదని సెలవిచ్చుచున్నాడు. ఇప్పుడు నీకు అంతము వచ్చే యున్నది. నా కోపము

నీమీద తెప్పించు నీ ప్రవర్తననుబట్టి నీకు తీర్పు తీర్చి, నీవు చేసిన సమస్త హేయకృత్యముల ఫలము నీమీదికి రప్పించుచున్నాను అన్నాడు. నీ యెడల కటాక్షముంచకయు కనికరము చూపకయు నుండి, నేను యెహోవానైయున్నానని నీ వెరుగునట్లు నీ ప్రవర్తనఫలము నీవు అనుభవింపజేసెదను అన్నాడు. 6-10వ. వారి ప్రవర్తననుబట్టి వారికి తీర్పు తీర్చి, వారి సమస్త హేయకృత్యముల ఫలము వారి మీదికి రప్పించెదను అన్నాడు. యెహోవానగు నేనే నిన్ను మొత్తువాడనై యున్నానని నీవెరుగునట్లు నీ ప్రవర్తన ఫలము నీవనుభవింపజేసెదను అన్నాడు. నీ హేయకృత్యములు నీ మధ్యనుండనిత్తును. ఆ దినము దండము వలె పూచియున్నది. గర్వము చిగిరించియున్నది, బలాత్కారము పుట్టి దుష్టులను దండించును అన్నాడు. 11-14వ. వారిలోనైనను, వారి గుంపులోనైనను, వారి ఆస్తిలోనైనను, వారికున్న ప్రభావములోనైనను ఏమియు శేషింపదు. ఈ దర్శనము వారి సమూహమంతటికి చెందును, అది తప్పక జరుగును, వారందరు దోషులైరి గనుక తమ ప్రాణము రక్షించుకొనుటకు వారిలో ఎవరును ధైర్యము చేయరు.

**15-27వ. నాల్గవ శిక్ష - మిగిలిన ప్రజలు సమూలముగా ధ్వంసమగుట:-** 15-20వ. వారు సర్వసన్నద్ధులై బూకానాదము చేయుదురు గాని వారి సమూహమంతటిమీదికి నా ఉగ్రత వచ్చియున్నాది గనుక యుద్ధమునకు పూనుకొనువాడొకడును ఉండడు. బయటనున్న వారు ఖడ్గముచేత చత్తురు, పట్టణములోనున్న వారిని క్షామమును తెగులును మింగును. వారు గోనెపట్టకట్టు కొందురు, వారికి ఘోరమైన భయము తగులును, అందరు సిగ్గుపడుదురు, అందరి తలలు బోడియగును. యెహోవా ఉగ్రత దినమందు వారి వెండియే గాని బంగారమే గాని వారిని తప్పించజాలదు. అది వారి దోషక్రియలు విడువకుండ అభ్యంతరమాయెను దానితో వారు హేయమైన దేవతల విగ్రహములు చేసిరి గనుక నేను దానిని వారికి రోతగా చేసి శిక్షించెదను అన్నాడు.

**21-24వ.** వారు దాని అపవిత్రపరచునట్లు అన్యుల చేతికి దోపుడు సొమ్ముగాను దుర్మార్గులైన జనులకు లూటిగాను నేను వారిని అప్పగించి, వారిని చూడకుండ నా ముఖమును నేను త్రిప్పుకొందును అన్నాడు. సంకెళ్లు సిద్ధపరచుము. 25-27వ. సమూల ధ్వంసము వచ్చేయున్నది, జనులు సమాధానము కొరకు విచారించుచున్నారు గాని అది వారికి దొరకదు. వారు ప్రవక్తయొద్ద దర్శనము కొరకు విచారణ చేయుదురు గాని యాజకులు, పెద్దలు ఆలోచన చేయకయే యున్నారు. రాజు వ్యాకులపడుచున్నాడు, సామాన్య జనులు వణకుచున్నారు. నేను యెహోవానైయున్నాని వారందరు తెలిసికొనునట్లు వారి ప్రవర్తన ఫలము నేను వారి మీదికి రప్పింపబోవుచున్నాను, వారు చేసిన దోషములను బట్టి వారికి తీర్పు తీర్చబోవుచున్నాను అన్నాడు.

(3) 8-11 అధ్యా - నాశనమునకు కారణమైన 4 పాపములు - 4 శిక్షలు

# 8వ. అధ్యాయము (6+6+3+3=18వ)

అంశము:- 4 పాపముల వివరణలు

**6వ సం॥మున దేవుని వాక్కు వచ్చింది. (క్రీ.పూ. 597 నుండి ఆరవ సం॥ క్రీ.పూ 591).**

**1-6వ. మొదటి పాపము - ప్రజల పాపము - ఆరాధన సంబంధముగా (బహిరంగ పాపం):-** 1వ. యింట కూర్చుండగా... చెరలో ఉన్నా కూడా యెహెజ్కేలు స్వేచ్ఛలో ఉన్నాడు. చెరలోనున్న యూదా పెద్దలు ఆయన యింటికి వచ్చారు. ఇప్పటి వరకు యెహెజ్కేలు ప్రకటించగా - పెద్దలలో కదిలింపు వచ్చింది; అప్పటిలో యిర్మియా యూదయలో చెరకు వెళ్ళనివారికి ప్రకటిస్తున్నాడు. యిర్మీ 29:1-3 చెరలోనున్న వారికి యిర్మీయా ద్వారా మాటలు వచ్చాయి.

ప్రభువు హస్తము యెహెజ్కేలు మీదకు వచ్చెను - పెద్దలు మాట్లాడుచుండగా వచ్చెను. అప్పుడు ప్రవక్తకు మరొక దర్శనం కలిగింది. (1 అధ్యా.లో మాదిరిగా).

2-3వ. దేవుని హస్తము - దేవుడు చెయ్యి చాచి యెహెజ్కేలు తల వెంట్రుకలు పట్టుకొని - ఆత్మ యెరూషలేమునకు తీసుకొని వెళ్ళాడు. అప్పుడు కొన్ని విషయాలు చెప్పాడు. అప్పటి నుండి 11:24 వరకు చూపి - తిరిగి మరలా చెరలో వారి మధ్యకు తీసుకొని వచ్చాడు. ఇక్కడ శరీరంలో నుండి ఆత్మకొనిపోయిన సందర్భము చెప్పబడినది. అలాగే అపొ 8:39లో ఫిలిప్పు ఆత్మవశుడుగా కొనిపోయిన సందర్భము - 2 కొరింథీ. 12:2. పౌలు పరదైసుకు కొనిపోబడిన సందర్భాము కలవు.

3వ. ఏమి చూపాడు? - యెరూషలేము పట్టణ ఉత్తరవైపునున్న (కీర్తన 48:12,13) ద్వారములు, బురుజులు ఆవరణములో ఉన్నాయి. అక్కడే దోషము కనబడినది. విగ్రహము - విగ్రహాలు ఏవైన ఆయనకు దోషమే. (నిర్గ 20:5). దీనికి సూచనగా హోషేయ 1:2లో- హోషేయను వెళ్ళి వ్యభిచారిణిని పెండ్లి చేసుకోమన్నాడు. ఇశ్రాయేలీయులు విగ్రహారాధకులు అయ్యారు. అందుకు దేవునికి రోషము పుట్టినది. 5వ. తేరి చూడమంటే యెహెజ్కేలు చూచుచున్నాడు. మనం కూడా ఆయన చూపిన స్థలం, వైపు చూడాలి వెళ్లమంటె వెళ్ళాలి (యోహాను 21:1-3వ). ఇశ్రాయేలీయులలో 20 మంది రాజులలో 12 మంది రాజులు విగ్రహారాధన చేశారు. వారిలో మరీ భ్రష్టుడు, మనష్షే (2 రాజులు 21:1-3). 6వ. నేను విడచి పోవునట్లుగా వారు చేసిన హేయకృత్యములు చూచితివా? అని దేవుడు ప్రవక్తను ప్రశ్నిస్తున్నాడు.

**7-12వ. రెండవ పాపము - పెద్దల పాపము - ప్రార్థనా సంబంధము: (రహస్యంగా):-** 7-8వ. మరియొక హేయకృత్యము చూపించాడు. గోడకు కన్నము వేయుట ద్వారా దానిలో ద్వారమొకటి కనబడినది. 9వ. లోపలికి చొచ్చిన తర్వాత - విగ్రహాలను చూపిస్తానన్నాడు. 10వ. ఇశ్రాయేలీయులు విగ్రహాలు ప్రాకెడు ఆకారాలు అనగా ఐగుప్తు దేవతల ఆకారములు హేయమృగాల ఆకారములు అనగా అష్షూరీయుల దేవతల విగ్రహములన్నియూ గోడమీద, చుట్టూ వ్రాయబడునట్లు (గీయబడినట్లు) కనబడెను. 11-12వ. ఆ గదులలో 70 మంది పెద్దలు కనిపించారు, మరియు షాపాను కుమారుడైన యాజన్యాయు ఉన్నారు. వీరు ఆ ఆకారములు గల వాటికి ఎదురుగా నిలిచి ఉన్నట్టు ఉన్నది. ఇది రహస్యంగా జరుగుచున్నది. వారి ఎదుట చిక్కని మేఘమువలె ధూపవాసన ఎక్కుచుండెను. దేవుడేర్పరచిన పెద్దల, ప్రజల పాపాలు ఇక్కడ కనిపిస్తున్నాయి. ప్రజల పాపం బహిరంగంగాను, పెద్దల పాపము రహస్యంగా ఉంది. నేటి దినాలలో అలాగే ఉన్నది. - ప్రజలు విగ్రహములకు బలిపీఠం దగ్గర ఆరాధన చేస్తున్నారు. పెద్దలు ధూపము వేయుచున్నారు అనగా ప్రార్థన చేస్తున్నారు. మొదటిది ప్రజల పాపము - రెండవది పెద్దల పాపము.

**13-15వ. మూడవ పాపము - స్త్రీల పాపము - యాచన సంబంధమైనది:-** ఇది మరియొక హేయకృత్యము. 13వ. నీవు ఈ తట్టు తిరిగిన యెడల మరిన్ని చూపుతానన్నాడు. 14-15వ. తమ్మూజు అను నాలుగువ నెలలో వీరు అంగలార్పు చేస్తున్నట్లు చూడగలం. ఇది స్త్రీల పాపము. తమ్మూజు మే నెలలో ఎండకు చనిపోతాడట; అప్పుడు వారు ఏడ్చితే వాడు మరలా పుడతాడని అనగా వర్షం పడును అని అన్యుల నమ్మకం. తమ్మూజుకు యూదా స్త్రీలు ఏడ్చుచూ ప్రార్థన చేస్తున్నారు. అందుకే ఇవి ముందున్న వాటి కంటే అధికమైన హేయకృత్యము. తమ్మూజు బబులోనీయుల దేవత. ఆ దేవతను పూజించినందున మరల వారిని బబులోనుకు దేవుడు చెరగా పంపాడు. ఇది న్యాయమే కదా!

**16-18వ. నాల్గవ పాపము యాజకుల పాపము - సేవా సంబంధముగా - మందిరములో:-** 16వ. దహన బలిపీఠము, పరిశుద్ధ స్థలంనకు మధ్యలో 25 మంది మనుష్యులు (యాజకులు) కనబడ్డారు; వీరి వీపులు దేవుని ఆలయంతట్టు, వారి ముఖములు తూర్పు తట్టు, వారే తూర్పు తట్టు ఉండుట కనబడింది. వీరు యాజకులే - వీరు సూర్యుని వైపు ముఖములు త్రిప్పగా నిజదేవునిపట్ల వీరు అయిష్టము ఉన్నారు. ఇప్పుడు యాజకులు సేవ సంబంధముగా పాపం చేస్తున్నారు.

17-18వ. ఇలా ఎవరెవరి పాపము అనగా 1) ప్రజలు 2) పెద్దలు, 3) స్త్రీలు, 4) యాజకులు. పాపమునుబట్టి దేవునికి కోపము పుట్టిస్తారు. 18వ. వారు ఇకను ఎంత

బిగ్గరగా మొఱ్ఱపెట్టినా నేను వినను, ఆలకింపను అని దేవుడైన యెహోవా అంటున్నాడు. కనుక 9అ.లో ఒక శిక్ష, 10అ.లో రెండవ శిక్ష, 11అ.లో మూడవ శిక్ష, నాల్గవ శిక్షను పంపుచున్నాడు.

దేవుడు ప్రవక్తల ద్వారా పాపానికి శిక్షగా ఇశ్రాయేలీయులను ఐగుప్తుకు, అష్షూరుకు, బబులోనుకు పంపాడు. యూదావారు ఐగుప్త, బబులోనీయుల విగ్రహాలు పెట్టి పూజించితే వారి దేవుళ్ళు మనకు దయచూపగలరు అని నమ్మినట్లు నేటి దినాలలోను కొన్నిసార్లు దిష్టివైపు విగ్రహములవైపు మనస్సు పెట్టి క్రైస్తవులు పాటించుచున్నారు. ఎంత విచారము.

## 9వ. అధ్యాయము (5+6=11వ)

**అంశము:- పట్టణములోని ప్రజలు హతము చేయబడుట (1-11వ.)**

**1-5వ. అందరిని హతము చేయుడని ఆజ్ఞాపించుట (మొదటి శిక్ష):-** 1-2వ. హతము చేయుటకు కావలివారిని పిలువగా - ఆయుధములు పట్టుకొని ఆరుగురు, వారి మధ్యలో ఒకడు; మొత్తము 7గురు, ఉత్తర దిక్కునుండి వస్తున్నారు. వారిలో అవిసెనార బట్ట కట్టుకున్నవాడగు క్రీస్తు ఆరుగురు మనుష్యుల మధ్య ఉన్నాడు. నాశనము చేయుటకు మనుష్యులను వాడాడు; ఆరు మానవ సంఖ్య. బలమైన మానవ సముదాయాన్ని తీసుకొని దేవుడు రాబోవుచున్నాడు; నెబుకద్నేజరు రాజ్యం బలమైన రాజ్యంగా ఉంది; ఇలాంటివారి ద్వారా నాశనం చేయబోవుచున్నాడు. లేఖికుడు - సిరాబుడ్డి, అనగా వ్రాసేవాడు; మన జీవితాన్ని వ్రాసేవాడు క్రీస్తే! మాటలను, చర్యలను వ్రాతలలో దాచేవాడు; తీర్పు తీర్చువాడుగా ఉన్నాడు. 3వ. దేవుని మహిమ లేఖికుని పిలుస్తున్నాడు. 4వ. యెరూషలేములో హేయకృత్యాలు జరుగుచున్నవి. దానిని గూర్చి మూల్గి ప్రార్థించవలసిన బాధ్యత మనకు ఉంది; అంతేకాని వారితో సాంగత్యము చెయ్యొద్దు. పాపము ప్రభుత్వము చేయుచుండగా మనం వారిని గూర్చి ప్రార్థించాలి; యెషయా 59:16లో చెప్పబడినట్లు మధ్యవర్తులుగా మనము ప్రార్థించాలి; వీరు ప్రజలు, పెద్దలు, స్త్రీల, యాజకుల పాపము విషయమై ప్రార్థిస్తున్నారు; మనం కూడా ప్రార్థిద్దాము. 4వ. వెళ్ళి ప్రార్థించువారికి లలాటము గుర్తు వెయ్యాలి; ఎందుకటే వారు సంహరించబడకుండా, యోహాను 5:22 ప్రకారము క్రీస్తే తీర్పుతీర్చును. లలాటము గుర్తు: హెబ్రీ భాషలోని 22 అక్షరాలలో చివరిది తౌ - T అనగా "T" (సిలువ గురుతు) వారిమీద వెయ్యాలి. వారే శిక్ష నుండి విడిపించబడుదురు. నిట్టూర్పులు చేయు వారిని ఆయన వచ్చి అనేక శ్రమల నుండి విడిపిస్తాడు. దీని భావము ఆయన వచ్చినప్పుడు క్రీస్తు రక్తమును అనగా సిలువను ఆశ్రయించిన వారికి విడుదల కలుగును. ప్రకటన 7,8 అధ్యాయాలలో గుర్తులు వేసిన వారిని తప్ప మిగిలిన వారిని శిక్షించి గుర్తున్న వారిని

కాపాడుట దీని నెరవేర్పుగా తలచగలము. 5వ. అందరిని హతము చేయుము అని లేఖికునికి ఆజ్ఞాపించాడు.

**6-11వ. ఆజ్ఞాపించినట్లు చేసిన లేఖికుడు:-** 6-7వ. స్త్రీలు, పెద్దలు, పిల్లలను హతము చేయండి! గుర్తు ఎవరికి లేకుండునో వారిని చంపగోరి మందిరము ముందున్న పెద్దలను, పట్టణములోని ప్రజలను హతముచేయసాగిరి. యెహెజ్కేలు తప్ప మిగిలి ఎవరూ ఉండలేదు. అందరూ హతము చేయబడిరి. **8-11**వ పట్టణమందు యెహెజ్కేలు తప్ప మరి ఎవరూ శేషించి ఉండకుండుటనుబట్టి యెహెజ్కేలు ప్రార్థించగా యూదా వారి దోషము బహు ఘోరమైనందున కటాక్షము ఉంచకయు, కనికరము చూపకయు వారి ప్రవర్తన ఫలమును వారనుభవింపచేసెదనని దేవుడు సెలవిచ్చెను. అవిసెనార బట్ట ధరించుకొనిన వాడు వచ్చి నీవు నాకాజ్ఞాపించనట్లు నేను చేసితినని చెప్పెను. కెరూబులపైనున్న దేవుని మహిమ దర్శనమును **1** అధ్యాయంలో ప్రవక్త బబులోనులో ఉండగా చూచాడు. **8-11** అధ్యాయాలలో యెరూషలేముకు దర్శనములో ప్రవక్త వెళ్ళి చూచాడు. కెరూబుల పరిచర్య అటు యెరూషలేములోను, ఇటు బబులోనులోను కనిపించుచున్నందున మనము కూడా సంఘ పరిచ్య, బయట పరిచర్య (లోకంలో పరిచర్య) ఉన్నవి. లూకా **17:7**లో దున్నువాడుగాని, మేపువాడు గాని మీలో ఒకనికి దాసుడుండగా అనుమాటను బట్టి దాసులమైన మనకు మేపు పరిచర్య (సంఘములో పరిచర్య), దున్ను పరిచర్య (సువార్త లోకానికి ప్రకటించు పరిచర్య) ఉన్నవని తలంచగలము.

## 10వ. అధ్యాయము (7+8+7=22వ)

అంశము:- రెండవ శిక్ష - పట్టణము అగ్నిచేత కాల్చబడుట

**1-7వ. అవిసెనార బట్ట ధరించిన వానితో పట్టణము మీద అగ్నిని చల్లగా పట్టణము నాశనము చేయబడుట:-** కెరూబులు పైగా అకాశమండలము వంటి దానిలో నీలకాంతమయమైన సింహాసనము కనబడెను. అవిసెనార బట్ట ధరించిన వానితో యెహోవా కెరూబుల మధ్యనున్న నిప్పులు పట్టణము మీద చల్లుమని సెలవియ్యగా అతడు మందిరం లోపలికి పోయి కెరూబుల దగ్గర నిలచెను. కెరూబులలో ఒకడు తమ మధ్య ఉన్న అగ్ని నిప్పులు తీసి అవిసెనార బట్ట ధరించిన వానికి ఇవ్వగా అతడు పట్టణమును మీద వాటిని చల్లి పట్టణము అగ్నిచేత కాల్చివేసెను. పాపమునుబట్టి పట్టణము, ప్రజలు కాలిపోయిరి. పాపము చేసిన వారిని నిర్మూలించితేనే నేను మీకు తోడుగా ఉందునని ఆకాను పాపము చేసినప్పుడు యెహోషువ 7:12లో చెప్పాడు.

**8-15వ. మొదటి అధ్యాయంలో యెహెజ్కేలు చూచిన కెరూబులను గూర్చిన దర్శనము ఇక్కడ చూచుచున్నాడు. వివరములు మొదటి అధ్యాయంలో ధ్యానించితిమి.**

**16-22వ. యెహోవా మహిమ:-** యెహెజ 8:4వలో మందిరమందు కనిపించెను. 9:3వ లోను 10:4లోను మందిరపు గడప దగ్గరకు వచ్చి నిలిచెను. 10:18వలో మందిర గడప దగ్గర నుంచి బయలుదేరి కెరూబుల పైన నిలువగా కెరూబులు రెక్కలు చాపి నేలనుండి పైకిలేచెను. అవి లేవగా చక్రములు కూడా లేచెను. అవి యెహోవా మందిరపు తూర్పు ద్వారము దగ్గర దిగెను.

## 11వ. అధ్యాయము (13+12=25వ)

**అంశము:- యూదా వారికి రానున్న 3వ, 4వ శిక్షలు**

**1-13వ. యూదావారు బబులోను రాజుకు అప్పగింపబడుట (మూడవ శిక్ష):-** 1-6వ. మందిరము యొక్క గుమ్మపు వాకిటి దగ్గర 25గురు మనుష్యులకు ప్రధానులైవారు కనబడిరి. ఈ పట్టణములో పాపము దురాలోచనలు చేయువారు వీరే అని చెప్పబడెను. ఇక్కడ ప్రజల పెద్దలు పాపము చేసినట్లు 8:16లో 25గురు యాజకులు సూర్యునికి నమస్కారము చేయుచూ దోషులైరి. అటు పెద్దలు, ఇటు యాజకులు అందరూ దోషులైరి. వీరితో కలిసి ప్రజలను, పట్టణంలో బహుగా హత్య జరిగించిరి. అందుచేత పట్టణంలోని ప్రజలు చంపబడుట, మిగిలిన వారు వెళ్ళగొట్టబడుట జరుగును. వెళ్ళగొట్టబడినవారు విధించబడిన శిక్షను అనుభవించుటకై అన్యులైన బబులోను వారికి అప్పగించబడుదురు.

7-13వ. వీరు యెరూషలేములో పాపముతో యోచించుచున్నారు. పట్టణం వచనపాత్రవంటిదనియూ, మనం మాంసము వంటివారమని మనం కాలిపోము అనుకుంటుండగా దేవుడు యిర్మీయా ద్వారా నేను మీ మీదికి ఖడ్గము రప్పిస్తాను, మీరు ఖడ్గమునకు భయపడుచున్నారు. మనము యెరూషలేములో ఇండ్లు కట్టుకోవచ్చును అనుకుంటున్నారే అని, యెరూషలేము నుండి యిర్మీయా ద్వారా చెరలోనున్న వారికి ఒక లేఖ పంపించాడు. యిర్మీ. 29:3-11. ఏమనగా మీరు చెరలో యిండ్లు కట్టుకోండి - అన్ని కార్యములు చేయండి, 70ఏండ్లు కాలం బబులోనులోనే ఉంటారు. వారి బబులోను పట్టణ క్షేమమే - మీ క్షేమము కావున వారి కొరకై ప్రార్థించండి. పెండ్లిచేసుకోండి. ఆ తర్వాత తిరిగి వస్తారు అని వర్తమానము. కాని ఇక్కడ పెద్దలు యెరూషలేములో ఇండ్లు కట్టుకోవాల్సిన అవసరం లేదా? అనుకుంటున్నారు. ఇంకా అనేక అబద్ధ బోధకులు వచ్చి యెరూషలేములో కట్టుకోవచ్చు అంటున్నారు. అట్టి వారిలో ప్రవచించిన పెలట్యా చచ్చెను. ఆ దినాలలోనే అబద్ధ ప్రవచనం మొదలైనది. ఇప్పుడు పెలట్యాతోనే చనిపోవుట ప్రారంభమయినను దేవుడు చెప్పిన దానికి ప్రజలు ఎప్పుడూ వ్యతిరేకంగా పాపము చేస్తున్నారు. అందుకై యెహెజ్కేలు ఇక్కడ విజ్ఞాపనకర్తగా ఉన్నాడు. పట్టణము కొరకై ఇశ్రాయేలీయుల శేషమును నీవు నిర్మూలము చేయుదువా? శేషమును ఉంచుదువా? అని

(9వ అధ్యా.లో దేవుడే శేషమును నిర్మూలము చేయక ఉంచుదును అన్నాడు) ప్రభువును అడిగాడు.

**14-25వ. పట్టణము నుండి ప్రభువు మహిమ వెళ్ళిపోవుట (నాలుగవ శిక్ష):-** 14-17వ. చెరలోనికి వెళ్ళిన వారిలో నుండి శేషము తిరిగి వచ్చుట: దేవుడు ఆయా దేశములలోని దూరమునున్న అన్యజనులలోనికి వారిని తోలివేసినను కొంతకాలము తానే వారికి ఆ దూరదేశాలలో పరిశుద్ధాలయముగా ఉంటానన్నాడు. అందువలన కొందరు మనస్సును మార్చుకొనుటనుబట్టి అట్టివారిని సమకూర్చి రప్పించి ఇశ్రాయేలీయుల దేశమును వారి వశము చేసెదనని చెప్పుచున్నాడు.

18-21వ. విగ్రహారాధన యూదా వారిలో నుండి తీసివేయబడుట: తిరిగి వచ్చిన యూదా వారికి దేవుడు రాతిగుండెను తీసివేసి మాంసపు గుండెను ఇచ్చి నూతన ఆత్మను వారి యందు పుట్టించును. అందువలన వారు దేవుని జనులై ఉండి, విగ్రహారాధనను మానివేయుదురు. కాని ఎవరు విగ్రహాలను అనుసరించుచుందురో వారి మీదికి ప్రవర్తనా ఫలమును రప్పించును.

22-25వ. 9:3లో మహిమ మందిర గడప దగ్గరకు వచ్చుట, 10:4లో మందిర గడప దగ్గర దిగి నిలుచుట 10:19లో కెరూబులపై తట్టు నిలిచి కెరూబులు నేల నుండి పైకి లేచి తూర్పు ద్వారము దగ్గర నిలచెను. ఇప్పుడు కెరూబులు తమ రెక్కలు చాపగా దేవుని మహిమ వాటిపైన ఉండెను. యెహోవా మహిమ పట్టణంలో నుండి పైకెక్కి పట్టణపు తూర్పు దిశగా నున్న కొండకు పైగా నిలిచెను. తర్వాత కనబడకుండా పోయెను. అందువలన దేవుని మహిమ యూదావారిని విడచి వెళ్ళిపోయెనని తలంచగలము. తర్వాత ఆత్మ దర్శనంలో యెహెజ్కేలును పైకెత్తి కల్దీయుల దేశమునకు తీసికొని రాగా తాను యెరూషలేములో చూచిన వాటన్నిటిని చెరలో నున్న వారికి తెలియచేసెను.

**(4) 12-15 అధ్యాయాలు - నాశనమును గూర్చి ప్రధానులకు 4 ప్రదర్శనములు (4 శిక్షలు) 4 సామెతలు (14:21).**

## 12వ. అధ్యాయము (16+12=28వ)

అంశము:- నాశనమును గూర్చిన 2 ప్రదర్శనలు: యెరూషలేము రాజుకు రెండు ప్రదర్శనలతో కూడిన వర్తమానము

**1-16వ. మొదటి ప్రదర్శన: సామాగ్రి మూట భుజమున పెట్టుకొని దేశాంతరముపోవుట అను ప్రదర్శన (1-8వ) - భావము (9-16వ.):-**

**1-8వ. దేశాంతరము పోవుట అను ప్రదర్శన:-** యూదావారు తిరుగుబాటు చేయువారని

2వ.లోను 3వ.లోను 9వ.లోను, 25వ.లోను 4 పర్యాయములు చెప్పుచున్నాడు. యూదా ప్రధాని (1) ద్రోహి అని (2 దిన 36:14) (2) చూచు కన్నులుండియు చూడక (2 దిన 36:14) (3) విను చెవులు కలిగియు వినక ఉన్నాడని (2 దిన 36:16) లోను (4) తిరుగుబాటు చేయువాడని (2 దిన 36:13) లో కలదు. కనుక యూదా ప్రధానియగు రాజైన సిద్కియా మీదికి రానున్న శిక్షను గురించిన ప్రదర్శన ఈ భాగంలో యెహెజ్కేలు చేసి చూపించునని దేవుడు సెలవిచ్చాడు. దేశాంతరము పోవువానివలె సామాగ్రిని మూటకట్టి అందరూ చూచుచుండగ అస్తమయమున గోడకు కన్నము వేసి సామాగ్రిని తీసుకొని రంధ్రం ద్వారా బయటికి వచ్చి రాత్రియందు మూట భుజము మీద పెట్టుకొని నేల కనబడకుండా ముఖము కప్పుకొని ప్రయాణమై పొమ్మన్నాడు.

9–16వ. మొదటి ప్రదర్శన భావము:

దేశపు ప్రధానియైన సిద్కియాకు ఈ భావము చెందినను ప్రజలు కూడ చెరలోనికి పోయి దేశాంతర నివాసులగుదురు. ప్రధాని సిద్కియా రాత్రియందు సామాగ్రిని భుజము మీద పెట్టుకొని తానే మోసుకొని పోవుటకై గోడకు కన్నము వేసి రంధ్రము గుండా బయటికి వచ్చి నేల చూడకుండా తప్పించుకొని పోవుటకై బయలుదేరినప్పుడు దేవుడు వల యొగ్గి చిక్కించుకొని సిద్కియా రాజును బబులోను దేశమునకు పంపును. అయితే ఆ స్థలము చూడకయే అతడు అక్కడ చచ్చును. దీని నెరవేర్పుగా బబులోను రాజు దేశముపై దండెత్తి వచ్చినప్పుడు సిద్కియా రాజు తప్పించుకొని పోవుచుండగా బబులోను రాజుచేత పట్టబడి కన్నులు తీసివేయబడి, బబులోనుకు కొనిపోబడెను. అందుచేత సిద్కియా ఆ దేశమును చూడలేదు. అతడు తదుపరి ఆ దేశములోనే చనిపోయెను. సిద్కియాకు సహాయకులైన దండువారిని నలుదిక్కుల చెదరగొట్టగా ప్రజలు యెహోవాను తెలుసుకొందురని సెలవిచ్చెను. ఈ సంగతి అన్యులు తెలుసుకొనుటకై దేవుడు వీరిని అన్యదేశములో ఉంచెను.

**17–28వ. రెండవ ప్రదర్శన – తల్లడింపు చింతకలిగి వణకుచు ఆహారము తినుట:–**

17–20వ. వణకుచు ఆహారము తిని తల్లడింపు కలిగి నీళ్ళు త్రాగి దేశపు ప్రజలకు ప్రకటించిన ప్రవక్త. ప్రవక్త ఆలాగు చేయుట చూచిన ప్రజలకు దేవుడు ఈలాగు సెలవిచ్చాడు. యూదా వారి మధ్య బలాత్కారము ఉన్నందున యూదా దేశమంతా శత్రురాజులచేత పాడైపోవును. ఆ యుద్ధ సమయంలో ప్రజలందరూ చింతలో ఆహారం తిందురు. భయభ్రాంతితో నీళ్ళు త్రాగుదురు. పట్టణము పాడై ఉండుటనుబట్టి యెహోవా దేవుడని ప్రజలు తెలుసుకొనుటకై ఈలాగు జరుగునని దేవుడు సెలవిచ్చెను.

21–28వ. తిరుగుబాటు చేయు ప్రజలకు నాశనము తప్పదని దేవుని వర్తమానము. దేవుడు బహు దీర్ఘశాంతము గలిగి ప్రవక్త ద్వారా తాను సెలవిచ్చిన నాశనము

వెంటనే జరుగకపోవుట చూచి, దేశపు ప్రజలు ప్రతి దర్శనము నిరర్థకమగుచున్నది అను సామెత చెప్పుకొనుచుండిరి. దేవుడు వారికి జవాబుగా ఇకమీదట దేశములో అటువంటి సామెత చెప్పకుండా తాను చెప్పిన నాశనము ఇక ఆలస్యము చేయకుండా జరిగింతునని యూదావారికి సెలవిచ్చెను.

## 13వ. అధ్యాయము (7+9+7=23వ)

**అంశము:- నాశనమును గూర్చిన 3వ, 4వ ప్రదర్శనలు - యెరూషలేములో ప్రవక్తలకు రెండు ప్రదర్శనలతో కూడిన వర్తమానము.**

**1-7వ. ప్రభువు పంపకపోయిననూ ప్రకటించు ప్రవక్తలకు శ్రమ:-** యూదావారి ప్రవక్తలకు విరోధముగా ప్రవచించుమని దేవుడు యెహెజ్కేలుతో సెలవిచ్చాడు. దర్శనమేమియూ కలుగకపోయినను యూదావారి ప్రవక్తలు స్వబుద్ధిని అనుసరించి ప్రవచించుచు అవివేకులైరి. నమ్మదగని సోదెగాండ్రయి ఈ ప్రవక్తలు పాడైన స్థలములలో నున్న నక్కలవలె ఉన్నారని, సెలవిచ్చాడు. యూదావారి ప్రాకారపు గోడలు బీటలుబారి ఉన్నవని ప్రవక్తలైతే వాటిని దిట్టపరచక ఉన్నందున యుద్ధ దినమందు ప్రాకారములు స్థిరముగా నిలువవనియు యూదావారికి, ప్రవక్తలకు శ్రమలు కలుగునని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

**8-16వ. మూడవ ప్రదర్శన - స్థిరతకు రాని గచ్చుపూతను పూయు ప్రవక్తలు:-** యూదావారి మధ్య సమాధానమేమియూ లేకపోయిననూ సమాధానమున్నదని వారి ప్రవక్తలు చెప్పుచున్నందున వారు నా ప్రవక్తలు కారని దేవుడు సెలవిచ్చుచున్నాడు. జనులు మంటి గోడ కట్టినట్టుగా తమ జీవితములను భద్రత లేనివిగా కట్టుకొనుచుండగా ప్రవక్తలు దాని మీద గచ్చుపూత పూసి భద్రముగా ఉన్నారని సెలవిచ్చుచున్నారు. గచ్చుపూతపూయు ప్రవక్తలతో వర్షము ప్రవాహముగా కురియునని వడగండ్ల తుఫాను చేత ఆ గోడ పడిపోవునని దేవుడు తానే రౌద్రము తెచ్చుకొని ఈ కార్యము జరిగింతునని సెలవిచ్చుచున్నాడు. యెరూషలేముకు సమాధానము లేకపోయినను సమాధానమున్నదని ప్రవచించు ప్రవక్తలకు ఇట్టి గతి పట్టునని దేవుడు సెలవిచ్చాడు.

**17-23వ. నాల్గవ ప్రదర్శనము - మనస్సుకు వచ్చినట్లు ప్రవచించు యూదా జనుల కుమార్తెలు:-** యూదావారి ప్రవక్తలు ప్రజలను వేటాడవలెనని చేతులకు కాళ్ళకు గుడ్డలు, తలకు ముసుగులు, వేసి ప్రజలను వేటాడుచున్నందున అట్టివారికి శ్రమ కలుగునని దేవుడు సెలవిస్తున్నాడు. ఆ ప్రవక్తలు బారెడు యవలు కొరకు, రొట్టె ముక్కల కొరకు ఆశపడి మరణమునకు పాత్రులు కాని వారిని చంపుచూ బ్రతుకుటకు అపాత్రులైన వారిని బ్రతికించుచూ ప్రజల మధ్య దేవునిని దూషించుచున్నారు.

ఇందునుబట్టి యూదావారు తమ జీవితములను దిద్దుకొనలేకపోతున్నారు. అట్టి ప్రవక్తల వశము నుండి ప్రజలను తప్పించి తాను దేవుడనని తెలుసుకొనునట్లు చేతునని యెహోవా సెలవిచ్చుచున్నాడు.

## 14వ. అధ్యాయము (11+12=23వ)

**అంశము:- యెరూషలేము నుంచి యూదయ పెద్దలకు 3 సామెతలతో కూడిన వర్తమానము**

**1వ సామెత - హృదయంలో విగ్రహాలను నిలుపుకొనే దోషము (3వ.) 2.వ సామెత - మనస్సులో విగ్రహాలను నిలుపుకొనే దోషము (7వ). 3వ. సామెత - ప్రవక్త యొద్ద విచారించువాని దోషమెంతో, ప్రవక్త దోషమంత అను సామెత (11వ).**

**1-11వ.** హృదయములోను, మనస్సులోను విగ్రహాలను నిలిపి ప్రవక్తల యొద్ద విచారించు **పెద్దమనుష్యులు అను రెండు సామెతలు:-** 1-6వ. మత్తయి 22:37 ప్రకారము పూర్ణహృదయంతోను, పూర్ణమనస్సుతోను దేవునిని సేవించాలి. కాని యూదా పెద్దలు మొదటి హృదయములో విగ్రహాలను (2) మనస్సులో విగ్రహాలను నిలుపుకొని దోషులైరి. మార్కు 7:6, హృదయం దూరంగా వుండి పెదవులతో ఆరాధించుట వేషధారణ అని చెప్పబడింది, 7:21లో హృదయంలో నుండి దురాలోచనలు... అహంభావము, అవివేకము చెడ్డవన్నియూ బయలువెళ్ళి మనుష్యుని అపవిత్రపరచును. 7-11వ. దోషములనుబట్టి మనుష్యుల నిర్మూలము (7,8వ):- ప్రవక్తల నిర్మూలము ప్రవక్త యొద్ద విచారించువాని దోషమెంతో, ప్రవక్త దోషము అంతే అని 3వ సామెత చెప్పబడింది. ప్రవక్త యొద్ద విచారించు ప్రజలు మనస్సులో విగ్రహం నిలుపుకొని, దేవుని యొద్ద విచారించవలెనని వచ్చిననూ వారిని జనాలలో వుండకుండా నిర్మూలింతునని దేవుడు సెలవిచ్చుచున్నాడు. అలాగే ప్రవక్త మోసపోయి అబద్ధమును ప్రవచించిన ఎడల దేవుడు వానిని నిర్మూలము చేయుదునని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

**12-23వ. విశ్వాసఘాతకానికి దేశానికి 4 తీర్పులు:-** 12-14వ. మొదటి తీర్పు - కరువు ద్వారా మనుష్యులు, పశువులు నిర్మూలమగుట ఏ దేశమైతే విశ్వాసఘాతకమై, దేవుని దృష్టికి పాపము చేసినదో దానికి నేను విరోధినై ప్రాణాధారమైన ఆహారం లేకుండా చేసి మొదటి తీర్పుగా కరువు రప్పించి మనుష్యులను, పశువులను నిర్మూలము చేయుదును అని అంటున్నాడు. 15-16వ. రెండవ తీర్పు - మృగముల ద్వారా దేశము పాడగుట. రెండవ తీర్పుగా బాటసారులు సంచరించకుండా ఆ దేశము నిర్జనమై పాడగునట్లు దేవుడు దాని మీదికి దుష్టమృగములను రప్పించగా దేశము పాడగును.

17-18వ. 3వ తీర్పు - యుద్ధము, ఖడ్గము ద్వారా సమస్తము నిర్మూలము మూడవ తీర్పుగా దేవుడు అట్టి దేశము మీదికి యుద్ధము రప్పించి, ఖడ్గమును పిలిచి - ఈ

దేశమునందు సంచరించి, మనుష్యులను, పశువులను నిర్మూలము చేయునని ఆజ్ఞ ఇచ్చుచున్నాడు. **19-20వ (4వతీర్పు) - తెగులు ద్వారా మనుష్యులు, పశువులు,** నిర్మూలమగుట పాపంచేసి దేవుని దృష్టికి విశ్వాసఘాతకమైన అట్టి దేశమునకు దేవుడు **4వ తీర్పును తెగులు పంపి మనుష్యులను, పశువులను నిర్మూలమగుటకై** ప్రాణ హానికరమగుసంతగా ఆయన రౌద్రమును కుమ్మరించిన యెడల దేశంలో మనుష్యులు, పశువులు నిర్మూలమగును.

21-23వ. పై 4 తీర్పుల తర్వాత కొద్ది శేషమును దేవుడు నిలిపి బయటకు రప్పించగా వారి ప్రవర్తనను, క్రియలను చూచి దేవుడు నిర్హేతుకముగా చేయలేదని ఓదార్పునొందుదురు. ప్రభువు విశ్వాసఘాతకులైన వారిపై ఖడ్గము చేతను, క్షామముచేతను, దుష్టమృగములచేతను, తెగులుచేతను, 8:4 విధములైన తీర్పులు యెరూషలేము మీద తీర్పు తీర్చిన యెడల నోవహు, దానియేలు, యోబు అనువారు ఆ దేశమందు ఉండినను దాని రక్షింపలేరు. అప్పుడు యెరూషలేము మీదికి దేవుడు పంపిన కీడును గూర్చియు, సంభవింపచేసినదంతటిని గూర్చియు యెరూషలేము వారు ఓదార్పు నొంది, వారి ప్రవర్తనను క్రియలను చూచి దేవుడు చేసినదంతయు నిర్హేతుకముగా చేయలేదని వారు తెలుసుకొనునట్లు ఓదార్పు నొందుదురు.

## 15వ. అధ్యాయము (5+3=8వ)

**అంశము:- యెరూషలేము ప్రజలకు 4వ సామెతతో కూడిన వర్తమానము**

**4వ సామెత : దేవుడు అగ్నికి అప్పగించిన ద్రాక్షచెట్టు అడవి చెట్లలో ఏలాటిదో యెరూషలేము కాపురస్థులును అట్టివారే (6వ).**

**1-5వ.** నిష్ఫలమైన ద్రాక్ష చెట్టు గురించిన సామెత:- నిష్ఫల ద్రాక్షాచెట్టు కర్ర అడవిచెట్ట కర్రలకంటె ఏ మాత్రము శ్రేష్ఠమైనది కాదు. అది బహుమెత్తనిదైనందున, ఉపకరణములు తగిలించు కర్ర కొరకైనను పనికిరాక కాల్చబడును. అగ్నిచేత రెండుకొనలు కాలి నడుమ నల్లబడిన తర్వాత కేవలము పనికిరానిదగును.

**6-8వ. రెండు కొనలు కాలి నల్లబడిన కర్ర:-** ద్రాక్షాచెట్టు ఇశ్రాయేలు వంశము కాగా (యెషయా 5:7) కాలిన రెండు కొనలు యూదావారి క్రీ.పూ. 606లోని మొదటి విడత చెరగాను, రెండవకొన క్రీ.పూ. 597లోని రెండవ విడత చెరగా తలంచగలము. నడుమ కాలి నల్లబడుట రానున్న 3వ విడత చెర మరియు సమూల నాశనముగాను తలంచగలము. క్రీ.పూ. 606లో ప్రముఖులైన దానియేలు, షద్రకు, మెషకు, అబెద్నెగోలు, చెరకు కొనిపోబడి నపుంసకులుగా చేయబడిరి. (యెష 39:7), మందిరములోని ఉపకరణములు కొనిపోబడి బబులోనులోని దేవత ఆలయ బొక్కసములో ఉంచబడెను. పై

నష్టములన్నియు ద్రాక్షాకర్రకు ఒక వైపున కాలిన సూచనగా తలంచగలం. క్రీ.పూ. 597లో యెహెజ్కేలు వంటి ప్రముఖులు కొనిపోబడుట, వీరితో ప్రజలు చెరకు కొనిపోబడుట రెండవవైపు ద్రాక్షాకర్రకాలుటగా తలంచగలం. రానున్న 3వ విడత చెరలో దేవాలయము, పట్టణము, దేశము కాల్చబడుట ప్రజలు కత్తివాతకు కూలుట, క్షామము ద్వారా తెగులు ద్వారా, నష్టమగుట అనునవన్నియు ద్రాక్షాకర్ర నడుమను కాలి దేనికిని పనికిరానిదిగా మారుటనుగా తలంచగలము.

దేవుడు అగ్నికి అప్పగించిన ద్రాక్షాచెట్టు అడవిచెట్టు ఏలాంటిదో యెరూషలేము కాపురస్థులును అలాంటివారే, అను 4వ సామెత చెప్పబడింది.

**(5) 16-19 అధ్యా: నాశనమును గూర్చిన 4 ఉపమానములు - రెండు సామెతలు.**

## 16వ. అధ్యాయము (14+10+10+9+10+10=63వ)

**అంశము:- యూదావారు వేశ్యయైన సౌందర్యవతిగా పోల్చబడిన ఉపమానం (మొదటి ఉపమానము) భావము**

**I. 1-14వ. యూదావారి జననము అభివృద్ధి:-** (1) 1-4వ. పుట్టుక. (2) 5-8వ. పెరుగుదల. (3) 9-12వ. అలంకరింపబడుట. (4) 13-14వ. ప్రభావముచే నింపబడుట.

II. **15-34వ.** యూదావారి పాపం **(15-24వ)** - పాపపు ప్రత్యేకత **(25-34వ.)**:- (1) 15-19వ. యూదావారి పాపము చూపుట. (2) 20-24వ. కుమారులు చేసిన పాపము నేర్పుట. (3) 25-29వ. వ్యభిచరించిన దేశముల వివరములు. (4) 30-34వ. వ్యభిచార విధానము.

III. **35-43వ. అపవిత్ర ప్రవర్తనను బట్టి శిక్ష:-** (1) 35-39వ. శిక్షించువారు. (2) 40-43వ. శిక్ష విధము.

IV. **44-53వ. అన్యుల కంటె ఘోరమైన పాపము.**

V. **54-63వ.** అంత్యకాల పునరుద్ధరణ **(53-58వ)** నిత్యనిబంధన **(59-63వ)**

I. **1-4వ. యూదావారి జననము అభివృద్ధి:-**

(1) **1-4** పుట్టుక: యూదావారి జనన విధమును అనగా వారి పుట్టుకను గూర్చి విషయమేమనగా పుట్టినప్పుడు నాభిసూత్రము కోయబడలేదు. శుభ్రమగుటకు, శుభ్రము చేయబడుటకు నీళ్ళలోను కడుగలేదు. ఉప్పును వ్రాయేలేదు. బట్టచుట్ట లేదు. అనగా పుట్టినప్పుడు శిశువుకు చేయవలసిన పనులు ఏమియూ చేయలేదు. యూదావారి పుట్టుక పాపసంబంధమైనదియు, వారి పాపములు పరిహరింపబడలేదనియూ ఎవరునూ వారి

పాపములను కడుగలేదనియూ ఎవరునూ వారిని అభిషేకించలేదనియూ, నీతివస్త్రమును వారికి ఇవ్వలేదనియూ ఆత్మీయంగా చూడలగలము. (ఆత్మీయ భావము)

(2) 5-8వ. పెరుగుట: పుట్టిన శిశువుకు చేయవలసిన పనులు ఒక్కటి కూడా వేయబడలేదు. యూదావారిని ఎవరూ కటాక్షించలేదు. ఎవరునూ జాలిచూపలేదు. బయట పారవేయబడిన వాని వలెను అసహ్యంగా ఉన్నావు. ఆ స్థితిలో నిన్ను చూచి రక్తంలో పొర్లాడుచున్న నిన్ను చూచి బ్రతుకనిచ్చితిని. నిన్ను బాగుగా అభివృద్ధిపరచితిని. నీవు పెద్దదానివిగా ఎదిగి ఆభరణములతో అలంకరింపబడినావు.

ఆత్మీయ భావం:- పాపమనే రక్తంలో పొర్లి ఉన్న యూదా వారికి సువార్త అందించి, నిత్య జీవమును అందించి నీతి కలిగి జీవించునట్లు చేసి వాగ్ధానములనే ఆయుధములను ధరింపచేసి, నీతి అనే వస్త్రమును ఇచ్చినప్పుడు మంచి రూపము పొందిన వారైతిరి.

(3) 9-12వ. అలంకరింపబడుట: రక్తము తుడిచి, నీళ్ళతో కడిగి నూను వ్రాసి వస్త్రం ధరించి, పాదరక్షలను తొడిగించి పట్టుబట్టలు ధరించి, ఆభరణములు అలంకరించి చేతులకు కడియములు మెడకు గొలుసులు, చెవులకు ముక్కుకు పోగులు తలకు కిరీటము ఇచ్చాడు.

ఆత్మీయ భావము: పాపమనే రక్తం కడిగి (యెష 1:18వ) వాక్యమనే ఉదకస్నానము చేయించి (ఎఫెసీ 5:25), పరిశుద్ధాత్మ అనే నూనెతో ముద్రించి (ఎఫెసీ 1:13), విచిత్ర వస్త్రము - రక్షణ అనే వస్త్రం (యెష 61:10) ధరిపంచేసి, సమాధాన సువార్త వలనైన సిద్ధమనస్సును జోడుతో (ఎఫెసీ 6:15) సన్నపు నార వస్త్రము నీతి అనే పై వస్త్రము ధరింపజేసి (యెషయా 61:10) పట్టుపురుగు మరణము ద్వారా చేయబడినపట్టు వస్త్రము - మృత్యుంజయుడైన క్రీస్తును ధరించికొని (గలతీ 3:26), చేతులకు, మెడకు, చెవులకు, ముక్కులకు ఆభరణములను పెట్టుట. సేవకత్వము, యాజకత్వము, రాజరికము (తలకు కిరీటం పెట్టుట) అను ఈ అనుభవములన్ని ప్రకటన 1:6 ప్రకారం మనలను ప్రేమించుచూ ఆయన రక్తము వలన మన పాపముల నుండి కడిగి... రాజులైన యాజక సమూహముగా చేయుటను సూచించును.

(4) 13-15వ. ప్రభావముచే నింపబడుట: యూదావారిని అభివృద్ధిలోకి తెచ్చిన దేవుడు వారిని బంగారు, వెండితో అలంకరించి, సన్నపు అవిసెనారపట్టుతో చేసిన బట్టలు ధరింపచేసి, గోధుమ, తేనె, నూనె ఆహారంగా ఇచ్చి సౌందర్యము, అభివృద్ధినిచ్చి, ప్రభావమును అనుగ్రహించి నింపెను. అన్యులు దాని చూచి ప్రశంసించిరి.

ఆత్మీయ అర్ధము : వెండి విమోచించుటను, బంగారు దైవత్వమును సూచించుచుండగా సన్నపు అవిసెనార నీతి వస్త్రానికి పట్టు విచిత్రపు పని గల బట్టలు క్రీస్తును ధరించటానికి, గోధుమలు, తేనె, దేవుని వాక్యానికి నూనె, పరిశుద్ధాత్మ ముద్రకు సూచనలు. రోమా 3:23,24 .

ప్రకారం మానవుడు పోగొట్టుకొనిన మహిమను హెబ్రీ 2:7 ప్రకారము దేవుడు తిరిగి ఇవ్వగా ఇట్టి సౌందర్యమునుబట్టి అన్యులు యూదావారిని ప్రశంసించిరి.

**II. 15–34వ. యూదా వారి పాపం – పాపపు ప్రత్యేకత:–**

15–19వ. యూదావారి పాపమును ప్రభువు చూపించుట; యూదావారు తమ్మును అభివృద్ధిపరచిన దేవుని మరచి అనేక విగ్రహాలను పూజించిరి. తమ వస్త్రములను, అలంకరణను, తీసి, విగ్రహములుగా మార్చిరి. తైలముతో ధూపమువేసిరి. గోధుమపిండి, నూనెతో విగ్రహమునకు ఇంపైన సువాసన కలుగుటకు నైవేద్యము చేసిరి.

ఆత్మీయ భావము: నిజదేవుని విడచి విగ్రహారాధన చేయుచూ, నీతి దైవత్వము లేని జీవితము జీవించి, విగ్రహములకు ప్రార్థించుచు అరాధించు యూదావారి పాపపు ప్రత్యేకతను చూపుచున్నది.

20–24వ. కుమారులను విగ్రహములకు వధించుట అను పాపము.

ఆత్మీయ అర్థము: దేవుడు యూదా వారి కిచ్చిన తమ పిల్లలను బొమ్మలకు వధించిరి. యూదావారు తమ జ్యేష్ఠ కుమారులను సంఖ్య 3:13 ప్రకారంగా యెహోవా దేవునికి ప్రతిష్ఠించాలి. అట్లు చేయక విగ్రహములకు ప్రతిష్ఠించుట వ్యభిచారము అను చెడుతనముగా దేవుడు సెలవిచ్చుచున్నాడు. ఆ చెడుతనమునుబట్టి యూదావారికి శ్రమ కలుగును అని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

25–29వ. వ్యభిచరించిన దేశముల వివరములు

యూదావారు తమ యొద్దకు వచ్చిన వారందరితో వ్యభిచరించిరని అనగా ఐగుప్తీయులతోను, అష్షూరీయులతోను, కనాను మొదలుకొని కల్దీయుల దేశము వరకు ఉన్న అన్య దేశములతో వ్యభిచరించిరని తెలుపుచున్నాడు.

ఆత్మీయ అర్థము: ఐగుప్తు వారి దేవతలైన చతుష్పాద జంతువుల ఆకారాలు మందిరం లోపల గోడల మీద చిత్రీకరించి 70 మంది పెద్దల చిక్కని ధూపము వేసినట్లు యెహెజ్కేలు 8:9–11వ.లలో చూచితిమి. అలాగే యిర్మీయా 44:8లో ఐగుప్తులో అన్యదేవతలకు ధూపార్పణము చేయుదురని వ్రాయబడియున్నది. ఈ విగ్రహారాధన వ్యభిచారముతో పోల్చబడింది. అష్షూరీయుల దేవతలైన ప్రాకెడు పురుగుల విగ్రహములకు యూదావారి పెద్దలు ప్రార్థించి ధూపములు వేసినట్లు యెహెజ్కే 8:9–11లలో చూచుచున్నాము. అలాగే కల్దీయుల దేవతలగు తమ్మూజు మోలేకునకు ప్రార్థించుట 8:14లో చూచుచున్నాము. ఈ రీతిగా నిజదేవుని పూజింపక ఇతర దేశములు అనుసరించు దేవతలను పూజించుట ఆత్మీయ వ్యభిచారము అను పాపముగా చెప్పబడుచున్నది.

30-34వ. వ్యభిచార విధము: పురుషులు వేశ్యలకు పడుపు సొమ్ము ఇచ్చెదరు. కాని యూదావారు ఇతర దేవతలకు సొమ్మును, బహుమానమును ఇచ్చిరి. ఆత్మీయ అర్థము: లోకంలోని పురుషులు జార స్త్రీల వెంబడి తిరుగుతూ వారికి సొమ్మిచ్చి వారితో వ్యభిచరించుదురు. కాని యూదావారు దేవుడు వారికిచ్చిన ఆభరణములు, అలంకరణలు, ఆహారవస్తువులు ఇతర దేశముల విగ్రహములకు అర్పించుట, వేశ్యలు పురుషులకు పడుపు సొమ్ము ఇచ్చుటతో పోల్చబడింది. దేవుడైన యెహోవా తమకిచ్చిన సామర్థ్యమును, ఆధిక్యతలను, దేవుని కొరకు వాడక, వేరొక రీతిగా వినియోగించుట పాపమని సెలవిచ్చుచున్నాడు.

III. **35-43వ. అపవిత్ర ప్రవర్తనను బట్టి శిక్ష:-** 35-39వ. శిక్షించువారు: యూదావారు ఏఏ దేశముల విగ్రహములను పూజించిరో ఆ దేశపు వారిని దేవుడు సమకూర్చి యూదా వారి మీదికి పంపబోవుచున్నాడు. యూదావారి యొక్క సమస్తమును శత్రువులు తీసివేసి, యూదావారిని శిక్షించుదురు.

40-43వ. శిక్షించిన విధము: యూదావారి మీదికి వచ్చు శత్రువులు (1) సమూహముగా వారి మీదికి వచ్చి (2) రాళ్ళతో కొట్టి చంపుదురు. (3) కత్తులచేత పొడుచుదురు. (4) అగ్నిచేత ఇండ్లను కాల్చి శిక్షించెదరు. ఈ శిక్ష వారి ప్రవర్తనను బట్టి కలుగునని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

**44-53వ. అన్యులకంటే ఘోరమైన పాపము:-** యూదావారు కనానులో నివసించిన హిత్తీయులు, అమోరీయుల ఆచారములను ఆచరించుచున్నందున హిత్తీయులు వారికి తల్లిగాను అమోరీయులు వారికి తండ్రిగాను చెప్పబడుచున్నారు. షోమ్రోను, సొదొమ అక్కచెల్లెండ్రుగా చెప్పబడుచున్నారు. తల్లి ఎట్టిదో, బిడ్డ అట్టిదే అను సామెత ప్రకారం (మొదటి సామెత) యూదావారు హిత్తీయుల ఆచారములను ఆచరించుచున్నారు. సొదొమ వారి వలె గర్వము, ఆహార సమృద్ధి, నిర్విచారమైన సుఖస్థితి, దరిద్రులకు సహాయం చేయకుండుట అను హేయక్రియలు చేసినట్లు యూదావారును చేయుచున్నారు. షోమ్రోను వారి పాపములకంటె యూదావారు అత్యధికమైన పాపం చేసినందున చుట్టూ ఉన్న జనులు, అన్యజనుల కంటె మించిన పాపము యూదావారు చేసిరని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

**54-63వ. అంత్యకాల పునరుద్ధరణ - నిత్య నిబంధన:-** 54-58వ. అంత్యకాలంలో సొదొమవారిని, షోమ్రోను వారిని యూదావారిని తమ పూర్వస్థితికి తీసుకొని వచ్చెదనని దేవుడు సెలవిచ్చుచున్నాడు. **59-63వ.** సమకూర్పు: సమకూర్చబడిన యూదావారితో దేవుడు నిత్యనిబంధన చేసి దానిని స్థిరపరచి యెరూషలేమును ప్రపంచమంతటికి కేంద్రంగా ఉంచి పరిపాలన చేతునని సెలవిచ్చుచున్నాడు.

# 17వ. అధ్యాయము (10+11+3=24వ)

అంశము:- పక్షులు - వృక్షములు ఉపమానము (రెండవ ఉపమానము)

**1-10వ. 11-21వ. దేవుని సెలవులేక యుద్ధంలో సహాయమునకై ఐగుప్తు నాశ్రయించు యూదా వారిని గూర్చిన వృక్షములు - పక్షిరాజుల ఉపమానము - భావము:-**

విచిత్ర వర్ణములు, పెద్ద రెక్కలు గల గొప్ప పక్షిరాజు లెబనోను పర్వతమునకు వచ్చి దేవదారు వృక్షము పై కొమ్మను పట్టుకొనెను. పెద్దరెక్కలు గల పక్షిరాజు ప్రపంచమంతటిని పరిపాలించిన బబులోను రాజైన నెబుకద్నెజరు రాజును సూచించును. లెబనోను పర్వతము కనాను దేశమును సూచించును. దేవదారు వృక్షము యూదా రాజరికమును, దాని పై కొమ్మ అప్పుడు పరిపాలించిన యెహోయాకీను రాజును సూచించును. ఈ పక్షిరాజు లేత కొమ్మల చిగుళ్ళను తుంచి వర్తకులున్న పురమైన బబులోనుకు తీసుకొని పోయెను. ఆ దేశపు విత్తనమైన సిద్కియారాజును గన్నేరు చెట్టును నాటినట్లుగా సేద్యము చేయబడిన భూమిలో నాటెను. సిద్కియా రాజు జననమును బట్టి జ్యేష్ఠుడు కానందున రాజగుటకు అర్హత లేదు. అందువలన గన్నేరు వృక్షముతో పోల్చబడినాడు. ఈ వృక్షము చిగిర్చి విశాలమైన ద్రాక్షావల్లి అయినట్లు సిద్కియా రాజు విస్తరించి యూదావారిని 9 ఏండ్లు పరిపాలించెను. పెద్ద రెక్కలు విస్తారమైన ఈకలు గల ఇంకొక పక్షిరాజు ఐగుప్తురాజుకు సాదృశ్యము. విస్తరించిన ద్రాక్షావల్లి తన వ్రేళ్ళను త్రిప్పి తన శాఖలను రెండవ పక్షి తట్టు త్రిప్పెను. సిద్కియా రాజు సహాయము కొరకై యుద్ధకాలమున ఐగుప్తురాజును ఆశ్రయించుటకు సాదృశ్యముగా ఉన్నది. అట్టి ద్రాక్షావల్లి వృద్ధినొందక ఎండిపోవుట యూదావారికి రానున్న శిక్షను సూచించుచును.

**22-24వ. అంత్యకాల సమకూర్పు - ఆశీర్వాదాలను గూర్చిన ఉపమానం:-** ఎత్తైన దేవదారు వృక్షము పై కొమ్మ ఒకటి తుంచి అత్యున్నత పర్వతము మీద నాటుదునని తదుపరి అది బహుగా ఫలించి శ్రేష్ఠమైన దేవదారు చెట్టగునని యెహోవా సెలవిచ్చుచున్నాడు. అంత్యకాలములో దేవదారు వృక్షమైన యూదా గోత్రపు పై కొమ్మయైన యేసుక్రీస్తును అత్యున్నత పర్వతమైన సీయోను కొండపై రాజుగా నాటుటను సూచించును. బహుగా విస్తరించి ఫలించిన దేవదారు చెట్టుగా క్రీస్తు యొక్క వెయ్యేండ్ల పాలన ఉండునని సకల జాతులు ఆయన నీడను ఆశ్రయించునని తలంచగలము.

ఘనమైన చెట్టు - నీచమైనదిగాను, పచ్చనిచెట్టు - ఎండిపోవునదిగా చేయుదుననుట యూదా వంశములో నుండి ప్రస్తుత కాలములో రాజరికమును తీసివేయబడుటను సూచించును. తదుపరి ఎండిన చెట్టును వికసించునట్లు చేయుట

ఎండిపోయిన యూదా జనాంగము నుండి క్రీస్తుయేసు వారు రాజై పాలించుటను సూచించును.

## 18వ. అధ్యాయము (4+5+4+4+3+4+4+4=32వ)

అంశము:- పాపము చేయువాడెవడో వాడే శిక్షపొందును - పులుపు ద్రాక్షాకాయలు తినుట ద్వారా పళ్ళు పులియుట అను సామెత.

**1-4వ. పీఠిక:** తండ్రులు ద్రాక్షాకాయలు తినగా పిల్లల పళ్ళు పులిసెనని యూదావారు సామెతగా చెప్పుకొనుచుండగా తండ్రులేమి, కుమారులేమి, పాపము చేయువాడెవడో వాడే శిక్ష నొందుట సరియైన సామెత అని దేవుడు సెలవిచ్చుచున్నాడు. (ఇది రెండవ సామెత) రోమా 6:23; ప్రకారము పాపము వలన వచ్చు జీతము మరణము.

**5-32వ. సామెత యొక్క వివరణ (ఏడు భాగములుగా)**

**5-9వ. వివరణ-1 :-** నీతి న్యాయములను జరిగించు నీతిపరుడు, పాపము చేయక దేవుని విధానములను అనుసరించిన ఎడల నిర్దోషియై నిజంగా బ్రతుకును.

**10-13వ. వివరణ-2:-** ఆ నీతిపరునికి కుమారుడు పుట్టి పాపము చేసి దేవుని విధులను అనుసరించుక హేయక్రియలు చేసిన ఎడల ఆవశ్యముగా మరణ శిక్షకు గురి అగును.

**14-17వ. వివరణ-3:-** పాపము చేయు తండ్రికి పుట్టిన కుమారుడు తండ్రి క్రియలను ఆలోచించి అట్టి క్రియలు చేయక దేవుని కట్టడలు అనుసరించి నడచిన ఎడల ఆవశ్యముగా ఆ కుమారుడు బ్రతుకును.

**18-20వ. శిక్షను గురించిన సారాంశము-4:-** పాపము చేయు తండ్రి తన దోషమును బట్టి శిక్ష నొందును. కాని నీతి న్యాయమును అనుసరించు కుమారుడు తండ్రి యొక్క దోష శిక్షను భరించక అవశ్యకముగా బ్రతుకును. సారాంశముగా నీతిపరుని నీతి నీతిపరునికే చెందును. దుష్టుల దుష్టత్వము దుష్టులకు చెందును.

**21-24వ. వివరణ-5:-** ఒకని జీవితకాలంలో దుష్టత్వము నుండి మళ్ళించబడి నీతి న్యాయములను జరిగించిన ఎడల తాను అవశ్యముగా బ్రతుకును. మరొక నీతిమంతుడు తన నీతిని విడచి పాపము చేసిన ఎడల పాపమును బట్టి మరణ శిక్ష పొందును.

**25-28వ. దేవుని హెచ్చరికల సారాంశము-6:-** నీతిపరుడు తన నీతిని విడచి పాపము చేసిన ఎడల అతను దానిని బట్టి మరణము నొందునని దుష్టుడు తాను చేయుచూ వచ్చిన దుష్టత్వము నుండి మరల నీతిన్యాయములను జరిగించిన ఎడల అతడు బ్రతుకునని దేవుని తీర్పులు మార్గములు న్యాయమైనవని, యూదావారికి సెలవిచ్చుచున్నాడు.

**29-32వ.** పశ్చాత్తాపానికి ఆహ్వానము -7:- యెహోవా మార్గములు న్యాయము కావని యూదావారు ఇంతవరకు చెప్పుకొని ఇప్పుడు అవి న్యాయమైనవని తెలుసుకొనినందున దేవుడు వారిని వారి ప్రవర్తనను బట్టి మనస్సు త్రిప్పుకొనవలెనని, నూతన హృదయాన్ని నూతన బుద్ధిని తెచ్చుకొనవలెనని ఆహ్వానించుచున్నాడు. మనస్సు త్రిప్పుకొనిన యెడల మరణము నొందక బ్రతుకుదురని సెలవిచ్చుచున్నాడు.

# 19వ. అధ్యాయము (4+5+5=14వ)

**అంశము:- మూడు నాలుగు ఉపమానములు. యూదా మనుష్యులను వేటాడి చివరకు చిక్కి బోనులో పెట్టబడి బబులోనుకు కొనిపోబడిన సింహములతో పోల్చిన ఉపమానము - ద్రాక్షావల్లిని గూర్చిన ఉపమానము.**

**1-4వ. యూదా జనాంగము తల్లి సింహముగాను - యెహోయాహాజు రాజు పిల్ల సింహముగా పోల్చబడుట. 5-9వ. సిద్కియా రాజు మరొక పిల్ల సింహముగా పోల్చబడుట. 10-14వ. యూదావారు ద్రాక్షవల్లిగా పోల్చబడుట.**

**1-4వ. తల్లి సింహమైన యూదా జనాంగము - పిల్ల సింహమైన యెహోయాహాజురాజు:-** యూదా జనాంగము తల్లియైన ఆడు సింహముగాను, తాను పెంచిన ఒక పిల్ల కొదమ సింహమై మనుష్యులను వేటాడగా జనులు దానిని చిక్కించుకొని ఐగుప్తు దేశమునకు కొనిపోయిరి. ఈ ఉపమానము యెహోవా దృష్టికి చెడునడతలు నడచి ఐగుప్తు రాజుకు చిక్కిన యెహోయాహాజు రాజును సూచించుచున్నది. 2 రాజులు 23:31-35 మరియు విలాప 4:20లో వివరములు చూడగలము.

**5-9వ. మరొక పిల్ల సింహమైన సిద్కియా రాజు:-** సిద్కియా రాజు మరొక పిల్ల సింహముగా పోల్చబడుట: తల్లియైన యూదావారు మరొకపిల్లను పెంచి పెద్దచేయగా కొదమ సింహమై మనుష్యులను వేటాడినట్లు (యెహోయాకీను రాజు) మరియు సిద్కియా రాజు యెహోవా దృష్టికి చెడునడత నడచినందున బబులోను రాజు చేతికి చిక్కి బంధించబడి చెరకు వెళ్ళాలి. దాని గర్జన ఇశ్రాయేలీయుల పర్వతములపై ఎన్నటికిని వినబడని రీతిగా ఇశ్రాయేలీయులలోని పర్వతములపైనున్న యెరూషలేము పట్టణములో రాజరికము అనగా యూదారాజులు ఇక ఎన్నటికిని లేకుండా తీసివేయబడిరి.

**10-14వ. ద్రాక్షావల్లియైన యూదావారిని గూర్చిన ఉపమానము:-** యూదావారు విస్తారమైన జలముల యొద్ద నాటబడిన బహు గొప్పదైన ద్రాక్షావల్లియై ఉండిరి. బహురౌద్రము చేత పెరికివేయబడి గట్టి చువ్వలు తెగి వాడిపోయి అగ్నిచేత కాల్చబడినట్లు గట్టి చువ్వలైన రాజుల రాజరికము ఇక ఎన్నటకిని ఉండకుండా యూదా వారి మధ్య నుండి తీసివేయబడింది.

దీని కొరకైన యెహెజ్కేలు ప్రలాప వాక్యము వ్రాసెను. (14వ) యిర్మీయా కూడా 38:23లో దీనిని గూర్చి ప్రలాపించెను.

**(6) 20-24 అధ్యా. యెరూషలేము చివరి దినాలలో తెలుపబడిన సూచనలు-ఉపమానాలు.**

## 20వ. అధ్యాయము (9+8+9+6+6+6+5=49వ)

**అంశము:- యూదా వారి 4 అపవిత్రతలు**

**1-9వ. ఐగుప్తులో విగ్రహాలను పూజించుట అను మొదటి అపవిత్రత (7,8వ):-** ఆయన నామమునకు వ్యతిరేకంగా వారికి ఇష్టమైన హేయకృత్యములు చేయుట అనగా యూదావారు దేవునికి విరోధముగా విగ్రహారాధన సంబంధమైన హేయకృత్యము చేయుచున్నారు. మరియు ఐగుప్తు సంబంధించిన క్రియలు చేయుచు విగ్రహాలను పూజించుచు తమను తాము అపవిత్ర పరచుకొనుచున్నారు. 6వ. పాలు తేనెలు ప్రవహించు దేశమునకు, అనగా సకల దేశములకు ఆభరణము అయిన పాలస్తీనా దేశానికి తీసుకొని పోవుదును అని దేవుడు చెప్పుచూ, యూదావారు తాము చేయుచున్న హేయక్రియలను, విగ్రహారాధనను మానవలెనని హెచ్చరించుచున్నాడు.

**10-17వ. అరణ్యమందు దేవుని కట్టడలు, తృణీకరించి విశ్రాంతి దినమును అపవిత్రపరచుట (రెండవ అపవిత్రత) (15వ):-** యూదావారు దేవుని విధులకు వ్యతిరేకముగా విగ్రహారాధనను చేయుటకు ఇష్టపడిన వారైరి. అంతేకాక దేవునియొక్క విధులను తృణీకరించినవారుగాను, ఆయన కట్టడలను అనుసరింపకపోవడం, దేవుడు నియమించిన విశ్రాంతి దినమును ఆచరించకుండా, ఆ దినమును అపవిత్రపరచినవారుగాను ఉన్నారు. అరణ్యంలో కూడా ఇశ్రాయేలీయులు దేవుని మీద తిరుగుబాటు చేసినారు. ఆయన నియమించిన కట్టడలను వ్యతిరేకించినారు. దేవుని కార్యములను నిర్లక్ష్యముగా త్రోసివేసి దేవునికి కోపము రేపినవారుగా ఉన్నారు.

**18-26వ. అరణ్యములో రెండవ తరమువారును కట్టడలు మీరుట - విశ్రాంతి దినమును అపవిత్రపరచుట (మూడవ అపవిత్రత) (21, 25వ):-**

ఇశ్రాయేలు వారి పిల్లలతో దేవుడు వారి తండ్రుల ఆచారములను, పద్ధతులను బట్టి ప్రవర్తింపకూడదని, తమ్మును తాము అపవిత్రపరచుకొనకుడని రెండవ తరము వారికి సెలవియ్యగా వారు దేవుని మీద తిరుగబడి ఆయన కట్టడలను అనుసరింపక, విధులను గైకొనక, దేవుడు నియమించిన విశ్రాంతి దినములను అపవిత్రపరచిరి. అయిననూ అరణ్యంలోనే వారి మీద రౌద్రాన్ని కుమ్మరించెదననుకొన్నాడు గాని, దేవుడు ప్రేమగలవాడు గనుక తన కోపాగ్ని చల్లార్చి వారు అన్యజనుల మధ్య దూషణ పాలుకాకుండునట్లు వారిని

నశింపచేయక తన హస్తమును వెనుకకు తీసి వారికి చేసిన వాగ్దానమును నెరవేర్చెను. అప్పుడు వారు యెహోవాను గుర్తించుదురు అని ప్రభువు సెలవిచ్చుచున్నాడు.

**27-32వ. కనాను దేశములోను విగ్రహాలను పూజించుట అను అపవిత్ర (27-29) బబులోను చెరలోనున్న వారును విగ్రహాలను పూజించుట అను అపవిత్రత (నాల్గవ అపవిత్రత) (30-32వ):-** ఇశ్రాయేలు ప్రజలను కనానుకు నడిపించిన తర్వాత కూడా వారు ఆ దేశంలో ఎత్తయిన ఒక కొండనేగాని, దట్టమైన ఒక వృక్షమునేగాని తాము చూచినప్పుడెల్లను బలులు అర్పించుచూ, అర్పణలు అర్పించుచూ ఉండిరి. ఈ విధంగా వారి పూర్వీకులు కూడా విగ్రహాలను పూజించుచూ అపవిత్రులైనారు. వీరు కూడా అదేవిధంగా ప్రవర్తించి అపవిత్రులుగా తీర్చబడినారు. ఆనాటి ఉన్నత స్థలమనే పేరు యెహెజ్కేలు కాలంలోనూ ఉన్నది. 30-32లో పూర్వీకులు ఏవిధంగా అపవిత్రులైనారో ఆవిధంగా చెరలోని వీరు కూడా అపవిత్రులు అయినారు. వారు చేసిన విధంగా వ్యభిచారము చేసి అపవిత్రులైనారు. కుమారులను అగ్నిగుండముల గుండా దాటించు, విగ్రహారాధనలు, పూజలు చేస్తున్నారు.

**33-38వ. దేవుడు రౌద్రమును కుమ్మరించుట (శిక్ష) - చాచిన బాహువుతో సమకూర్చుట (విడుదల):-** దేవుని నామమును అపవిత్రపరచి తమ ఇష్టానుసారంగా ప్రవర్తించిన ఇశ్రాయేలు ప్రజలపైన దేవుడు ఈ విధంగా ప్రమాణం చేశాడు. నా జీవం తోడు రౌద్రమును కుమ్మరించి బాహుబలంతో చాచిన చేతులతోను వారిని ఆయా దేశము నుండి రప్పించి అరణ్యములోనికి తోడుకొని వచ్చి అక్కడ వారితో వ్యాజ్యమాడెదను. వారికి చేసిన నిబంధనలను వారు గుర్తించలేదు. దేవుని మీద తిరుగుబాటు చేసినారు. గనుక వారికి శిక్షగా ఇశ్రాయేలు దేశలో మిమ్ములను ప్రవేశపెట్టను. చెరలోనున్న వారు దిద్దిబాటు లేని ఎడల కనాను తిరిగి రాక అక్కడే ఉందురని భావము. అదే రీతిగానే జెరుబ్బాబేలుతో (ఎజ్రా 1,2 అధ్యా) ఎజ్రాతో (7,8 అధ్యా) నెహెమ్యాతో (నెహె 1,2 అధ్యా) తిరిగి యూదాకు వచ్చిన వారు కాక అనేకులు బబులోనులోనే నిలిచిపోయిరి.

**39-44వ. అంత్యకాలంలో సమకూర్చబడిన వారి ప్రవర్తనను గూర్చిన హెచ్చరిక (41వ):-** ఇశ్రాయేలీయులు తమ దుర్మార్గత వలన ఆయా ప్రాంతాలకు చెదరిపోయినారు. అంత్యకాలంలో దేవుడు మరలా వారి మీద ప్రేమకలిగి వారిని పిలిచినప్పుడు ఆయా జనములలో నుండి తప్పించినప్పుడు వారు తమ దుర్మార్గతను విడచిన ఎడల, వారిని పరిమళ ధూపముగా అంగీకరింతును అనియు మరియు అన్యజనుల ఎదుటను, యూదావారి మధ్యను తన్ను తాను పరిశుద్ధపరచుకొందునని దేవుడు చెప్పాడు. యూదావారిని మిమ్మును ఇశ్రాయేలు దేశమునకు తీసుకొనిపోయినప్పుడు వారు యెహోవానని తెలుసుకొందురు అనియు అప్పుడే తమ దుర్మార్గతనుబట్టి తమ్మును తాము అసహ్యించుకొందురు అని యెహోవా సెలవిచ్చుచున్నాడు.

"యెహోవానను" అను మాటలు ఇందులో 7 పర్యాయములు కనిపించును.

**45-49వ. అరణ్యములో అగ్నిరాజ పెట్టుటను గూర్చిన ఉపమానము:-** దక్షిణ దేశపు (యూదాదేశము) అరణ్యములో అగ్ని రాజపెట్టుటను గూర్చిన తీర్పు జరుగబోవుచున్నదని యెహోవా పెద్దలకు సెలవిచ్చాడు. నేనే అగ్ని రాజబెట్టుదునని సమస్తమైన జనులకు తెలియబడును అన్నాడు.

## 21వ. అధ్యాయము (7+10+6+4+5=32వ)

**అంశము:- ఖడ్గము, నిట్టూర్పు విడుచు ప్రవక్తను గూర్చిన 4 సూచనలు. ఈ అధ్యాయంలో ఖడ్గము అను పదము 15 సార్లు ఉంది.**

**1-7వ. యూదా దేశమును నిర్మూలించుటకై ఖడ్గము దూయబడినందున, నిట్టూర్పు విడచిన ప్రవక్త (<u>మొదటి సూచన</u>) (6వ):-** యూదాదేశమంతటిలో ముందు అధ్యాయాలలో చూచినట్టు విగ్రహారాధన, విశ్రాంతి దినములు అపవిత్రపరచుట, విగ్రహములకు పిల్లలను అర్పించుట, వ్యభిచరించుట అను పాపమునుబట్టి ఖడ్గము ద్వారా దక్షిణ దిక్కు మొదలుకొని ఉత్తర దిక్కు వరకు సంపూర్తిగా నశింపజేతునని సూచనగా నా ఖడ్గము వరదీసి ఉన్నానని యూదా దేశమునకు సెలవిచ్చివున్నాడు. నా ఖడ్గము అనుటలో దేవుడే యూదావారిని శిక్షించి నాశనము చేయబోవుచున్నాడు. అందరి గుండెలు కరుగుననియు, అందరి చేతులు బలహీనమవుననియూ, అందరి మనస్సు అధైర్యపడుననియూ, అందరి మోకాళ్ళు నీరసమగుననియు, రానున్న ఇంత గొప్ప కీడును బట్టి ప్రవక్త నడుము బ్రద్ధలగునట్లు సూచనగా నిట్టూర్పులు విడువవలెననియు, ప్రజలు నిట్టూర్పు ఎందుకని అడిగినప్పుడు రానున్న శ్రమలను గూర్చిన దుర్వార్త ప్రకటింపవలెనని సెలవిచ్చాడు. ఈ మొదటి సూచన యూదా దేశము నిర్మూలము చేయబడుటను గూర్చినది.

**8-17వ. ఖడ్గము రాజును ప్రజలను సంహరించుట అను రెండవ సూచన:-** జనుల మీదికి, ఇశ్రాయేలీయుల ప్రధానుల మీదికి ఖడ్గ భయము తటస్థించుచున్నది. ముమ్మారు రెట్టింపబడిన ఖడ్గము గొప్పవారి అంతఃపురములో చొచ్చి హతము చేయుట, రాజైన సిద్కియా హతము చేయబడుటను సూచించును. ఇందు నిమిత్తమై సూచనగా యెహెజ్కేలు తొడలు చరచుచూ, చేతులు చరచుకొనుచూ అంగలార్చుతూ, కేకలు వేయుచూ ప్రవచించవలెనని యెహోవా సెలవిచ్చెను. ఈ కీడును దేవుడు తన క్రోధము తీర్చుటకై తానే తలపెట్టినందున తన చేతులు చరచుచూ ఈ కార్యము జరిగింతునని సెలవిచ్చాడు. ఈ 2వ సూచన రాజును, ప్రజలు హతము చేయబడుటను గూర్చినది.

**18-23వ. ఖడ్గము రబ్బా పట్టణమునకు, యెరూషలేముకు మార్గము చూపుట అను మూడవ సూచన:-** బబులోను రాజు ఖడ్గము ధరించి వచ్చుచున్నట్లు అమ్మోనీయుల దేశమునకు,

యెరూషలేమునకు మార్గములు గల హస్తరూపమును యెహెజ్కేలును గీయమని దేవుడు సెలవిచ్చాడు. రెండు బాటలు చీలు స్థలమున బబులోను రాజు నిలుచుండి (1) బాణములను ఇటు అటు ఆడించుట ద్వారా (2) విగ్రహములను విచారించుట ద్వారా (3) కార్యములనుబట్టి శకునము చూచుచున్నట్లు హస్తరూపము గీయబడినది. బబులోను రాజుకు తన కుడి తట్టున యెరూషలేము వైపు శకునము కనబడి యెరూషలేము మీదికి యుద్ధమునకై వచ్చునని యూదావారికి తెలుపబడినది. ఈ సూచన యెరూషలేము పట్టణ నాశనమును గూర్చినది.

**24-27వ. నాల్గవ సూచన:-** ఇశ్రాయేలీయుల అధిపతికి దోష సమాప్తి కాలమున తీర్పు వచ్చివున్నది, అనుచూ తలాటము (తలపాగా) తీసివేయుము కిరీటము ఎత్తుమని దేవుడు సెలవిచ్చుచున్నాడు. ఇకమీదట నీచుని ఘనునిగాను, ఘనుని నీచునిగాను ఎంచుదునని, రాజరికమును పడద్రోయుదునని ముమ్మారు సెలవిచ్చాడు. దీని భావమేమనగా తలపాగా తీసివేయుము అనుటలో యెరూషలేము దేవాలయము నాశనమగుటను బట్టి ప్రధానయాజకులు ఇక ఉండరని, కిరీటము ఎత్తివేయుము అనుటలో రాజరికము యూదా నుండి తీసివేయబడినదనియు, నీచుని ఘనునిగా ఎంచుట, అన్యజనులు ఘనులై యూదావారిని పరిపాలించుదురని దేవుడు సెలవిచ్చుచున్నాడు. స్వాస్థ్యకర్త వచ్చినప్పుడు నేను దానిని అతనికి ఇచ్చెదను, అనుటలో యుగాంతమందు రారాజుగా యేసు ప్రభువు వచ్చి కిరీటము ధరించి రాజ్యపాలన చేయునని యెహోవా సెలవిచ్చుచున్నాడు.

**28-32వ. అమ్మోనీయులపై రానున్న శిక్షలు:-** ఈ భాగంలో అమ్మోనీయులపై రానున్న శిక్షను గూర్చి యెహోవా సెలవిచ్చుచున్నాడు. 3వ సూచనలో అమ్మోనుకు, యెరూషలేముకు బయలుదేరిన బబులోను రాజు శకునము చూచి అమ్మోనుకు వెళ్ళక యెరూషలేముకు వెళ్ళి నాశనము చేసెను. దానిని చూచిన అమ్మోనీయులు సంతోషించిరి. అటువలెనే చుట్టూనున్న అన్యదేశములన్నియూ ప్రవర్తించెను. అన్యదేశములన్నిటికి సాదృశ్యంగా ఈ భాగంలో దేవుని ఖడ్గము మెరుగుపెట్టబడి అమ్మోనీయులను వధించునని అంతటితో ఖడ్గము తన కార్యములను ముగించి వరలో వేయబడునని దేవుడు సెలవిచ్చుచున్నాడు. ముందుగా యెరూషలేమును శిక్షించిననూ వారిని విమోచించినట్లు గమనించాలి. కాని చుట్టూ అన్యదేశములకు సాదృశ్యముగా నున్న అమ్మోను శిక్షింపబడెనే గాని వారు విమోచించబడలేదని గమనించాలి.

## 22వ. అధ్యాయము (12+4+6+9=31=32వ)

**అంశము:-యూదా వారి పాపమును గూర్చి 4 ప్రకటనలు**

**1-12వ పట్టణములోని పాపమును గూర్చిన మొదటి ప్రకటన వివరము:-** (1) ప్రాణహానిచేయు పట్టణము: నిజానికి యెరూషలేము సమాధానం గల నిలయం

(సమాధానం నిలువాలని కోరితిని) కాని సమాధానం లేదు, హాని ఉంది. దేవుని బిడ్డలు సమాధానంగా ఉండాలి కాని మన ద్వారా ఎవరికి మాటలు, క్రియల ద్వారానైనా హాని కలుగకూడదు. అందుకే దేవుడు మనలను ఎన్నుకున్నాడు.

(2) నరహత్యలు చేయు పట్టణము: యూదావారు కొండెములు చెప్పి ప్రాణానికి హాని కలిగించడం లేదా స్వయాన నరహత్య చేయుచున్నారు. చివరకు యేసు ప్రభువును కూడా హత్య చేశారు. తమ సమాధానం కోల్పోయారు. క్రొత్త నిబంధన ప్రకారం 1 యోహాను 3:15లో సహోదరుని ద్వేషించుట నరహత్యతో సమానం. ఆత్మీయులు ఈనాడు సమాధానం కోల్పోవుటకిదే కారణం.

(3) విగ్రహాలను పెట్టుకొను పట్టణము: విగ్రహాలను పెట్టుకొనుట అనగా నిజదేవుని విసర్జించుట, విగ్రహములను ప్రేమించుట, ఇదే దేవుకెంతో అయిష్టమైనది. యెహెజ్కేలు 14:3. వీరి హృదయములలో విగ్రహాలున్నాయి. క్రీస్తుకంటే ఎవరినైనా, దేనినైనా ఎక్కువగా ప్రేమిస్తే అదే విగ్రహము. కొల 3:6.

(4) విశ్రాంతి దినమును అపవిత్రపరచు పట్టణము: ప్రతి ఏడవ దినమును విశ్రాంతి దినముగా ఉండవలెననియూ, అలాగే ప్రతి 7వ సంవత్సరము, 50వ సంవత్సరము భూమికి విశ్రాంతి సంవత్సరములు అని దేవుడు నియమించాడు. యూదావారు సొలొమోను మందిరము కట్టినది మొదలుకొని భూమికి విశ్రాంతి నివ్వక ప్రతి 50 సంవత్సరములకు 8 విశ్రాంతి సంవత్సరములు దేవునికి బాకీ పడిరని గ్రంథ పరిచయములో వివరముగా చూచితిమి.

(5) పర్వతముల మీద భోజనము చేయువారు, పట్టణములో నివసించుచున్నారు. విగ్రహము వట్టిదని, అందులో దైవత్వము లేదని దేవుడు ఎన్నో పర్యాయములు సెలవిచ్చిననూ పర్వతముల మీద విగ్రహార్పితములను భుజించుట కేవలము పాపము. అటువంటి వారు యూదావారి మధ్య నివసించుట కేవలము పాపము.

(6) కామ వికార చేష్టలు కలిగి అక్రమ సంబంధములు కలిగి ఉండుట కేవలము పాపమని దేవుడు సెలవిచ్చిననూ యూదావారు కామాతురులై వ్యభిచారము జరిగించుట ద్వారా కేవలము పాపులైరి.

(7) దేవుని మరచి నరహత్యకై లంచము పుచ్చుకొనువారు, బలవంతముగా దోచుకొనువారు యూదావారి మధ్య ఉన్నారు అని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

**13-16వ. పాపమునకు రానున్న శిక్షను గూర్చిన రెండవ ప్రకటన:-** నరహత్యలనుబట్టి అన్యాయమునుబట్టి దేవుడు తానే చేతులు చరచుకొనుచూ శిక్ష విధింతునని సెలవిచ్చుచున్నాడు. అపవిత్రత బొత్తిగా తీసివేయుటకై అన్యజనులలోనికి అనగా ఇతర

దేశములకు యూదావారిని చెదరగొట్టుదునని సెలవిచ్చుచున్నాడు. అన్యజనుల ఎదుట యూదావారు భ్రష్టులై ఉండగా దానిని బట్టి యెహోవాను తెలుసుకొంటారని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

**17-22వ. దేవుని దృష్టికి మష్టువంటి వారైన యూదా ప్రజలకు కలుగు శిక్షను గూర్చిన మూడవ ప్రకటన:-** వారి వెండిలో అనగా విమోచించబడిన జీవితంలో ఇత్తడి, తగరము, ఇనుము, సీసము అను నాలుగు రకములైన అపవిత్రతలు కలవు. ఈ భాగము గ్రంథమంతటిలో మనము చూచు యూదావారిలోని నాలుగు రకములైన పాపములకు సాదృశ్యముగా ఉన్నది. వెండిని కొలిమిలోవేసి కరగించి, పవిత్రపరచినట్లు దేవుడు తన కోపాగ్నిచే వారిని కరిగించును. యెహోవాయే దేవుడని వారు తెలుసుకొనుటకై ఆయన తన క్రోధమును కుమ్మరించెనని ఆలాగున యూదావారు తెలుసుకొందురు.

**23-31వ. దేశమునకు పాపమునుబట్టి కలుగు శిక్షను గూర్చిన నాలుగవ ప్రకటన:-** దేశములోని అపవిత్రతనుబట్టి వర్షము రాదని తద్వారా కరువు వచ్చునని దేవుడు సెలవిచ్చుచున్నాడు. పాపమునుబట్టి యిర్మియా 14:1-7లో భూమి మీద వర్షము రాక కరువు కలిగినట్లు చూచుచున్నాము. 1 రాజులు 16:33,17:1లో పాపమునుబట్టి దేవుడు వర్షము పడకుండా కరువును పంపాడు.

25వ. ప్రవక్తలు: గర్జించు సింహమువలె కుట్రచేయుచూ మనుష్యులను భక్షించుచున్నారు.

26వ. యాజకులు: ధర్మశాస్త్రమును నిరాకరించుచూ విశ్రాంతి దినములను ఆచరింపక ఉన్నారు. 27వ. అధిపతులు: చీల్చు తోడేళ్ళు వలె లాభము కొరకై నరహత్యలు చేయుచున్నారు. 28వ. ప్రవక్తలు : వ్యర్థమైన దర్శనములు చూచు ప్రజలు కట్టిన మంటి గోడకు గచ్చుపూత పూయుదురు. 30-31వ. ప్రాకారము దిట్టపరచువారెవరూ కనబడనందున దేవుడు తన క్రోధమును కుమ్మరించి ప్రవర్తనా ఫలముగా వారిని దహింతునని సెలవిచ్చుచున్నాడు. 29వ. సామాన్య జనులు: బలత్కారము చేయుచూ, అన్యాయము చేయుచు పరదేశులను బాధించుచూ ఉన్నారు.

## 23వ. అధ్యాయము (10=11+14+14=49వ)

**అంశము:- ఒహొలా, ఒహొలీబా అను ఇద్దరు సోదరీల ఉపమానము.**

**1-10వ. ఇశ్రాయేలు వారి పాపము - శిక్ష:-** ఇశ్రాయేలీయుల జనాంగము ఒక తల్లి కాగా, ఆమెకు పుట్టిన ఇద్దరు స్త్రీలగు ఒహొలా, షోమ్రోను ముఖ్యపట్టణముగా కలిగిన 10 గోత్రముల ఉత్తరమందున్న ఇశ్రాయేలు రాజ్యముగాను, ఒహొలిబా యెరూషలేము ముఖ్యపట్టణముగా కలిగిన 2 గోత్రముల దక్షిణమందున్న యూదా రాజ్యముగా ఈ

ఉపమానమందు చెప్పబడినవి. ఒహొలా అనగా ఆమె స్వంత గుడారము, ఒహొలిబా దేవుని గుడారము ఆమె యందున్నది అని అర్థము. అనగా యూదావారి మధ్య దేవుని ఆలయము యెరూషలేములో ఉన్నదనియూ, ఇశ్రాయేలువారి మధ్య తాము స్వంతముగా నిర్మించుకున్న దూడల విగ్రహాలు దానులోను, బేతేలులోను ఉన్నవని దీని భావము. ఇశ్రాయేలువారు అష్షూరువారి విగ్రహములను పూజించుటను ఉపమానముగా అష్షూరును మోహించి వారితో వ్యభిచరించినట్లుగా సెలవిచ్చుచున్నాడు. అందువలన ఇశ్రాయేలువారిని అష్షూరు దేశమునకు రెండు విడతలుగా క్రీ.పూ. 732, క్రీ.పూ. 721లో చెరకు పంపి ఉపమానంగా ఆమె స్త్రీలలో అపకీర్తిపాలై శిక్షనొందెనని సెలవిచ్చుచున్నాడు.

**11-21వ. యూదావారి పాపము:-** ఉపమానంలో "ఒహొలిబా"గా యూదావారిని చూపుచూ వారి జారత్వము ఒహొలా అనగా ఇశ్రాయేలు వారి జారత్వము కంటే ఎక్కువైనదని యూదావారు ఐగుప్తీయుల విగ్రహములను, బబులోనీయుల విగ్రహాలను పూజించినందున యూదావారు ఐగుప్తును బబులోనును, మోహించి ఎక్కువగా వ్యభిచరించిరని సెలవిచ్చుచున్నాడు.

**23-35వ. యూదా వారికి శిక్ష:-** బబులోను వారి విగ్రహములను పూజించినందున బబులోను దేశమునకు శిక్ష నిమిత్తమై పంపుదునని కొందరు ఖడ్గముచేత కూలుదురని మరికొందరు అగ్నిచేత దహించబడుదురని సెలవిచ్చుచున్నాడు. ఐగుప్తీయులతో వారు చేసిన వ్యభిచారమునకు శిక్షగా ఐగుప్తు దేశమునకు పంపి శిక్షించి వ్యభిచార దుష్కార్యమును అనగా విగ్రహారాధనను యూదావారిలో నుండి తీసివేతునని సెలవిచ్చుచున్నాడు.

**36-49వ. ఒహొలా, ఒహొలిబాల పాపానికి శిక్ష:-** ఇశ్రాయేలు, యూదావారు విగ్రహములను పూజించి తమ కుమారులను వాటికి ప్రతిష్ఠించి; విగ్రహములకు బలియిచ్చి పరిశుద్ధ స్థలమును అపవిత్రపరచి విశ్రాంతి సంవత్సరములను పాటించనందున దేవుడు వారి మీదికి శత్రుసైన్యమును పంపి, బాధించి రాళ్ళచేత పంపింతునని, ఖడ్గముచేత చంపింతునని, ఇళ్ళను అగ్నిచేత కాల్చివేతునని సెలవిచ్చుచున్నాడు. ఈలాగున విగ్రహములను పూజించిన పాపమును వారు భరించిన తర్వాత విగ్రహారాధన వారి మధ్య లేకుండా చేతునని సెలవిచ్చుచున్నాడు. ఆలాగే బబులోను చెర పిదప యూదావారిలో నుండి విగ్రహారాధనను పూర్తిగా తీసివేయబడుటను గమనించగలము.

## 24వ. అధ్యాయము (5+5+4+5+5+3=27వ)

**అంశము:- యెరూషలేము పట్టణము దేవాలయము నాశనమగుట.**

**1-5వ.** మంటపెట్టబడి మాసకుండ మండుచుండు మాంసపుకుండను గూర్చిన

**ఉపమానము:-** బబులోను రాజు దేశము పైకి దండెత్తి వచ్చు దినమున తెలుపబడిన ఉపమానము. ఒక కుండలో నీళ్ళు పోసి పొయ్యి మీద పెట్టి కట్టెలు మండించి మంద నుండి శ్రేష్ఠమైన వాటిని తీసుకొని వధించి వాటి మంచి ముక్కలను, ఎముకలను ఏరి కుండను నింపి దానిని పొంగించి ఎముకలను చారుగునంతగా ఉడికించుట.

**6-9వ. ఉపమాన భావము:-** యెరూషలేము పట్టణములోని ప్రజలు తమ పిల్లలను మొలెకు దేవతకు బలిగా అర్పించి నరహంతకులైనందున పట్టణమును అందలి ప్రముఖులను, రాజును శ్రమలపాలు చేయుటకు సాదృశ్యముగా మంచి ముక్కలను అగ్నిలో వేయించాడు. అయినను పట్టణములో పాపము అంతము కాలేదు.

**10-14వ. అపవిత్రత పోవువరకు అగ్నిలో వేయబడిన పాత్ర:-** తరువాత చాలా కట్టెలు పేర్చి ఎముకలు బాగుగా ఉడికి వారు చిక్కగా దిగి అంతయు ఇంకిపోయి పట్టి చట్టియగునంతగా ఉడికించమని దేవుడు సెలవిచ్చాడు. అలసట పుట్టునంతగా శ్రద్ధపుచ్చుకొనినను దాని మష్టుపోదాయెను. ఆ అపవిత్రత కామాతురతయైన విగ్రహారాధనయేనని శుభ్రపడువరకు క్రోధము కనపరతునని కనికరింపక నెరవేర్చునని దేవుడు సెలవిచ్చుచున్నాడు. దీని భావములో శిక్ష పిదప విగ్రహారాధన పూర్తిగా యూదావారి నుండి తొలగిపోవునని సెలవిచ్చుట. బబులోను శిక్ష తదుపరి నేటి వరకు యూదావారు విగ్రహారాధనకు దూరముగానే ఉన్నారు.

**15-19వ. యెహెజ్కేలు భార్యచనిపోవుట ప్రవక్త దుఃఖించకుండుటయను ప్రదర్శన:-** తన కన్నుల కింపైన యెహెజ్కేలు భార్యను దేవుడు ఒక దెబ్బతో తీసివేతునని సెలవిచ్చాడు. కాని ప్రవక్త విలపించక శిరోభూషణములు ధరించుకొని జనులకు ప్రకటింపవలెనని సెలవిచ్చాడు. అలాగే తన భార్య చనిపోగా యెహెజ్కేలు దేవుడు సెలవిచ్చినట్లుగా ప్రకటించాడు. దీని నెరవేర్పుగా దేవుడు తన పరిశుద్ధ స్థలమును, యెరూషలేము మందిరమును చెరపబోవుచున్నాడు.

**20-24వ ప్రదర్శన భావము:-** దేవాలయము నాశనము చేయబడినను దేవుడు చింతింపకుందునని ప్రజలు ఒకరి నొకరు చూచుకొని నిట్టూర్పులను విడుచుచూ మీరు చేసిన దోషమునుబట్టి క్షీణింతురని సెలవిచ్చాడు. దీనికి యెహెజ్కేలు దేవునికి తన భార్య యూదావారికి సూచనలని దేవుడు చెప్పాడు. అలాగే జరుగుటను మనము గమనించగలము.

**25-27వ. శేషమునకు వర్తమానము:-** అలాగు జరిగినప్పుడు తప్పించుకొని వచ్చిన యొకడు బబులోనులో నున్న ప్రవక్త దగ్గరకు రాగా ప్రవక్త దేవుని ప్రవచనములు నెరవేరిన సంగతిని స్పష్టముగా చెప్పునని సెలవిచ్చుచున్నాడు.

# 25వ. అధ్యాయము (7+4+3+3=17వ)

**అంశము:- చుట్టువున్న శత్రుదేశాలైన అమ్మోనీయులకు, మోయాబీయులకు ఎదోమీయులకు, ఫిలిష్తీయులకు కలుగబోవు శిక్షను గూర్చిన దేవోక్తి.**

**1-7వ. అమ్మోనీయులకు కలుగబోవు శిక్ష:-** అమ్మోనీయులు లోతు సంతానము (ఆది 19:38). లోతు అబ్రహాము సహోదరుని కుమారుడు, కనుక అబ్రహాముకు బంధువు. అదే వరుసలో అమ్మోనీయులు ఇశ్రాయేలీయులకు బంధువులు. ఇశ్రాయేలీయులు అరణ్యములో ప్రయాణము చేయు సందర్భమున అమ్మోనీయుల దేశము గుండా వెళ్ళునప్పుడు అమ్మోనీయులు ఒప్పుకొనక వారితో యుద్ధము చేసిరి. (ద్వితీ. 2:19,37). ఇశ్రాయేలీయులు అష్షూరుకు చెరగొని పోబడినప్పుడు అమ్మోనీయులు ఇశ్రాయేలీయుల దేశమును స్వతంత్రించుకొనిరి (యిర్మీ 40:14). ప్రభువు యొక్క పరిశుద్ధ స్థలమైన యెరూషలేము బబులోనీయులచే అపవిత్రపరచబడినప్పుడు, ఇశ్రాయేలీయుల దేశము పాడుచేయబడిన కాలమున యూదావారు చెరలోనికి పోయినప్పుడు, అమ్మోనీయులు సంతోషమని చెప్పుకొనుచు వచ్చిరి. కనుక యెహోవావాక్కు ప్రత్యక్షమై నరపుత్రుడా, అమ్మోనీయుల తట్టు ముఖము త్రిప్పుకొని వారిని గూర్చి ప్రవచింపుము అన్నాడు. అమ్మోనీయులారా, ప్రభువైన యెహోవా మాట ఆలకించుడి. మీరు చేతులు చరచుకొని కాళ్ళతో నేలతన్ని ఇశ్రాయేలీయుల యొక్కయు, యూదా వారి యొక్కయు శ్రమను చూచి మనస్సులోని తిరస్కారము కొలది మీరు ఉల్లసించిరి. కనుక ప్రభువు వారిని తూర్పున నుండు మనుష్యులగు బబులోనీయులకు స్వాస్థ్యముగా అప్పగించెదను అన్నాడు, వారు తమ డేరాలను అమ్మోనీయుల దేశములో వేసి, కాపుర ముండి, పంటలు తిందురు, పాలు త్రాగుదురు అన్నాడు. ప్రభువు అమ్మోనీయుల రబ్బా పట్టణమును, అమ్మోనీయుల దేశమునంతటిని ఒంటెల సాలగా, గొఱ్ఱల దొడ్డిగా చేసెదను అన్నాడు. అప్పుడు నేను యెహోవానై యున్నానని అమ్మోనీయులు తెలిసికొందురు అన్నాడు. అమ్మోనీయులు తెలిసి కొనుటకే దేవుడు వారికి విరోధియై, జనములకు దోపుడు సొమ్ముగా అప్పగించి, అన్యజనులలో ఉండకుండ, జనము కాకుండ వారిని నశింపజేతును అన్నాడు.

**8-11వ. మోయాబీయులకు కలుగబోవు శిక్ష:-** మోయాబీయులు లోతు సంతానము (ఆది 19:38). లోతు అబ్రహాము సహోదరుని కుమారుడు, కనుక అబ్రహాముకు బంధువు. అదే వరుసలో మోయాబీయులు ఇశ్రాయేలీయులకు / యూదావారికి బంధువులు. మోయాబీయులు యూదావారికి బంధువులైన యూదావారిమీద ఈర్ష్యకలిగినవారై

యూదావారు యెహోవా దేవుని సంతానమైనను యూదావారికిని ఇతర జనములన్నిటికిని భేదమేమియులేదని అంటున్నారు. గనుక తూర్పున నున్న ఐబులోనీయులచే, మోయాబీయుల దేశమునకు భూషణముగానున్న వారి పొలిమేర పురములగు, బేత్యేషీమోతును, బయల్మెయోనును, కిర్యతాయిమును, మోయాబీయుల సరిహద్దులోగానున్న పట్టణములన్నిటిని, నాశమునుచేసి అమ్మోనీయులనందరిని తూర్పుననున్నవారగు ఐబులోనీయులకు స్వాస్థ్యముగా అప్పగింతును అని యెహోవా అన్నాడు. నేను యెహోవానై యున్నానని మోయాబీయులు తెలిసికొనునట్లు ఈలాగున వారికి శిక్ష విధింతును అన్నాడు.

**12-14వ. ఎదోమీయులకు కలుగబోవు శిక్ష:-** ఎదోమీయులు యాకోబు సహోదరుడైన ఏశావు సంతానము. ఏశావు యొక్క జేష్ఠత్వమును యాకోబు మోసముగా సంపాదించినందున ఏశావుకు యాకోబుకు శత్రుత్వము కలదు. కనుక ఎల్లప్పుడు ఎదోమీయులు యాకోబు సంతానమైన ఇశ్రాయేలీయులతో పగతీర్చుకొందురు. ఇశ్రాయేలీయులు అరణ్యములో ప్రయాణము చేయునప్పుడు ఎదోము దేశము గుండా వెళ్ళుటకు సెలవిమ్మని మోషే అడుగగా ఎదోమీయులు ఒప్పుకొనలేదు (సంఖ్యా 20:14-20). ఎదోమీయులు యూదావారి మీద పగతీర్చు కొనుచున్నారు, తీర్పు తీర్చుకొనుటలో వారు బహుగా దోషులైరి గనుక ప్రభువైన యెహోవా ఎదోము మీద తన చెయ్యి చాపి, మనుష్యులేమి పశువు లేమి దానిలో నుండకుండ సమస్తమును నిర్మూలము చేసి, పట్టణము పాడుచేసి, జనులందరిని ఖడ్గముచేత కూల్చుదును అన్నాడు. ఇశ్రాయేలీయులచేత ఎదోము వారిమీద తన పగ తీర్చుకొని, తాను ఆలోచించిన దానిని నెరవేర్చుదును అన్నాడు. ఎదోమీయులు నా క్రోధము తెలిసి కొందురు. ఇదే యెహోవా వాక్కు అన్నాడు.

**15-17వ. ఫిలిష్తీయులకు కలుగబోవు శిక్ష:-** నోవహు కుమారులు షేము, హాము, యాపేతు. హాము కుమారులు కూషు మిస్రాయిము పూతు. ఫిలిష్తీయుల వంశకర్తలైన పత్రుసీయులు మిస్రాయిము సంతతివారు. కనుక ఫిలిష్తీయులు నోవహు కుమారుడగు హాము సంతానము. ఇశ్రాయేలీయులైతే షేము సంతానమగు అబ్రహాము, ఇస్సాకు, యాకోబు వంశమునకు చెందినవారు. కనుక ఒకరికి ఒకరు బంధువులే. కాని సమూయేలు రెండు గ్రంథములలో ఫిలిష్తీయులు ఇశ్రాయేలీయులతో ఎల్లప్పుడు యుద్ధము చేయుచు శత్రువులై యుండిరి. దాగోను దేవతను పూజించుచుండిరి. (1 సమూ 6:4). ప్రభువగు యెహోవా ఫిలిష్తీయులు ఇశ్రాయేలీయులపై పగతీర్చుకొనుచు నాశనము చేయుచు, మానని క్రోధము గలవారై తిరస్కారము చేయుచున్నారు గనుక ప్రభువైన యెహోవా ఫిలిష్తీయుల మీద తన చెయ్యి చాపి ప్రజలనందరిని సముద్ర తీరమున నివసించు శేషమును నశింపజేసెదను అన్నాడు. క్రోధముతో వారిని శిక్షించి వారి మీద పగతీర్చుకొనగా యెహోవాయే దేవుడై యున్నానని వారు తెలిసికొందురు అన్నాడు.

# 26వ. అధ్యాయము (6+8+7=21వ)

అంశము:- శత్రువైన తూరు పట్టణ నాశనమును గూర్చిన దేవోక్తి

**26:1-6వ. తూరు పట్టణము యొక్క అతిశయము:-** పదకొండవ సంవత్సరము అనగా యెరూషలేము పట్టణము, మందిరము నెబుకద్నెజరు ద్వారా క్రీ.పూ. 586లో పడగొట్టబడిన తరువాత యెహోవా వాక్కు ప్రత్యక్షమై తూరు యొక్క అతిశయమును గూర్చి ఈలాగు సెలవిచ్చెను.

1) 26:2 - యెరూషలేమును గూర్చి ఆహా జనములకు ద్వారముగా నున్న పట్టణము పడగొట్టబడెను, అది నావశమాయెను, అది పాడైపోయినందున నేను పరిపూర్ణము నొందితిని అని తూరు చెప్పెను.

2) 27:3,4 - తూరు పట్టణమా నేను సంపూర్ణ సౌందర్యము కలదానననై నీవనుకొనుచున్నావే; నీ శిల్పకారులు నిన్ను సంపూర్ణ సౌందర్యము గలదానిగా చేసియున్నారు. 3) 27:10,11 - పారసీక దేశపువారును, లూదువారును, పూతువారును నీ సైన్యములలో చేరి నీకు సిపాయిలుగా ఉన్నారు, వారు నీ డాళ్లను శిరస్త్రాణములను ధరించువారు, వారిచేత నీకు తేజస్సు కలిగెను. అర్వదవారు నీ సైన్యములో చేరి చుట్టు నీ ప్రాకారములకు డాళ్లు తగిలించి చుట్టు నీ ప్రాకారముల మీద కావలి కాచి నీ సౌందర్యమును సంపూర్ణపరచెదరు.

4) 27:25 - తర్షీషు ఓడలు నీకు బండ్లుగా ఉన్నవి. నీవు పరిపూర్ణమైనదానవై మహా ఘనముగా సముద్రము మీద కూర్చున్నావు.

5) 28:2 - గర్విష్ఠుడవై నేనొక దేవతను, దేవతనైనట్టు సముద్రము మధ్యను నేను ఆసీనుడనైయున్నాను అని నీవనుకొనుచున్నావు;

6)28:12 - తూరు రాజును గూర్చి ప్రభువైన యెహోవా సెలవిచ్చునదేమనగా పూర్ణజ్ఞానమును సంపూర్ణ సౌందర్యమునుగల కట్టడమునకు నీవు మాదిరివి.

యెహోవా సెలవిచ్చునదేమనగా తూరు పట్టణమా, నేను నీకు విరోధినైతిని, సముద్రము దానితరంగములు పొంగునట్లు నేను అనేకజనములను నీ మీదికి రప్పించెదను.

**7-14వ. బబులోనురాజు వచ్చుట:-** బబులోనురాజైన నెబుకద్నెజరును తూరుపట్టణము మీదికి రప్పించుచున్నాను, అతడు గుఱ్ఱములతోను రథములతోను రౌతులతోను గుంపులుగా నున్న సైన్యముతోను ఉత్తరదిక్కునుండివచ్చి బయటి పొలములోని నీ కుమార్తెలను ఖడ్గముతో చంపి, నీ కెదురుగా బురుజులు కట్టించి దిబ్బ వేయించి నీ కెదురుగా డాలు నెత్తును. మరియు అతడు నీ ప్రాకారములను పడగొట్టుటకై యంత్రములు సంధించి గొడ్డండ్రతో నీకోటలను పడగొట్టును. 14వ. నిన్ను వట్టి బండగా చేయుదును, వలలు పరచుకొనుటకు

చోటగుదువు, నీవికను కట్టబడకయుందువు. నేనే మాట యిచ్చియున్నాను; ఇదే ప్రభువగు యెహోవా వాక్కు

**15-21వ. తూరు పట్టణము యొక్క నాశనము:-** ప్రభువైన యెహోవా సెలవిచ్చునదేమనగా నివాసులులేని పట్టణములవలెనే నేను నిన్ను పాడుచేయునప్పుడు మహా సముద్రము ముంచునట్లుగా నీ మీదికి నేను అగాధజలములను రప్పించెదను, పురాతన కాలమందు పాతాళములోనికి దిగిపోయిన వారియొద్ద నీవుండునట్లు నిన్ను పడవేసి, పాతాళములోనికి దిగి పోవువారితో కూడ నిన్ను నివసింపజేసెదను. మరియు సజీవులు నివసించు భూమిమీద నేను మహా ఘనకార్యము కలుగజేతును; నిన్ను భీతికి కారణముగా జేతెను, నీవు లేకపోవుదువు, ఎంత వెదకినను నీవెన్నటికిని కనబడక యుందువు అని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

## 27వ. అధ్యాయము (11+14+11=36వ)

**అంశము:- తూరు పట్టణ నావికులు, వ్యాపారస్థుల నాశనమును గూర్చిన దేవోక్తి.**

**1-11వ. తూరు పట్టణము వ్యాపారము:-** తూరు పట్టణము వ్యాపారమునకు కేంద్రము. కొన్ని దేశములు వ్యాపారమును వస్తు మార్పిడి ద్వారానే చేయుదురు. కొన్ని దేశములలో డబ్బిచ్చి కొనుట ద్వారానే జరుగును. తూరువారు మధ్యవర్తులుగా నుండి డబ్బుకావలసిన వారికి డబ్బిచ్చుట, వస్తువులు కావలసిన వారికి వస్తువులు ఇచ్చుట చేయుదురు. కనుక వ్యాపారమునకు ముఖ్య పట్టణమై అతిశయించు చుండెను. యెహోవా వాక్కు ప్రత్యక్షమై యీలాగు సెలవిచ్చెను. తూరు పట్టణమా నేను సంపూర్ణ సౌందర్యము కలదాననని నీవనుకొనుచున్నావే; నీ సరిహద్దులు సముద్రముల మధ్య ఏర్పడెను, నీ శిల్పకారులు నిన్ను సంపూర్ణ సౌందర్యము గలదానిగా చేసియున్నారు. నీ ఓడలను శెనీరు దేశపు సరళ వృక్షపు మ్రానుతో, లెబానోను దేవదారు మ్రానులతో చేయుదురు. తూరు పట్టణమా, సీదోను నివాసులును అర్వదు నివాసులును నీకు ఓడకళాసులుగా ఉన్నారు. నీ స్వజనులకు చేరిన ప్రజ్ఞావంతులు నీకు ఓడ నాయకులుగా ఉన్నారు. గెబలులో పని తెలిసిన పెద్దలు నీ ఓడలను బాగు చేయువారుగా నున్నారు, సముద్రమందు నీ సరకులు కొనుటకై సముద్ర ప్రయాణము చేయు నావికుల యోడలన్నియు నీ రేవులలో ఉన్నవి. పారసీక దేశపువారును, లూదు వారును, పూతువారును, నీ సైన్యములలో చేరి నీకు సిపాయిలు నీ డాళ్లను శిరస్త్రాణములను ధరించువారు, వారిచేత నీకు తేజస్సు కలిగెను. అర్వదువారు నీ సైన్యములో చేరి చుట్టు నీ ప్రాకారములకు డాళ్లు తగిలించి చుట్టు నీ ప్రాకరాములమీద కావలి కాచి నీ సౌందర్యమును సంపూర్ణ పరచెదరు.

**12-25వ. తూరుతో వ్యాపారము చేయువారు:-** నానా విధమైనసరకులు నీలో విస్తారముగా నున్నందున 1) తర్షీషువారు, 2) గ్రేకేయులు, 3) తుబాలువారు, 4) మెషెకువారు, 5) తోగర్మావారు, 6) దదానువారు, 7) చాల ద్వీపముల వర్తకములు, 8) యూదావారు, 9) ఇశ్రాయేలు దేశస్థులు, 10) గ్రేకీయులు, 11) అరబీయులు, 12) కేదారు అధిపతులందరు, 13) షేబ వర్తకులు, 14) రామా వర్తకులు 15) హారానువారు, 16) కన్నేవారు, 17) ఏదెనువారు, 18) షేబ వర్తకులు, 19) అష్షూరు వర్తకులు, 20) కిల్మదు వర్తకులు, మొత్తము ఇరువది దేశముల వారు నీతో వర్తకము చేయుదురు. నీవు పరిపూర్ణమైనదానవై మహాఘనముగా సముద్రము మీద కూర్చున్నావు.

**26-36. తూరు, తూరుతో వ్యాపారము చేయువారు నాశనమగుట:-** నీ కొలలు వేయువారు మహా సముద్రములోనికి నిన్ను త్రోయగా తూర్పు గాలి సముద్ర మధ్య మందు నిన్ను బద్దలు చేయును. అప్పుడు నీ ధనమును, వస్తువులును, నీ నావికులును, నీ ఓడనాయకులును, నీ ఓడలు బాగుచేయువారును, నీతో వర్తకము చేయువారును, నీలో నున్న సిపాయిలందరును, నీలోనున్న జనసమూహములన్నియు, నీవు కూలుదినమందే సముద్ర మధ్యమందు కూలుదురు. వారందరును నిన్ను గూర్చి మహా శోకము, ప్రలాపవచనమెత్తి తూరు పట్టణమా, నీతో సాటియైన పట్టణమేది? సముద్రములో మునిగి లయమైపోయిన పట్టణమా, నీకు సమమైన పట్టణ మేది విస్తారమైన నీ పదార్థములచేతను నీ వర్తకములచేతను భూపతులను ఐశ్వర్యవంతులుగా చేసితివి. ఇప్పుడు అగాధ జలములలో మునిగి సముద్ర బలము చేత బద్దలైతివే, నీ వర్తకమును నీ యావత్సమూహమును నీతోకూడ కూలెనేయని చెప్పుకొనుచు బహుగా ఏడ్చుదురు. నీవు బొత్తిగా నాశనమగుదువు.

## 28వ. అధ్యాయము (10+9+4+3=26వ)

**అంశము:- తూరు రాజును గూర్చి - సీదోను పట్టణమును గూర్చి దేవుని సెలవు.**

**1-10వ. తూరు అధిపతితో ప్రభువగు యెహోవా సెలవిచ్చుట:-** బబులోనుచే తూరు నాశనమైనప్పుడు తూరును రెండవ ఇత్బాల్ రాజు పాలించాడు. దానియేలు 4:30లో నా రాజ్యము, నా బలము, నా ప్రభావము అని అతిశయించినట్లు, హేరోదు అపొ 12:23లో అతిశయించినట్లు తూరు రాజు కూడా చరిత్రలో గర్వించి, అతిశయించినట్లు చూతుము. కనుక యెహోవా వాక్కు యెహెజ్కేలుకు ప్రత్యక్షమై నరపుత్రుడా, తూరు అధిపతితో ఈలాగు ప్రకటింపుము అన్నాడు. ప్రభువగు యెహోవా సెలవిచ్చునదేమనగా గర్విష్ఠుడవై నేనొక దేవతను, దేవతనైనట్టు సముద్రము మధ్యను నేను ఆసీనుడనై యున్నాను అని నీవనుకొనుచున్నావు; నీవు దేవుడవు కాక మానవుడవై యుండియు దేవునికి తగినంత

అభిప్రాయము కలిగియున్నావు, నీవు దానియేలు కంటె జ్ఞానవంతుడవు, నీకు మర్మమైనదేదియు లేదు. నీ జ్ఞానముచేతను నీ వివేకముచేతను ఐశ్వర్యము నొందితివి, నీ ధానాగారము లోనికి వెండి బంగారములను తెచ్చుకొంటివి. నీకు కలిగిన జ్ఞానాతిశయముచేతను వర్తకముచేతను నీవు విస్తారమైన ఐశ్వర్యము సంపాదించుకొంటివి, నీకు ఐశ్వర్యము కలిగినదని నీవు గర్వించిన వాడవైతివి అని సెలవిచ్చాడు. నిజ దేవుని గుర్తించక నేనే దేవుడనని తలంచాడు. కనుక దేవుడైన యెహోవా పరదేశులగు అన్యజనులలో క్రూరులగు కల్దీయులను తూరు మీదికి రప్పించుచున్నాడు. వారు తూరు జ్ఞానశోభను చెరుపుటకై తమ ఖడ్గములను ఒరదీసి తూరు సౌంద్యమును నీచపరతురు, తూరును పాతాళములో పడవేతురు, సముద్రములో మునిగి చచ్చినవారివలెనే తూరు చచ్చునని దేవుడు సెలవిచ్చుచున్నాడు. ఇదే ప్రభువగు యెహోవా వాక్కు

**11-19వ. తూరు రాజుతో ప్రభువగు యెహోవా సెలవు:-** ముందు భాగములో అధిపతి తూరు రాజని చూచితిమి. కనుక ఇక్కడ చెప్పబడిన రాజును, ఆయన అలంకరణను చూచినప్పుడు ఇది ప్రవచనముగా సాతాను వర్ణన అని గ్రహింతుము. నరపుత్రుడా, తూరురాజును గూర్చి అంగలార్పు వచనమెత్తి ఈలాగు ప్రకటింపుము అన్న మాటలు సాతానును గూర్చి అని ధ్యానింతము. ప్రభువైన యెహోవా సెలవిచ్చునదేమనగా పూర్ణ జ్ఞానమును సంపూర్ణ సౌందర్యమునుగల కట్టడమునకు మాదిరివి. దేవుని తోటయగు ఏదెనులో నీవుంటివి, మాణిక్యము గోమేధికము సూర్యకాంతమణి రక్తవర్ణపురాయి సులిమానిరాయి మరకతము నీలము పద్మరాగము మాణిక్యము అను అమూల్య రత్నములతోను బంగారముతోను సాతాను అలంకరింపబడి యున్నాడు; సాతాను సృజించబడిన / నియమింపబడిన దినమున పిల్లన గ్రోవులు వాయించువారు సిద్ధమైరి. సాతాను అభిషేకించబడిన కెరూబు. అభిషేకము నొందిన కెరూబుగాను, యొక ఆశ్రయముగాను, దేవునిచేత నియమించబడి ప్రతిష్ఠింపబడినవాడుగా, దేవునికి పర్వతముమీద వుండెను. కాలుచున్న రాళ్లమధ్యను నీవు సంచరించు చుంటివి. నియమింప బడిన దినము మొదలుకొని పాపము తనలో కనబడువరకు ప్రవర్తన విషయములో యథార్థవంతుడుగా ఉండెను. అయితే తనకు కలిగిన విస్తారమైన వర్తకముచేత లోలోపల అన్యాయము పెంచుకొని పాపము చేయుచు వచ్చెను. గనుక దేవుని పర్వతముమీద వుండకుండ దేవుడు అపవిత్రపరచెను. నిన్ను నాశనము చేసితిని అని దేవుడు అన్నాడు. సాతాను తన సౌందర్యమును, తేజస్సును చూచుకొని గర్వించినవాడై, తన జ్ఞానమును చెరుపుకొనెను.

కావున దేవుడు సాతానును నేలను పడవేసెను. రాజులు చూచుచుండగా సాతానును హార్మెగిద్దోను యుద్ధములో హేళనకప్పగించును. సాతాను ప్రారంభము నుండి ముగింపు వరకు లేఖనములు ఏమి చెప్పుచున్నవో చూతము.

# సాతాను

1) ప్రారంభము:- యెహె 28:13-15వ. సాతాను ప్రారంభము ఒక మర్మమైనను 15వ. ప్రకారము తాను సృజించబడిన వాడే. 15వ. నీవు నియమింపబడిన / సృజించబడిన దినము (మూలభాషలో) మొదలుకొని పాపము నీ యందు కనబడు వరకు యథార్థ ప్రవర్తన కలవాడు. నీవు నియమింపబడిన దినమున పిల్లన గ్రోవులు వాయించువారును నీకు సిద్ధమైరి. 14వ. అభిషేకము నొందిన కెరూబువై (దూతలలో ముఖ్యుడు) యొక ఆశ్రయముగా నీవుంటివి; అందుకే నేను నిన్ను నియమించితిని. దేవునికి ప్రతిష్ఠింపబడిన పర్వతము మీద దేవుని తోటయగు ఏదెనులో (ప్రారంభ నివాసము) నీవుంటివి, కాలుచున్న రాళ్లమధ్యను నీవు సంచరించుచుంటివి. 13వ. మాణిక్యము గోమేధికము సూర్యకాంతమణి రక్తవర్ణపు రాయి సులిమాని రాయి మరకతము నీలము పద్మరాగము మాణిక్యము అను అమూల్య రత్నములతోను బంగారముతోను నీవు అలంకరింపబడియున్నావు;

2) పడిపోవుట:- యెష 14:12,14- తేజోనక్షత్రమా, వేకువచుక్కా నీవెట్లు ఆకాశము నుండి పడితివి? జనములనుపడగొట్టిన నీవు నేలమట్టమువరకు ఎట్లు నరకబడితివి? నేను ఆకాశమున కెక్కిపోయెదను దేవుని నక్షత్రములకుపైగా నా సింహాసనమును హెచ్చింతును ఉత్తరదిక్కుననున్న సభాపర్వతము మీద కూర్చుందును మేఘమండలము మీది కెక్కుదును మహోన్నతునితో నన్ను సమానునిగా చేసికొందును అని నీవు మనస్సులో అనుకొంటివి గదా? నీవు పాతాళమునకు నరకములో ఒక మూలకు తోయబడితివే.

3) ప్రస్తుత స్థానము:- పాతాళమునకు నరకములో ఒక మూలకు త్రోయబడినను ఎఫె 2:2, యోబు 1:7,2:2 ప్రకారము భూలోకములో వాయుమండల సంబంధమైన అధిపతియై అప్పుడప్పుడు పరలోకమునకు వెళ్ళగలుగు స్వతంత్రత కలవాడుగా భూమి మీద నున్నాడు. కనుక ప్రస్తుత స్థానము భూమి, వాయుమండలము.

4) ప్రభుత్వము:- మత్త 12:26 ప్రకారము సాతాను రాజ్యము కలవాడు. (అట్లయితే వాని రాజ్యమేలాగు నిలుచును?) ఎఫె 2:2, ప్రకారము వాయుమండల సంబంధమైన అధిపతియై యున్నాడు. కనుక రాజ్యముగల అధిపతిగా ప్రభుత్వము చేయుచున్నాడు.

5) పోరాటము:- ఎఫె 6:12 ప్రకారము మనము పోరాడునది శరీరులతో కాదు, గాని ప్రధానులతోను... ప్రస్తుత అంధకారసంబంధులగు లోకనాథులతోను, ఆకాశమండల మందున్న దురాత్మల సమూహములతోను పోరాడుచున్నాము. దాని. 10:12-13వ.లో దానియేలూ, నీవు చెప్పిన మాటలను బట్టి నేను వచ్చితిని, కాని పారసీకుల రాజ్యాధిపతి ఇరువది యొక దినములు నన్ను ఎదిరించెను. ఇంక పారసీకుల రాజుల సముఖమున నేను నిలుచుచుండగా ప్రధానాధిపతులలో మిఖాయేలను ఒకడు నాకు సహాయము

చేయవచ్చెను. ఇక్కడ గాబ్రియేలును ఆటంకపరచిన పారసీకుల రాజ్యాధిపతి సాతాను దూతయే. ఈ దూతలు ప్రక 12:9వ. ప్రకారము సాతాను వెంట నున్న స్వతంత్రత కలిగిన పడిపోయిన దూతలు. కనుక సాతాను వాని దూతలు విశ్వాసులతో పోరాడు పనిలో నున్నారు.

6) పద్ధతులు:- 1) లోకమును తన వశములో పెట్టుకొనుట:- 1 యోహా 5:19వ. ప్రకారము లోకమంతయు దుష్టుని యందున్నదనియు ఎరుగుదుము.

2)మనో నేత్రములకు గ్రుడ్డితనము కలిగించుట:- 2 కొరిం. 4:4లో ఈ యుగసంబంధమైన దేవతయగు సాతాను అవిశ్వాసులైనవారి మనోనేత్రాలకు గ్రుడ్డితనము కలుగజేసెను.

3) భిన్నమైన సువార్త వ్యాపింప చేయుట:- గల 1:6వ.లో భిన్నమైన సువార్త తట్టుకు గలతీయులు తిరిగిపోవుట చూడగా నాకాశ్చర్యమగుచున్నది అని వున్నది. ఈ భిన్నమైన సువార్త సాతాను వ్యాపింప చేయునదియే.

7) పరలోకము నుండి నెట్టివేయబడుట:- ప్రక 12:8-10వ. ఆ ఘటసర్పమును దాని దూతలును యుద్ధము చేసిరి గాని గెలువ లేకపోయిరి గనుక పరలోకమందు వారికిక స్థలము లేకపోయెను. కాగా సర్వలోకమును మోసపుచ్చుచు, అపవాదియనియు సాతాననియు పేరుగల ఆదిసర్పమైన ఆ మహాఘటసర్పము పడద్రోయబడెను. అది భూమి మీద పడద్రోయబడెను; వాని దూతలు కూడ పడద్రోయబడిరి. మిఖాయేలుతో జరిగిన యుద్ధములో సాతాను పరలోకమునుండి నెట్టివేయబడెను.

8) శరీరము ధరించుకొనుట:- సాతాను పరలోకమునుండి భూమిమీద పడద్రోయబడినందున శరీరము ధరించుకొనిన క్రీస్తు విరోధిగా ప్రక 13:1లోభూమిపైకి వచ్చును.

9)నాశనము:- ప్రకటన 20:1-3వ. ప్రకారము వేయి సంవత్సరములు అగాధములోనికి, తదుపరి ప్రక 20:7-10వ. ప్రకారము అగ్ని గుండములోనికి వేయబడును. అపవాదిని గూర్చి చెప్పబడిన పది అంశములు చూతము. యెహె. 28:13-15.

1) దేవుని తోటయగు ఏదెనులో నీవుంటివి,

2) అమూల్య రత్నములతోను బంగారముతోను నీవు అలంకరింపబడి యున్నావు;

3) నీవు సృజించబడిన దినమున (మూలభాషలో 'బారా' అనగా సృజించబడిన అని అర్థము కలదు) / నియమింపబడిన దినమున పిల్లన గ్రోవులు వాయించువారును నీకు సిద్ధమైరి. అభిషేకము నొందిన కెరూబువై యొక ఆశ్రయముగా నీవుంటివి; అందుకే నేను నిన్ను నియమించితిని. దేవునికి ప్రతిష్ఠింపబడిన పర్వతము మీద నీవుంటివి, కాలుచున్న రాళ్ల మధ్యను నీవు సంచరించుచుంటివి. నీవు సృజించబడిన దినము / నియమింపబడిన దినము మొదలుకొని 4) పాపము నీయందు కనబడు వరకు ప్రవర్తన విషయములో నీవు

యథార్థవంతుడవుగా ఉంటివి. 5) యెష 14:12-14-- నేను ఆకాశమున కెక్కి పోయెదను దేవుని నక్షత్రములకుపైగా నా సింహాసనమును హెచ్చింతును, ఉత్తర దిక్కున నున్న సభాపర్వతముమీద కూర్చుందును, మేఘమండలము మీది కెక్కుదును, మహోన్నతునితో నన్ను సమానునిగా చేసికొందును అని నీవు మనస్సులో అనుకొంటివి గదా? నీవు పాతాళమునకు నరకములో ఒక మూలకు త్రోయబడితివే అని వ్రాయబడినది. ఈ తీర్పు మానవ సృష్టికిముందు అపవాదిలో పాపము కన్పించినప్పుడు దేవుడు తీర్చిన తీర్పు. 6) యోబు 1:6, 2:1లో అపవాది దేవదూతలతో కూడా పరలోకములో నున్న ప్రభువు యొద్దకు వెళ్లుచున్నాడు. కనుక నరకమునకు ఇంకను వెళ్లలేదని, 7) ఎఫె. 2:2-3వ. ప్రకారము వాయుమండల అధిపతిగా నుండి అప్పుడప్పుడు పరలోకమునకు వెళ్లు స్వతంత్రత కలిగి యున్నాడని తలంచాలి. 8) ప్రక 12:7లో జరుగు యుద్ధమునుబట్టి పరలోకమునకు వెళ్ళు స్వతంత్రత కోల్పోయి భూమి మీదకు పడవేయబడుచున్నాడు.

9) ప్రక 20:1-4వ. ప్రకారము వేయి ఏండ్ల కాలములో అగాధములో వేయబడి... 10) చివరిగా ప్రక 20:14-15లో నరకములో వేయబడును.

**20-23వ. సీదోను పట్టణమును గూర్చి ప్రభువగు యెహోవా సెలవు:-** సీదోను తూరుకు నలువది కిలోమీటర్ల దూరమున నున్నది. న్యాయా 1:31వ. ప్రకారము ఆశేరు గోత్రీకులు సీదోనీయులను తోలివేయలేదు. వీరు తూరీయుల వశమున నుండిరి. ముందుగా అష్షూరీయులకు, పారసీకులకు, గ్రీకులకు, తదుపరి రోమీయులకు లోబడియుండిరి. కొత్తనిబంధనలో కూడా వీరి ప్రస్తావన కలదు. ఇశ్రాయేలీయులపై శత్రువులు రాగా యూదా వారికి సహాయము చేయక బబులోనుకు సహాయపడిరి. వీరు విగ్రహారాధికులై యుండి బయలు, అష్తారోతు అను వీరి దేవతలు ఇశ్రాయేలీయులకు ఉరిగా నుండిరి. ప్రభువగు యెహోవా సెలవిచ్చునదేమనగా సీదోను పట్టణమా, నేను నీకు విరోధిని, నీ మధ్యను ఘనత నొందుదును అన్నాడు. నేను నిన్ను బట్టి నన్ను పరిశుద్ధపరచుకొనగా నేను యెహోవానైయున్నానని నీవు తెలిసికొందువు. నేను యెహోవానని వారు తెలిసికొనునట్లు తెగులును రక్తమును సీదోనీయుల వీధులలోనికి పంపించుదును, నలుదిక్కుల దానిమీదికి వచ్చు ఖడ్గముచేత సీదోనీయులు హతులగుదురు అని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

**24-26వ. ఇశ్రాయేలీయులు సమకూర్చబడి, ఆశీర్వదించబడుట:-** నేను ప్రభువగు యెహోవానని ఇశ్రాయేలీయులు తెలిసికొనునట్లు వారు చుట్టునుండి వారిని తిరస్కరించుచు వచ్చిన వారిలో ఎవరును ఇక వారికి గుచ్చుకొను ముండ్లుగానైనను నొప్పించు కంపగానైనను ఉండరు. ప్రభువైన యెహోవా సెలవిచ్చునదేమనగా జనులలో చెదిరిపోయిన ఇశ్రాయేలీయులను నేను సమకూర్చి, జనుల సమక్షమున వారి మధ్యను నన్ను నేను

పరిశుద్ధ పరచుకొందును, అప్పుడు నా సేవకుడైన యాకోబునకు నేనిచ్చిన తమ దేశములో వారు నివసించెదరు. వారు అందులో నిర్భయముగా నివసించి యిండ్లు కట్టుకొని ద్రాక్షతోటలు నాటుకొందురు, వారి చుట్టువుండి వారిని తిరస్కరించుచు వచ్చిన వారి కందరికి నేను శిక్ష విధించిన తరువాత వారు నిర్భయముగా నివసించు కాలమున నేను తమ దేవుడైన యెహోవానై యున్నానని వారు తెలిసికొందురు.

### (8) 29-32అ. ఐగుప్తు దేశమునకు తీర్పును గూర్చిన ప్రవచనము

## 29వ. అధ్యాయము (7+5+4+4+1=21వ)

అంశము:- ఐగుప్తుకు శిక్ష -తరువాత విమోచన.

యిర్మీ 39:1లో చెప్పబడినట్లు యూదారాజైన సిద్కియా యేలుబడి యందు తొమ్మిదవ సంవత్సరము పదియవ నెలలో (క్రీ.పూ 588) బబులోను రాజైన నెబుకద్నెజరు తన సమస్త సైన్యముతో యెరూషలేము మీదికి వచ్చి దాని ముట్టడి వేయగా, పదకొండవ సంవత్సరము నాలుగవనెల తొమ్మిదవ దినమున (క్రీ.పూ 586) బబులోను రాజుచే పట్టణ ప్రాకారములు పడగొట్టబడెను.

**1-7వ. ఐగుప్తుకు శిక్ష:-** పదియవ సంవత్సరము పదియవ నెల పండ్రెండవ... దినమున యెహోవా వాక్కు ప్రత్యక్షమై యెహెజ్కేలును ముఖము ఐగుప్తురాజైన ఫరోవైపు త్రిప్పుకొని ఫరోను గూర్చి ఐగుప్తు దేశమంతటినిగూర్చి ఈ సమాచారమెత్తి ప్రవచింపుమని సెలవిచ్చాడు అనగా యెరూషలేము పట్టణము బబులోను రాజుచే ముట్టడి వేయబడిన దినములలో దేవుడు సెలవిచ్చినది. ఈ భాగములో ఐగుప్తు రాజైన ఫరో, నైలునదిలో పండుకొనియున్న పెద్ద మొసలితో పోల్చుట చూతుము. నది ఐగుప్తు దేశము. అందలి చేపలు ఐగుప్తు ప్రజలు. యెహోవా సెలవిచ్చునదేమనగా, నైలునది నాది, నేనే దాని కలుగజేసితిని అని ఐగుప్తు చెప్పుకొనుచున్నాడు; దేవుడు ఐగుప్తు దవుడలకు గాలములు తగిలించి, నదులలో నున్న చేపలన్నిటినీ బయటికి లాగును. పెద్ద మొసలియగు ఐగుప్తు రాజు, చేపలగు ఐగుప్తు ప్రజలను నీళ్ళ నుండి లాగి బయట పడవేయగా జలచరములైన చేపలన్ని చచ్చినట్లు ఐగుప్తురాజు, ప్రజలు సంహరింపబడుదురని చెప్పుచున్నాడు. ఐగుప్తు ఇశ్రాయేలీయులకు రెల్లుపుల్లవంటి చేతికఱ్ఱ అయెను; ఇశ్రాయేలీయులు రెల్లుపుల్ల వంటి ఐగుప్తును చేత పట్టుకొనినప్పుడు ఐగుప్తు విరిగిపోయి ఇశ్రాయేలీయుల నడుములు విరిగిపోవుటకు కారణమాయెను. అందులకై ఐగుప్తును నాశనము చేయును.

**8-12వ. ఐగుప్తు నాశన వివరము:-** ప్రభువైన యెహోవా ఐగుప్తు మీదికి ఖడ్గము రప్పించి, మనుష్యులను పశువులను నిర్మూలము చేయును, ఐగుప్తు దేశము నిర్మానుష్యమై పాడుగా

ఉండును, అప్పుడు దేవుడు యెహోవాయే అని వారు తెలిసికొందురు అన్నాడు. నైలునది నాది, నేనే దాని కలుగజేసితినని ఐగుప్తు అనుకొనుచున్నాడు గనుక దేవుడు విరోధియై ఐగుప్తు దేశమును బొత్తిగా పాడుచేసి యెడారిగా ఉంచును. దానిలో మనుష్యులు సంచరించరు, పశువులు తిరుగవు. నలువది సంవత్సరములు అది నిర్మానుష్యముగా ఉండును. నిర్మానుష్యముగానున్న దేశముల మధ్యను ఐగుప్తు దేశమును పాడగునట్టుగా చేయును, పాడైపోయిన పట్టణముల మధ్యను దాని పట్టణముల నలువది సంవత్సరములు పాడైయుండును, ఐగుప్తీయులను ఆయా దేశములకు జనములలోనికి చెదరగొట్టుదునని యెహోవా సెలవిచ్చాడు.

**13-16వ. ఐగుప్తు విమోచన - సమకూర్పు:-** ప్రభువైన యెహోవా నలువది సంవత్సరములు జరిగిన తరువాత ఐగుప్తీయులను చెదరిపోయిన జనులలోనుండి సమకూర్చును. చెరలోనుండి వారిని తోడుకొని పత్రోసు అను వారి స్వదేశములోనికి మరల రప్పించును. అక్కడ వారికను జనముల మీద అతిశయపడకుండునట్లు రాజ్యములన్నిటిలో వారు హీనమైన రాజ్యముగా ఉందురు. వారు ఇక రాష్ట్రములమీద ప్రభుత్వము చేయకుండునట్లు దేవుడు వారిని తగ్గించును. ఇశ్రాయేలీయులు తాము చేసిన దోషము మనస్సునకు తెచ్చుకొని వారి తట్టు తిరిగినను ఐగుప్తీయులు ఇక వారికి ఆధారముగా ఉండరు. అప్పుడు దేవుడు ప్రభువైన యెహోవాయే అని వారు తెలిసికొందురు.

**17-20వ. బబులోను రాజైన నెబుకద్నెజరునకు జీతము:-** ఇరువదియేడవ సంవత్సరము మొదటినెల మొదటి దినమున యెహోవా వాక్కు యెహెజ్కేలునకు ప్రత్యక్షమాయెను. (ఈ భాగమొకటియే ఇరువది ఏడవ సంవత్సరమునకు చెందినది). అనగా పట్టణము పడగొట్టబడిన తరువాత పదహారు సంవత్సరములకు అని భావము. తూరు పట్టణము మీద బబులోను రాజైన నెబుకద్నెజరు తన సైన్యముచేత బహు ఆయాసకరమైన పని చేయించెను. వారందరి తలలు బోడివాయెను. అందరి భుజములు కొట్టుకొని పోయెను; అయినను తూరు పట్టణము మీద అతడు చేసిన కష్టమునుబట్టి అతనికైనను, అతని సైన్యమునకైనను కూలి యెంత మాత్రమును దొరకక పోయెను. కాబట్టి ప్రభువైన యెహోవా సెలవిచ్చునదేమనగా ఐగుప్తుదేశమును బబులోనురాజైన సొమ్మును దోచుకొని కొల్లపెట్టును, అది అతని సైన్యమునకు జీతమగును. తూరు పట్టణము మీద అతడు చేసినది నా నిమిత్తమే చేసెను గనుక అందుకు బహుమానముగా దానిని అప్పగించుచున్నాను అన్నాడు.

**21వ. ఇశ్రాయేలీయుల విమోచన:-** ఆ దినమందు యెహోవా ఇశ్రాయేలీయుల కొమ్ము చిగిరింపజేసి వారిలో మాటలాడుటకు ధైర్యము కలుగజేయును, అప్పుడు దేవుడు యెహోవాయే అని వారు తెలిసికొందురు.

# 30వ. అధ్యాయము (5+7+7+7=26వ)

**అంశము:- ఐగుప్తు, జనులందరును యెహోవాను ఎరుగుట కొరకైన శిక్ష**

**1-5వ. ఐగుప్తుకు, అన్యజనులందరికి శిక్ష:-** మరియు యెహోవా వాక్కు యెహెజ్కేలునకు ప్రత్యక్షమై ఇలాగు సెలవిచ్చెను అహా శ్రమ దినము యెహోవా దినము వచ్చెను, అది దుర్దినము, అన్యజనులు శిక్షనొందు దినము. ఖడ్గము ఐగుప్తు దేశము మీదపడును, ఐగుప్తీయులలో హతులు కూలగా కూషుదేశస్థులు వ్యాకులపడుదురు, శత్రువులు ఐగుప్తీయుల ఆస్తిని పట్టుకొని దేశపు పునాదులను పడగొట్టుదురు. వారి సహకారులైన, కూషీయులును, పూతీయులును, లూదీయులును కూబాయులును నిబంధన దేశపు వారును మిశ్రిత జనులందరును ఖడ్గము చేత కూలుదురు. ఇది శ్రమల, మహా శ్రమల కాలమున జరుగును.

**6-12వ. ఐగుప్తును ఉద్ధరించు వారు కూలుట:-** యెహోవా సెలవిచ్చునదేమనగా ఐగుప్తును ఉద్ధరించువారు కూలుదురు, దాని బలగర్వము అణగిపోవును, మిగ్దోలు మొదలుకొని సెవేనే వరకు జనులు ఖడ్గముచేత కూలుదురు. పాడైపోయిన దేశముల మధ్య ఐగుప్తీయులు దిక్కులేనివారుగా నుందురు. నలుదిక్కుల పాడైపోయిన పట్టణముల మధ్య వారి పట్టణము లుండును. ఐగుప్తు దేశములో అగ్ని రగులబెట్టి నేను దానికి సహాయకులు లేకుండచేయగ నేను యెహోవానై యున్నానని వారు తెలిసికొందురు. ప్రభువైన యెహోవా సెలవిచ్చునదేమనగా ఐగుప్తీయులు చేయు అల్లరి బబులోను రాజైన నెబుకద్నెజరుచేత నేను మాన్పించెదను. జనములలో భయంకరులగు తన జనులను తోడుకొని ఆ దేశమును లయపరచుటకు అతడు వచ్చును, ఐగుప్తీయులను చంపి నైలునదిని ఎండిపోజేసి ఆ దేశమును దుర్జనులకు అమ్మి వేసెదను అంటున్నాడు.

**13-19వ. బొమ్మలను ఆశ్రయించిన ఐగుప్తీయులు:-** యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు విగ్రహములను నిర్మూలముచేసి, ఒక బొమ్మయైనను లేకుండ చేసెదను. ఇక ఐగుప్తు దేశములో అధిపతిగా ఉండుటకెవడును లేకపోవును, ఐగుప్తు దేశములో భయము పుట్టించెదను. పత్రోసును, సోయను, నోలో, సీనును, ఐగుప్తీయుల ముఖ్య పట్టణములను నిర్మూలము చేసెదను. నేను ఐగుప్తీయులకు శిక్ష విధింపగా నేను యెహోవానై యున్నానని వారు తెలిసికొందురు అన్నాడు.

**20-26వ. యెహోవాను తెలిసికొనవలసిన ఐగుప్తీయులు:-** పదకొండవ సంవత్సరము మొదటి నెల యేడవ దినమున యెహోవా వాక్కు యెహెజ్కేలునకు ప్రత్యక్షమై యీలాగు సెలవిచ్చెను. నేను ఐగుప్తు రాజైన ఫరో బాహువును విరిచితిని, అది బాగవుటకు ఎవరును దానికి కట్టుకట్టరు, అది కుదర్చబడదు. బాగుగా ఉన్న దానిని విరిగిపోయిన దానిని అతని రెండు చేతులను విరిచి, అతని చేతిలోనుండి ఖడ్గము జారిపడ జేసెదను. ఐగుప్తీయులను

జనములోనికి ఆయా దేశములకు వారిని వెళ్ళగొట్టుదును. బబులోను రాజుయొక్క చేతులను బలపరచి ఫరో చేతులను ఎత్తకుండచేసి, ఐగుప్తు దేశముమీద చాపుటకై దేవుడు తన ఖడ్గమును బబులోను రాజు చేతికియ్యగా దేవుడు యెహోవాయే అని ఐగుప్తీయులు తెలిసికొందురు.

## 31వ. అధ్యాయము (9+5+4=18వ)

**అంశము:- జనులందరును అతిశయించినందున నాశనమగుట.**

**1-9వ. విస్తారమైన కొమ్మలతో శృంగారించబడిన వృక్షమైన ఐగుప్తు:-** పదకొండవ సంవత్సరము మూడవ నెల మొదటి దినమున యెహోవా వాక్కు యెహెజ్కేలునకు ప్రత్యక్షమై ఈలాగు సెలవిచ్చెను అనగా యెరూషలేము పట్టణము బబులోను రాజుచే ముట్టడి వేయబడిన దినములలో దేవుడు సెలవిచ్చినది. ఆ దినములలో అష్షూరీయులు విస్తరించిన చెట్టువలె నుండిరి. ఐగుప్తు రాజైన ఫరో ఘనుడై అష్షూరీయుల లెబానోను దేవదారు వృక్షమైనట్లుండెను. వారి కొమ్మలు శృంగారములు, వారి కొన బహు ఎత్తయినందున మేఘములకు అంటెను. దానికున్న శృంగారము దేవుని వనములోనున్న వృక్షములలో దేనికిని లేదు. విస్తారమైన కొమ్మలతో దేవుడు దానిని శృంగారించినందున దేవుని వనమైన ఏదెనులోనున్న వృక్షములన్నియు దాని సొగసు చూచి దాని యందు అసూయపడెను.

**10-14వ. అతిశయపడి నాశనమైన ఐగుప్తు:-** ప్రభువైన యెహోవా సెలవిచ్చుచున్నాడు ఐగుప్తు తన కొన మేఘములకంటజేసి తన యెత్తునుబట్టి గర్వించెను. కాబట్టి యతని దుష్టత్వమునుబట్టి అతనిని తరిమివేసి, జనములలో బలముగల జనమునకు యెహోవా అతని అప్పగించును. ఆ జనము అతనికి తగినపని చేయును. జనములలో క్రూరులైన కల్దీయులు అతనిని నరికి పారవేసిరి. కొండలలోను లోయలన్నిటిలోను అతని కొమ్మలు పడెను. క్రింద లోకమునకు పోవు నరులయొద్దకు దిగువారితో కూడ ఐగుప్తీయులు మరణము పాలైరి.

**15-18వ. ఫరో అతని ఆశ్రయించిన జనులు నశించుట:-** ప్రభువైన యెహోవా సెలవిచ్చునదేమనగా ఐగుప్తు నాశనమై పాతాళములోనికి పోయిన దినమున అతని ఆశ్రయించిన జనములందరును వణకిరి. అన్యజనులమధ్య అతని నీడను నివసించి అతనికి సహాయులగువారు అతనితో కూడ పాతాళమునకు దిగిరి. కాబట్టి ఘనముగాను గొప్పగానున్న ఫరోకును అతని సమూహమునకును ఈలాగు సంభవించునని దేవుడు చెప్పాడు.

## 32వ. అధ్యాయము (8+8+8+8=32వ)

**అంశము:- ఐగుప్తీయుల సమూహము నాశనమై పాతాళములో పడవేయబడుట**

**1-8వ. ఐగుప్తు నాశన విధము:-** మరియు పండ్రెండవ సంవత్సరము పండ్రెండవ నెల

మొదటి దినమున యెహోవా వాక్కు యెహెజ్కేలునకు ప్రత్యక్షమై యీలాగు సెలవిచ్చెను అనగా యెరూషలేము పట్టణ ప్రాకారములు పడగొట్టబడిన తరువాత దేవుడు సెలవిచ్చినది. ఐగుప్తు రాజైన ఫరోను గూర్చి అంగలార్పు వచనమెత్తి అతనికి ఈ మాట ప్రకటింపుము అన్నాడు. ఐగుప్తు జనములలో కొదమ సింహమగు రాజు వంటివాడు అని ఎంచబడెను. కాని జలములను మొసలివంటివాడై కాళ్లతో నీళ్లు కలియబెట్టి వాటి వాగులను బురదగా చేసెను. జలములు అనగా ప్రపంచ జనములు (ప్రక 17:15) పాడుచేయబడిరి. ప్రభువైన యెహోవా సెలవిచ్చునదేమనగా గుంపులు గుంపులుగా ప్రపంచ జనములను సమకూర్చి నేను నావలను నీమీద వేయగా వారు నా వలలో చిక్కిన నిన్ను బయటికి లాగి నిన్ను నేల పడవేసి తెరప నేల మీద పారవేసెదను. ఆకాశ పక్షులన్నియు నీమీద వాలునట్లు నీవలన భూజంతువులన్నిటిని కడుపార తిననిచ్చెదను, నీ మాంసమును పర్వతములమీద వేసెదను, లోయలన్నిటిని నీ కళేబరములతో నింపెదను. నేను నిన్ను ఆర్పివేసి ఆకాశ మండలమును మరుగు చేసెదను, నక్షత్రములను చీకటి కమ్మజేసెదను, సూర్యుని మబ్బుచేత కప్పెదను, చంద్రుడు వెన్నెల కాయకపోవును. నిన్నుబట్టి ఆకాశమందు ప్రకాశించు జ్యోతుల కన్నిటికిని అంధకారము కమ్మజెసెదను, నీ దేశము మీద గాఢాంధకారము వ్యాపింపజెసెదను అన్నాడు. శ్రమలు మహా శ్రమల కాలములో ఐగుప్తు నాశనము ఈలాగు జరుగును.

**9-16వ. ప్రభువే బబులోను రాజు ద్వారా నాశనము చేయుట:-** నీవు ఎరుగని దేశములలోనికి నేను నిన్ను వెళ్లగొట్టి, నా ఖడ్గమును ఝుళిపించగా జనులు కలవరించి, భీతులై, ప్రాణ భయముచేత వణకుదురు. ప్రభువు పంపు బబులోనురాజు ఖడ్గము నీ మీదికి వచ్చును, ఐగుప్తీయుల గర్వము నణచివేయగా దాని సైన్యమంతయు లయమగును. గొప్ప ప్రవాహముల దరినున్న పశువులనన్నిటిని నేను లయపరచెను. నాశనము చేసి దాని నివాసులనందరిని నిర్మూలముచేయగా నేను యెహోవానైయున్నానని వారు తెలిసికొందురు. ఈ అంగలార్పు వచనము, అన్యజనుల కుమార్తెలు యెత్తి పాడుదురు. ఈ ప్రవచన ప్రకారము బబులోనుచే ఐగుప్తు పతనమాయెను.

**17-24,25-32వ. ఐగుప్తీయుల సమూహము పాతాళములో పడవేయబడుట:-** అల్లరిచేయు ఐగుప్తీయుల సమూహము భూమి క్రింద అనగా పాతాళములో పడవేయబడుదురు. 18,24,25,29,30 వచనాలలో పాతాళమను గోతి లోనికి, దిగిపోయిన తూర్పుననున్న ఎదోము, ఏలామను వారిని, పడమరనున్న మెషెకు, తుబాలు అనువారిని, ఉత్తరదేశపు అధిపతులందరిని, సీదోనీయులందరిని, వారి సమూహములను ప్రసిద్ధినొందిన జనముల కుమార్తెలను ఐగుప్తీయులు చూతురు. వారందరు ఒకరినొకరు చూచి ఓదార్పు తెచ్చుకొందురని యెహోవా సెలవిచ్చుచున్నాడు.

(9) 33-35 అధ్యా. కాపరుల గూర్చి ఎదోమును గూర్చిన తీర్పుల ప్రవచనము

# 33వ. అధ్యాయము (9+11+9+4=33వ)

అంశము:- కావలి వానిగా నియామకము స్థిరపరచుట - బాధ్యతలు

**1-9వ. కావలి వాని నియామకము - బాధ్యతలు:-** జనులు ఒక కావలి వానిని ఏర్పరచుకొనిన పిదప, కావలివాడు బాకా ఊది జనులను హెచ్చరిక చేసిన సమయమున ఎవడైనను బాకానాదము వినియును జాగ్రత్తపడనందున ఖడ్గము వచ్చి వాని ప్రాణము తీసిన ఎడల తన ప్రాణమునకు తానే ఉత్తరవాది యగును. కావలివారు ఖడ్గము వచ్చుట చూచి హెచ్చరిక చేయనందున ఎవడైనను తన దోషమును బట్టి పట్టబడిన యెడల కావలివాని యొద్ద వాని ప్రాణమును ప్రభువు విచారించును. అలాగే దుర్మార్గునికి తన దోషముకై కలుగు మరణ శిక్షనుబట్టి హెచ్చరిక చేయుటకై యెహెజ్కేలు కావలివాడుగా నియమింపబడెను. 3:16లో దేవుడు యెహెజ్కేలును ప్రవక్తగా నియమించాడు. 33:7 దానినే స్థిరపరచుచున్నాడు.

**10-20వ. మొదటి ప్రశ్నకు జవాబు:-** మా పాప దోషములు మా మీద పడియున్నవి. వాటి వలన క్షీణించుచున్నాము. మనమెట్లు బ్రతుకుదుమని మీరు చెప్పుమాట నిజమే అన్న ప్రశ్నకు జవాబుగా దేవుడు తన జీవముతోడు దుర్మార్గుడు మరణము నొందుట వలన నాకు సంతోషము లేదని దుర్మార్గత నుండి మరలి బ్రతుకుట వలన తనకు సంతోషమని చెప్పి వివరించుచున్నాడు. 3:18-21లో వ్రాయబడినది చదవండి.

**21-29వ. రెండవ ప్రశ్నకు జవాబు:-** 21-22వ. చెరలోనికి వచ్చిన 12వ సంవత్సరము అనగా క్రీ.పూ. 586లో బబులోను రాజుచే యెరూషలేము పట్టబడి కాల్చబడినది. అక్కడనుండి తప్పించుకొనిన ఒకడు చెరలోనున్న యెహెజ్కేలు దగ్గరకు వచ్చి పట్టణము కొల్లపెట్టబడిన సంగతి చెప్పాడు. అబ్రహాము ఒంటరియై యుండగా స్వాస్థమిచ్చిన దేవుడు అనేకులకివ్వడా అన్న వారి ప్రశ్నకు జవాబుగా వారిలో పాపమున్నందున వారు దేశమును స్వతంత్రించుకొనలేరని దేవుడు చెప్పాడు. పైగా ప్రవక్త యొద్దకు వచ్చి జనులు దేవుని మాటలను ప్రవక్త ద్వారా వినియు వాటిని అనుసరించి ప్రవర్తింపనందున కేవలము నోటితోనే ప్రేమను కనుపరచుచు జీవితములో ప్రేమలేనందున దేవుడు తాను చెప్పిన మాటను నెరవేర్చి వారిని శిక్షింతునని సెలవిచ్చెను. శిక్ష తరువాత వారిని విమోచించుట దేవుని ప్రేమయై యున్నది.

**30-33వ. దేవుని యొద్దకు రాదగిన విధముగా రాని యూదావారు:-** యెరూషలేము నాశనమును గూర్చి ప్రవక్త చెప్పినదంతయు నెరవేరినది. జనులు ఇంకను ఏమి జరుగునో

అని ప్రవక్తను ఆసక్తితో అడుగుచున్నారు కాని జీవితములు దిద్దుకొను ఆలోచన వారికి లేదు. నోటితో ప్రేమను కనుపరచుచు హృదయమందు లాభాపేక్ష కలవారుగా నున్నారు. ఇందులో పాఠముగా మనము ఆ రీతిగా ఉండకూడదని నేర్చుకొందము.

## 34వ. అధ్యాయము (9+10+12=31వ)

**అంశము:- ఇశ్రాయేలీయుల కాపరులు - కాపరియైన ప్రభువు**

**1-9వ. ఇశ్రాయేలీయుల కాపరుల ప్రవర్తన:-** యూదా మనుష్యులు దేవుని గొఱ్ఱెలు. ప్రభువైన యెహోవాయే వారి నిజమైన కాపరి. కాని యూదా వారి కాపరుల ప్రవర్తన ఇక్కడ చెప్పబడినది. (1) కాపరులు గొఱ్ఱెలను మేపరు. (2) తమ కడుపు నింపుకొందురు. (3) క్రొవ్విన వాటిని వధింతురు. (4) తిందురు (5) వాటి బొచ్చు కప్పుకొందురు. (6) బలహీనమైన వాటిని బలపరచరు (7) రోగము గల వాటిని స్వస్థపరచరు (8) గాయపడిన వాటి గాయములు కట్టరు (9) తోలివేసిన వాటిని తోలుకొని రారు (10) తప్పిపోయిన వాటిని వెదకరు (11) కఠిన మనస్కులై బలత్కారముగా వాటిని ఏలుదురు.

**10-19వ. కాపరియైన ప్రభువు ప్రవర్తన (సమకూర్చుట - తీర్పు తీర్చుట):-** (1) గొఱ్ఱెలను కాపుర స్థలములందు మేపుట (2) గొఱ్ఱెలకు మంచి మేత పెట్టి వాటి కడుపు నింపుట (3) గొఱ్ఱెలు ఇతరులకు తిండి కాకుండా తప్పించుట (4) ఇతర కాపరులవలె తమ కడుపులను నింపుకొనకుండుట (5) గొఱ్ఱెలను భద్రముగా పండుకొనబెట్టుట (6) బలహీనమైన వాటిని బలపరచుట (7) దుర్బలముగా ఉన్నవాటిని బలపరచుట (8) గాయములను కట్టుట (9) తోలివేసిన దానిని మరలా వెదకి తోలుకొని వచ్చుట (10) తప్పిపోయిన దానిని వెదకుట (11) ప్రభువు దీనమనస్సు కలవాడైనను క్రొవ్విన వాటికి శిక్షయను మేత పెట్టి లయపరచుట, తీర్పు తీర్చుట, క్రమపరచుట.

**20-31వ. కాపరియైన ప్రభువు దగ్గర గొఱ్ఱెల నిర్భయమైన జీవితము:-** వేయి ఏండ్ల పాలన స్థితి: (1) క్రొవ్విన గొఱ్ఱెలను, చిక్కిపోయిన గొఱ్ఱెలను వేరుపరచుట (2) గొఱ్ఱెల దోపుడు కాకుండా రక్షించుట (3) వాటిని మేపుటకు సేవకుడైన దావీదు (అంత్యకాలములో 1000 ఏండ్ల పాలనలో ప్రభువైన యేసును కాపరిగా అధిపతిగా నియమించుట -మేపుట (4) దావీదు వాటిని అరణ్యములో నిర్భయముగా నివసింపనిచ్చుట (5) ఋతువుల ప్రకారము వర్షములనిచ్చి పంటలను పైరులనిచ్చి కాడికట్లను తెంపి సురక్షితముగా జీవింపనిచ్చుట (6) దేవుడు వారికి తోడుగా నున్నాడని వారు గుర్తించునట్లు చేయుట (7) అన్యజనులలో అవమానపరచబడకుండా తన జనులకు ప్రత్యేకమైన తోట నేర్పరచుట.

# 35వ. అధ్యాయము (6+3+6=15వ)

అంశము:- ఎదోమీయుల సంపూర్ణ నాశనము.

**1-6వ. ఎదోమీయుల నాశనమునకు మొదటి కారణము:-** ఏ దేశమైనను ఏ ప్రజలైనను దేవునికి వ్యతిరేకముగా నుండిన దేవుని వాక్యము వారికి వ్యతిరేకముగా నుండును. 4-6వ దేవుడు తన వాక్యములో సెలవిచ్చినట్లు తగిన కాలమందు ఆ దేశములను జనములు లేని ఎడారిగా చేసి సమూల నాశనము చేయును. ఇశ్రాయేలీయుల మీద పగ కలిగి వారిని ఖడ్గమునకు అప్పగించినందున దేవుడు వారిని నాశనము చేయును.

**7-9వ. యెహోవాను ఎరుగవలసిన ఎదోమీయులు:-** ఎదోమును పూర్తిగా నాశనము చేసి, పర్వతములను పాడుచేసి, ఖడ్గముతో హతులైనవారు కొండలపై కూలునట్లు చేయును. ఎదోమీయులు యెహోవాను తెలిసికొనునట్లు ఆ పట్టణము మరల కట్టబడకుండ పాడుగానుండును.

**10-15వ. ఎదోము నాశనమునకు రెండవ కారణము:-** 10-12వ. యూదావారు, ఇశ్రాయేలువారు యెహోవాను తమ మధ్య కలిగియున్నను స్వాధీనపరచుకొందమని ఎదోమీయులు తలంచుట వారికి పాపముగా ఎంచబడినది. 13-15వ రెండవదిగా ఎదోమీయులు యూదావారిని దూషించుటయు, పెద్దనోరు చేసికొని విస్తారముగా దేవుని మీద మాటలాడుట వారికి పాపమని ఎంచబడి దేవుడు ఎదోమును సమూల నాశనము చేతుననెను.

**(10)** ఇశ్రాయేలీయుల అంత్యకాల సమకూర్పు – అంతిమ విజయము.

**(10) 36-39అ. ఇశ్రాయేలీయుల సమకూర్పు – విజయము**

# 36వ. అధ్యాయము (7+8+9+14వ)

అంశము:- అంత్యకాలములో ఇశ్రాయేలీయుల సమకూర్పు – విస్తరణ

**1-7వ. ఇశ్రాయేలు – శత్రువులగు ఎదోమీయులు:-** ప్రాచీనములైన ఉన్నత స్థలము తమ వశమైనదని శత్రువులు చెప్పుకొని సంతోషించుచు ఇశ్రాయేలును ఎదోమీయులు మరియు ఇతర అన్యులు హీనముగా చూచినందున వారికి రోషాగ్నితో జవాబిత్తునని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

**8-15వ. ఇశ్రాయేలు అభివృద్ధి:-** అన్యజనుల వలన అవమానమొందిన ఇశ్రాయేలు వారిని చిగురుపెట్టించి ఫలింపచేసెదనని సెలవిచ్చుచున్నాడు. ఇశ్రాయేలీయులను విస్తరింపచేతునని పట్టణములు కట్టింతునని మనుష్యులను పశువులను విస్తరింపచేతునన్నాడు. వారిమధ్య

పుత్రహీనులుండరు అన్నాడు. నేడు ఆ రీతిగాను జరుగుట చూడగలము. చక్కని రమ్యమైన ఆకుకూరలు 25 కేజీలు తూగు క్యాబేజిగడ్డ, 2 కేజీలు తూగు ఒక వంకాయ, 3 కేజీలు తూగు ఒక టమోటా నేడు ఇశ్రాయేలు దేశములో పండుచున్నవి. పొట్టేలు ఒకటికి 100 కేజీల మాంసమిచ్చునదిగా నున్నది.

**16-24వ. ఇశ్రాయేలుకు వాగ్దానం చేసిన పవిత్రత:-** గతకాలములో ఇశ్రాయేలీయులు అపవిత్రులై, విగ్రహములు పెట్టుకొని దేశమును అపవిత్రపరచిరి. దేవుని పరిశుద్ధ నామమును దూషణపాలు చేసిరి. దేవుడు వారిని కరుణించి తన నామమును పరిశుద్ధపరతునని ఏ ఏ దేశములకు తోలివేసెనో వాటి నుండి మరలా రప్పించి అపవిత్రత తీసివేసి పరిశుద్ధపరచెదనంటున్నాడు. **25-38వ. వాగ్దాన విస్తరణ:-** నూతన హృదయము, స్వభావము ఇచ్చి రాతి గుండె తీసివేసి మాంసపు గుండె నిత్తునంటున్నాడు. పట్టణాలు దేశమును రమ్యముగా కట్టింతునంటున్నాడు. పాడైపోయిన స్థలములు కట్టబడునని, చెట్లునాటబడునని గొర్రెలు విస్తరించునని, నియామక దినములలో గొర్రెలు దేవాలయమునకు వచ్చునంత విస్తారముగా మనుష్యులు విస్తరించుదురు.

## 37వ. అధ్యాయము (6+4+4+4+4+6=28వ)

### అంశము:- అంత్యకాలములో ఇశ్రాయేలీయుల సమకూర్పు

**1-6వ. ఎండిన ఎముకలు గల లోయ:-** 1-3వ ఇశ్రాయేలు జనాంగము అంత్యకాలములో ఎండిన ఎముకలు లోయలో ఉన్న రీతిగా ఉందురని వారిని పునరుద్ధరించ వలెనన్న ఉద్దేశ్యముతో దేవుడు యెహెజ్కేలును సాదృశ్యముగా ఎండిన ఎముకలు గల లోయలోనికి తీసుకొనిపోయి ఈ ఎముకలు బ్రతకగలవా? అని ప్రశ్నించాడు. **4-6వ.** వాటి కొరకు ప్రవచించుమని ఆజ్ఞాపించెను. అంత్యదినాలలో ఇశ్రాయేలీయులు తిరిగి రాజ్య ఔన్నత్యమును పొందుదురని దీని భావము. యెహెజ్కేలును ఎముకలపై మాంసము పొదిగి చర్మము కప్పబడునట్లు జీవాత్మ వారిలోనికి వచ్చునట్లు ప్రవచనమెత్తి అంత్యకాలములో ఇశ్రాయేలీయులు పునరుద్ధరించబడి విస్తరించుటను చూపు ప్రవచనము ప్రకటించుమని ప్రభువు ఆజ్ఞాపించెను.

**7-10వ. ప్రకటనను గూర్చిన ఆజ్ఞ :-** దేవుడు యెహెజ్కేలు కిచ్చిన ఆజ్ఞ ప్రకారము యెహెజ్కేలు ప్రవచించెను. నరములు, మాంసము వాటిపైన చర్మము ఏర్పడెను. కాని వాటిలో జీవాత్మ లేకపోయెను. జీవాత్మ కొరకై మరలా దేవుని ఆజ్ఞను బట్టి ఊపిరి విడిచి ప్రవచింపగా జీవాత్మ వారిలోనికి వచ్చి ఎవరు లెక్కింపలేని గొప్ప సైన్య సమూహముగా వారు నిలిచిరి.

**11-14వ. దర్శన భావము:-** ఎండిన ఎముకలు ఇశ్రాయేలీయులు. ఇశ్రాయేలీయులు

భూమియందంతట చెదరి సమాధులలో నున్నట్టున్నారు. దేవుడు వారిని తిరుగ ఇశ్రాయేలీయుల దేశమునకు తోడుకొని వత్తునని సెలవిచ్చుచున్నాడు.

**15-18వ. యూదా ఇశ్రాయేలీయుల ఏకత్వము గూర్చిన ప్రదర్శన:-** రెండు కర్ర తునకలను తీసికొని ఒకదానిపై యూదా వారిదని మరొక దానిపై ఎఫ్రాయీము (ఇశ్రాయేలు) వారిదని పేర్లు వ్రాసి ఒకదాని కొకటి జోడించుమనియు అది ఒకటే తునక యగుననియు సెలవిచ్చాడు. పదిగోత్రముల ఇశ్రాయేలీయులలో ఎఫ్రాయీము సంఖ్య ఎక్కువ. కనుక కొన్నిసార్లు ఎఫ్రాయీము అను పేరు పది గోత్రముల ఇశ్రాయేలీయులను సూచించును.

**19-22వ.** ప్రదర్శన భావము:- దాని భావమేమనగా ఏ ఏ అన్యజనులలో పది గోత్రముల ఇశ్రాయేలీయులు వారు చెదిరిపోయిరో వారిలో నుండి ఇశ్రాయేలును రక్షించి సమకూర్చి స్వదేశమునకు చేర్చుదుననని, యూదావారు, ఇశ్రాయేలు వారు ఇకమీదట రెండు గుంపులుగా నుండక ఏకముగా నుందురని సెలవిచ్చుచున్నాడు. దీని నెరవేర్పుగా వివిధ గోత్రముల వారు ప్రస్తుత కాలములో దేశమునకు వచ్చుచున్నారు. వారిపై రాజును నియమించి వారిక పాపము చేయకుండా చూచెదనని ప్రదర్శన భావము. వేయి ఏండ్ల పాలనతో ఏకత్వము కలిగి అందరు ఐక్యముగా నుందురు.

**23-28వ.** క్రీస్తు వేయి ఏండ్ల రాజ్యము:- దావీదును కాపరిగా కలిగి అనగా యేసుక్రీస్తే వారికి ఎల్లకాలము కాపరియై వారిక పాపము చేయక ఇశ్రాయేలు దేవుని విధులను నెరవేర్చునట్లు చేతునని దేవుడు సెలవిచ్చుచున్నాడు. దేవుడు వారితో సమాధానార్థమైన నిబంధన చేతునని దేవుని మందిరము నిత్యము వారికి పైగా నుండునని సెలవిచ్చుచున్నాడు. ఇది వేయి ఏండ్ల పాలన, నిత్యకాల పాలనలో జరుగును.

## 38వ. అధ్యాయము (7+6+5+5=23వ)

**అంశము:- గోగు మాగోగులు, ఇశ్రాయేలీయులకు యుద్ధము. ప్రకటన 20:8 ప్రకారము గోగు మాగోగుల యుద్ధము వేయిఏండ్ల పాలనతో జరుగును. దానికంటె ముందుగా ఏడేండ్ల శ్రమల మహాశ్రమల కాల చివరలో హార్‌మెగిద్దోను లోయలో ప్రక 16: 19: యుద్ధము జరుగును. యెహె 38:2లో గోగు, మాగోగులు అలాగే 39:12లో హమోన్గోను అను పేరులు చెప్పబడినందున 38, 39 అధ్యాయములోనున్న యుద్ధము హార్‌మెగిద్దోను యుద్ధముగాను (ప్రక 19:20), వేయి ఏండ్ల పాలనలో ప్రక 20:8లో చెప్పబడిన గోగు మాగోగుల యుద్ధములతో పోల్చుకొనవచ్చును.**

**1-7వ. యుద్ధమునకు భూరాజుల సిద్ధపాటు:-** మాగోగు దేశపు రాజైన గోగు (అనగా పర్వత శిఖరము అని అర్థము). రోషుకు, మెషెకునకు, తుబాలుకు అధిపతియై యుండి

ఈ రాజ్యముతోపాటు పారశీకదేశమును, కూషును, పూతు, గోమెరు, తొగర్మాను వారి సైన్యములను సమకూర్చుకొని ఇశ్రాయేలు దేశము మీదికి సిద్ధపడుదురు. మాగోగు, మెషెకు, తుబాలు, కూషు, పూతు, గోమేరు, తొగర్మాలు నోవహు కుమారుల సంతానమని ఆది 10:2-6లో కలదు. వారే చెదరి ఆయా దేశములకు పోయిరని అది 10:5వ.లో కలదు. కనుక వారిని బట్టి దేశములకు పేర్లు వచ్చియుండవచ్చును. రోషును రష్యాగాను, మెషెకును మాస్కోగాను, తుబాలును, తూబలస్కగాను, పూతును లిబియాగాను, గోమెరును జర్మనీగాను, తొగర్మాను టర్కీగాను తలంతురు గాని ఖచ్చితముగా చెప్పలేము.

**8-13వ. భూరాజుల దురాలోచన:-** యెరూషలేముపై దురాలోచన కలిగి ఆ దేశము, పట్టణములు, ప్రజలు, ప్రాకారములు, గవునులు, అడ్డగడియలు లేనివని తలంచి ఆ పశువులను, సరుకులను దోచుకొనే ఉద్దేశ్యము కలవారైపై రాజులందరూ వత్తురు. ఏడేండ్ల శ్రమల కాల చివరలో క్రీస్తు విరోధి వీరిని సమకూర్చును. వేయి ఏండ్ల కాల చివరలో అగాధము నుండి విడిపించబడిన అపవాది ప్రక 20:7-8 ప్రకారము సమకూర్చును.

14-18వ. దేవుడు జరిగించు యుద్ధము:- దేవుడు ఏటేట తన ప్రవక్తల ద్వారా ప్రవచించునట్లు యెషయా 11:4 జకర్యా 14:2 ప్రకటన 19:18-21 ప్రకారము దేవుడే వారిని సమకూర్చి యుద్ధము చివర వారందరిపై తన కోపము క్రుమ్మరించును. వారిని నాశనము చేయును.

**19-23వ. యుద్ధ వివరము:-** మహా భూకంపము కలిగి నరులు జంతువులు పక్షులు పురుగులు భయపడును. పర్వతములు, కొండపేటులు పడును. అగ్ని గంధకము ఆ సేనలపై కురిసి వారిని నాశనము చేయును. దీని నెరవేర్పుగా ఏడేండ్ల శ్రమల కాల చివరలో హర్‌మెగిద్దోను లోయలో భూరాజులందరూ ప్రక 16: 17: ప్రకారము కూడి వచ్చి ప్రభువుతో యుద్ధము చేయునని చూడగలము. ఒలీవల కొండపైకి ప్రభువు (అపో. 1:10) దిగిరాగా ఆ కొండ పగులుట వలన అందులో నుండి అగ్ని పారును. ఆ కొండలో లావా (అగ్నిద్రవము) కలదని శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. దాని ద్వారా చేరి వచ్చిన వారందరు నశింతురు. వేయి ఏండ్ల కాల చివరలో ప్రక 20:9 ప్రకారము పరలోకము నుండి అగ్ని దిగి వచ్చి వారిని దహించెను.

## 39వ. అధ్యాయము (10+6+6+7=29వ)

అంశము:- గోగు మాగోగులపై ఇశ్రాయేలీయుల విజయము.

**1-10వ. గోగు మాగోగుల నాశనము:-** గోగుతో పాటు చేరివచ్చిన వారందరు ఉత్తర దిక్కున నుండగా దేవుడే వారిని ఒలీవల కొండ దగ్గరకు నడిపించునని వారందరి పైకి

అగ్ని పంపి కూలచేతునని చెప్పుచున్నాడు. పర్వతములలోను, పొలములలోను కూలగా వారిని పక్షులు, దుష్టమృగములు భుజించునని, ఇశ్రాయేలు వారిని దోచుకొనుటకు వచ్చిన వారిని ఇశ్రాయేలు వారే దోచుకొందురని ఆ అగ్ని ఏడేండ్ల వరకు మండుచుండునని సెలవిచ్చుచున్నాడు.

**11-16వ. శవములు పాతిపెట్టుట - పట్టణము పవిత్రపరచబడుట:-** శవములను పాతిపెట్టుటకై సముద్రమునకు (మధ్యధరా సముద్రమునకు) తూర్పుగా లోయ అనగా హమోనోగు లోయ (హర్మెగెద్దోను కావచ్చు)లో స్థలము ఏర్పాటు చేయబడును. పాతిపెట్టుటకు ఏడు నెలల కాలము పట్టును. తరువాత పట్టణము పవిత్రమగును. దేశమును సంచరించి చూచి పాతిపెట్టుటకు మనుష్యులు నియమించబడుదురు. దేశమును సంచరించువారు ఒక మనుష్య శల్యమైనను కనబడిన ఆనవాలొకటి అక్కడ పెట్టి వాటినన్నిటిని పాతిపెట్టు ఏర్పాటు చేయుదురు. అలాగు పాతిపెట్టుట ముగించిన పిదప ఆ పట్టణమునకు సమూహము అను అర్థము గల హమోనా అను పేరు పెట్టబడును. దేశమంతయు అలాగున పవిత్రపరచబడెను.

**17-22వ. ఆకాశపక్షులకు విందు:-** ప్రకటన 19:18లో దేవుని గొప్ప విందులో మాంసము తినుటకై రమ్మని ఆకాశపక్షులకు ఆహ్వానమివ్వబడెను. 21వ వచనములో ప్రభువు నోటినుండి వచ్చు ఖడ్గముతో వధింపబడిన రాజుల, న్యాయాధిపతుల, జనముల, మాంసము పక్షులు కడుపారా తినును. ఈ విషయము క్రీ.పూ. 586లోనే యెహెజ్కేలు ద్వారా పై భాగములో స్పష్టముగా తెలుపబడెను. అన్యజనులందరు దీనిని చూచుట ద్వారా దేవుని గొప్పతనమును గుర్తించెదరు. ఇశ్రాయేలీయులు కూడా యెహోవాయే తమ దేవుడని తెలిసికొందురు.

**23-29వ. ఇశ్రాయేలీయులను సమకూర్చుట. వారి క్షేమము:-** దేవుడు రోషము గలవాడై ఇశ్రాయేలీయులపై జాలిపడి అన్యజనులందరిలో నుండి వారిని సమకూర్చును. యెహోవాయే దేవుడని అన్యులును, ఇశ్రాయేలీయులును తెలిసికొందురు. ప్రభువు ఎన్నడును తన ముఖమును త్రిప్పుకొనక ఇశ్రాయేలు వారిని కాపాడి తన ఆత్మను వారిమీద కుమ్మరించి క్షేమమిచ్చును.


## 40-43 అధ్యా. క్రొత్త మందిర వివరములు

యెహె 40:1లో మనము చెరలోనికి వచ్చిన ఇరువదియైదవ సంవత్సరమున అనగా పట్టణము కొల్లపోయిన పదునాలుగవ సంవత్సరము అని ఉన్నది. యెహె 1:2లో చెరలోనికి వచ్చిన సంవత్సరము క్రీ.పూ. 597 అని చూచితిమి. కనుక ఈ ప్రవచనము క్రీ.పూ. 572లో అని తలంచాలి. క్రీ.పూ. 586లో పట్టణము మందిరము కొల్లపోయినవి.

అప్పటినుడి పదునాలుగు సంవత్సరములు గడచినవి(572). రెండంతల సంపూర్ణ కాలము గడచినందున మందిరము మరలా కట్టబడునా అని ప్రజలు ఆలోచించుచున్నారు. మందిరము మరలా కట్టబడునని ఇక్కడ చెప్పబడినది. ఈ ప్రవచన సమీప నెరవేర్పుగా క్రీ.పూ. 535–515 మధ్య మందిరము కట్టబడి క్రీ.శ. 70లో పడగొట్టబడినది. కొంతమంది ఈ మందిరము ఇక కట్టబడదని తలంచుచున్నారు. కాని అంత్యకాల నెరవేర్పుగా వేయి ఏండ్ల పాలనలో ఈ మందిరము మరలా తప్పక కట్టబడును. ఈ వేయి ఏండ్లకాల మందిర ఆవరణ వివరములు 40అ. లోను మందిర లోపల వివరములు 41 అధ్యా.లోను, యాజకుల గదులు - ప్రతిష్ఠత 42 అధ్యా.లోను, దేవుని మహిమ తిరిగివచ్చుట 43 అధ్యా.లో చెప్పబడినవి.

## మందిరము, ఆవరణము, గోడలు, గుమ్మములు.

ఉత్తర గుమ్మము 50×25. వెలుపటి గోడ 500×500



# 40వ. అధ్యాయము (5+11+11+11+11=49వ)

**అంశము:- మందిరము చుట్టు బయటి లోపటి ఆవరణ కొలతలు.**

**1-5వ. కొలకఱ్ఱపట్టుకున్నవాడు:-** దారమును కొలకఱ్ఱ పట్టుకొన్నవాడైన మనుష్యుడు (క్రీస్తు). ప్రవక్త దర్శనములో యెరూషలేము దేవాయలపు పర్వతము పైకి కొనిపోబడెను. పర్వతమును ఎక్కుట కష్టము. అనగా మందిర క్రమమును పాటించుట కష్టతరమైనది. అక్కడ మెరయుచున్న యిత్తడి వంటి మనుష్యుడు కనబడెను. ఆయన క్రీస్తుయై యుండవచ్చును. ఆయన చేతిలో కొద్ది దూరములను కొలచుటకై కొలకఱ్ఱ ఎక్కువ దూరములను కొలుచుటకై దారము ఉండెను. కొలత అనగా క్రమము. కఱ్ఱ శిక్షించునది. సంఘములు క్రమశిక్షణ కలిగియుండాలి. కొలకఱ్ఱ ఆరు మూరలు పొడవు గలది. ఈ మూర మామూలు మూర ($1^1/_2$అ.) కంటె బెత్తెడు ఎక్కువైనది. అనగా కొలకఱ్ఱ $10^1/_2$ అడుగులు గలది. మందిరము చుట్టు ప్రాకారముండెను. ప్రాకారము ప్రత్యేకతను చూపును. ప్రాకారపు వెడల్పు ఎత్తు రెండును $10^1/_2$ ఉండెను. ప్రాకారపు ఎత్తు, వెడల్పు కొలతలను చూడగా అవి శత్రువులు దాటలేనంత ఎత్తు, సులభముగా రంధ్రము వేయలేనంత మందము గలదైనందున దేవుడు తన బిడ్డలకు ప్రాకారమై కాపాడు విధమును చూడగలము.

**6-16వ. 17-27వ. మందిర బయటి ప్రాకార తూర్పు గుమ్మపు వివరములు-**

**మందిర బయటి ప్రాకార ఉత్తర దక్షిణ గుమ్మపు వివరములు:-** ప్రతి గుమ్మము 50 మూరల పొడవు, 25 మూరల వెడల్పు గలవై యుండెను. గుమ్మపు ద్వారము 13 ($27^3/_4$ ) మూరల ఎత్తు, 10 ($17^1/_2$) మూరల వెడల్పు గలది. ఇరువైపుల మూడేసి కావలిగదులు ఒక్కొక్కటి 6 మూరల వెడల్పు, పొడవు, ఎత్తు గలవై యుండెను. గదులకు, గోడలలోని స్తంభములకు కమ్ములు గల కిటికీలుండెను. వాటిపై ఖర్జూరపు చెట్లు రూపింపబడియుండెను. కీర్తన 92:12-15 ప్రకారము ఖర్జూరము నీతిమంతులను చూపుచున్నది. విశ్వాసులు పాపము లేక నీతిగల ప్రవర్తనతో జీవించాలి. మూడువైపుల మొత్తము 18 కావలి గదులను ఉంచుటలో తన మందిరమును దేవుడు కాయు విధము కనిపించును. ప్రతి గుమ్మమునకు ఏడేసి మెట్లు కలవు. అనగా వెలుపటి ప్రాకారమంతయు ఏడు మెట్ల ఎత్తున గలదు.

**28-38వ. లోపలి ఆవరణమునకు తూర్పు పడమరి ఉత్తరవైపు గల గుమ్మముల వివరములు:-** బయటి ఆవరణమునకు 100 మూరల లోపల, లోపలి ఆవరణము గలదు. (పరిపూర్ణ దూరమందు లోపలి కార్యక్రమములు జరగాలి). ప్రతి గుమ్మమునకు 8 మెట్లు గలవు. అనగా లోపలి అవరణమంతయు ఎనిమిది మెట్ల ఎత్తున గలదు.

**39-49వ. బలులకు ఉపకరణముల ఏర్పాటు:-** తూర్పు గుమ్మపు ఇరువైపుల బలుల

కొరకైన బల్లలు రెండు బలుల ఉపకరణములు ఉంచుటకైన 8 బల్లలు ఒక్కొక్క వైపున నాలుగు ఉంచబడెను. ఉత్తర దక్షిణ గుమ్మములు లోపటి తూర్పు వైపున రెండు గదులు యాజకుల కొరకై ఉండెను. ఒకటి మందిరసేవ చేయు యాజకులకు మరొకటి బలిపీఠపు సేవచేయు యాజకుల కొరకు ఉండెను. సేవ అనగా భద్రపరచుట. సువార్తికులు, పెద్దలు క్రీస్తు బల్యార్పణ సత్యములను కలిపి చెరిపెడు బోధకుల నుండి సంఘమును కాపాడాలి.

## 41వ. అధ్యాయము (4+8+5+9=26వ)

### అంశము:- మందిరము లోపలి వివరములు

**1-4వ. పరిశుద్ధ స్థలము, అతి పరిశుద్ధ స్థల వివరములు:-** పరిశుద్ధ స్థలము 40 మూరల పొడుగు, 20 మూరల వెడల్పు, గుడార ద్వారము వెడల్పు 6 మూరలుండెను. అతిపరిశుద్ధ స్థలము 20 మూరల పొడుగు, 20 మూరల వెడల్పు, 7 మూరల వెడల్పు గల వాకిలి ఉండెను. యెహెజ్కేలుకు చూపు వ్యక్తి యెహెజ్కేలును మందిరము లోపలికి తోడుకొనిపోయెను. కాని అతిపరిశుద్ధ స్థలము లోనికి తానొక్కడే పోయెను. అతిపరిశుద్ధ స్థలమునకు హెబ్రీ. 9:7 ప్రకారము ప్రధాన యాజకుడొక్కడే వెళ్ళుచున్నందున యెహె. 40:3 మెరయుచున్న ఇత్తడిని పోలిన ఆ వ్యక్తి యేసేనని స్థిరపరచగలము. పరిశుద్ధ స్థలము సంఘమునకు పోలిక, అతిపరిశుద్ధ స్థలము పరలోకమునకు పోలికయై యున్నది. అతి పరిశుద్ధస్థలము 20 మూరలు ×20 మూరలు సమమైన కొలతలు గలది. పరలోకము సరిసమాన కొలతలు అనగా సర్వ పరిపూర్ణమైనది. దాని ద్వారము 7 మూరల వెడల్పు గలదిగాను, పరలోక ద్వారామైన (యోహాను 14:6) యేసు సర్వపరిపూర్ణుడు. పరిశుద్ధ స్థలము 40×20 కొలతలు దాని ద్వారము 6 మూరలు అసంపూర్ణమైన కొలతలు గలది. కాన భూమి మీద ఏ విశ్వాసులైనను వారి సంఘములైనను అసంపూర్ణమైనవేనని గుర్తించి ఎల్లప్పుడు సంపూర్ణతలోనికి ఎదుగుటకు జాగ్రత్తగా నుండవలెను.

**5-12వ. ప్రక్క గదులు, కట్టడము వివరములు:-** మందిరమునకు ప్రక్కన 30 మేడ గదులు మూడు అంతస్తులలో మొత్తము 90 గదులు 1 పెద్ద కట్టడము 90 మూరలు×70 మూరలు కలది ఉండెను. మందిరముకున్న గదులలో ఇశ్రాయేలీయులు తెచ్చిన దశమ భాగములు అర్పణలును యాజకులు సమకూర్చి తదుపరి సేవ చేయు లేవీయులు యాజకులకివ్వవలెనని నెహెమ్యా 10:35-38వ. చూచుచున్నాము. అట్లు లేని యెడల నెహెమ్యా 13:5-8 వచనాలలో సేవచేయు యాజకులు తమకు రావలసిన పాళ్ళు అందకపోవుట చూచి పొలములకు పారిపోయిరని చెప్పబడినది. కనుక మందిర గదులు, ఇశ్రాయేలీయుల రాబడిలో ప్రభువు భాగమును మందిరములో సమకూర్చుటను, తదుపరి దానిని సేవకొరకు ప్రత్యేకించబడిన సేవకులకు పంచిపెట్టుటను సూచించుచున్నది.

**13-17వ. మందిరపు కొలతలు:-** మందిరము నూరు మూరల పొడవు, నూరు మూరల వెడల్పు గలది. ప్రత్యేక కట్టడమును నూరు మూరల పొడవు, నూరు మూరల వెడల్పు గలది. నూరు అను సంఖ్య సంపూర్ణతను సూచించును. మందిరములు, మందిర పరిచర్య గదులు సంపూర్ణమైనదిగా తమ కార్యములు జరిగించునవిగా నుండవలెనని దీని భావము.

**18-26వ. మందిరము లోపలి అలంకరణ బల్ల వివరములు:-** మందిరము లోపల ఖర్జూరపు చెట్లు ఇరువైపుల రెండు కెరూబులు మనుష్య ముఖము గలది, సింహము ముఖము గలది యుండెను. ఖర్జూర చెట్టు విశ్వాసులమైన మనకు సూచన. ఫలము, బలమైనది, తీపియైనదైనందున ప్రభువు కొరకు ఫలింపవలసిన ఫలభరితమైన జీవితమును సూచించుచున్నది. కెరూబులు మనము చేయు సేవను సూచించుచున్నవి. రాజు ప్రజల సమాన అక్కరలను తీర్చు రీతిగా మనుష్యులమైన మనము అందరి అక్కరలను తీర్చు సేవకులముగా నుండాలి. సముఖమందున్న బల్ల వాక్యమునకు గుర్తు. మోషే ప్రత్యక్ష గుడారమందున్న ఏ ఉపకరణము కెరూబులు, కరుణాపీఠము, తెరలు, దూపవేదిక, మందసము ఇందులో లేవు. ఒక్క బల్ల తప్ప. అనగా వేయి ఏండ్ల పాలన వాక్యము మాత్రమే ఉండునని దాని భావము.

## 42వ. అధ్యాయము (12+2+6=20వ)

**అంశము:- యాజకుల గదుల వివరములు - మందిర ప్రాకార వివరములు**

**1-12వ. యాజకుల గదులు గల కట్టడ వివరములు:-** మందిరమునకు లోపలి ఆవరణమునకు వెలుపల ఉత్తర వైపునకు దక్షిణ వైపునకు యాజకులకు గదులు గల కట్టడములుండెను. ఆ కట్టడము నూరు మూరల పొడుగు, 50 మూరల వెడల్పు గలది. దానిలో మధ్య 20 మూరల వసార ఇరువైపు గదులుండెను. మందిరపు వైపు నూరు మూరల పొడుగున మధ్య వసార మరొకవైపు 50 మూరల పొడుగున గదులుండెను. తూర్పు వైపునను గదులుండెను. ఆ కట్టడమునకు ఉత్తరము తూర్పు వైపున ద్వారములుండెను. క్రింది మధ్య మూడవ అంతస్తుగా మూడు అంతస్తులలో గదులుండెను. అలాగే మందిరమునకు దక్షిణ వైపున కట్టడము గదులుండెను. ఇవి యాజకుల కొరకైన గదులు.

**13-14వ. యాజకుల ఆహార వస్త్రములు భద్రపరచబడుట:-** ఆ గదులలో ఇశ్రాయేలీయుల ప్రతిష్ఠార్పణలలో బలిపీఠముపై కాలగా మిగిలినవి భద్రపరచబడెను. నైవేద్య శేషము, పాప పరిహారార్థబలి, అపరాధ పరిహారార్థ బలి శేషములు అక్కడ ఉంచబడెను. లేవి. 6:16-18లో నైవేద్య శేషమైన గోధుమపిండి, నూనె, ఉప్పులో చేరెడు బలిపీఠముపై

సాంబ్రాణి అంతటితో కలిసి కాల్చగా మిగిలినది నైవేద్య శేషము. పాపపరిహారార్థబలి, దహనబలిని గూర్చిన విధి ఒకటే (లేవీ. 7:7వ.). లేవి 6:24-28లో పాప పరిహారార్థబలి శేషము యాజకునిదని చెప్పబడినది. ఇవన్నియు పైనున్న గదులలో భద్రపరచబడును. నూతన నిబంధన యాజకులగు విశ్వాసులందరు తమ గోధుమలు, అనగా దేహములను నూనె అనగా ఆత్మ మరియు ఉప్పు అనగా కుళ్ళు పట్టని గుణము కలిగినవారముగా నుండాలి. అనగా సజీవముగా దేవునికి మనదేహములను ప్రతిష్ఠార్పణముగానివ్వాలి. అంతేకాక గోధుమలు పిండి రూపముగా మార్చబడింది. మనము రూపాంతరము పొందాలి. గోధుమలు నూనె మన శ్రమకు ఫలితము. విశ్వాసులు తమ కష్టఫలమైన రాబడిలో కూడా దేవునికివ్వాలి. "సమర్పణ చేయుము ప్రభువునకు మీ దేహము ధనము సమయమును" అని పాట పాడు మనము దేహమే కాక సంపాదనను మందిర గదులలోనికి తీసుకొని రావాలి. సంఖ్యా. 18:19-20వ. ప్రకారము అహరోను తన కుమారులు భూసంబంధమైన స్వాస్థ్యము పాలు లేని వారుగా పరిశుద్ధస్థలములో వాటిని భుజించాలి. అహరోను ప్రధాన యాజకుడైన యేసుగాను ఆయన కుమారులు స్వాస్థ్యములు లేక పని నిమిత్తము అపొ. 13:1-2వ. ప్రకారము సువార్త నిమిత్తము ప్రత్యేకించబడిన పనివారుగాను చూచుచున్నాము. 1 కొరింథీ. 9:14వ. సువార్త ప్రచురించువారు సువార్త వలన జీవించాలి. బలిపీఠము యొద్ద పరిచర్య చేయువారు బలిపీఠము మీద అర్పించబడు వాటితో పాలివారు అని వ్రాయబడినది. మందిరపు గదులలో సమకూర్చబడినవి సేవకు ప్రత్యేకింపబడిన సేవకుల భోజనమునకు ఇవ్వాలి. వారు తమ ప్రతిష్ఠత వస్త్రాలను ఈ గదులలో భద్రపరచి సేవ చేయునప్పుడు ధరించాలి. సన్ననార చొక్కా ప్రక. 19:8 ప్రకారము పరిశుద్ధుల నీతిక్రియలకు సాదృశ్యము. పరిశుద్ధమైన దేవునికి ప్రీతికరమైన సేవ చేయాలి.

**15-20వ. మందిర ప్రాకార వివరములు:-** మందిర ప్రాకారము 500 మూరల పొడుగు వెడల్పు గలది. 1 కి.మీ. పొడుగు వెడల్పు గలది. సార్వత్రిక సంఘమును సువిశాలమైనదైనట్లుగా అభివృద్ధి చేయవలెనను భావము చూడనగును.

## 43వ. అధ్యాయము (5+4+3+5+10=27వ)

**అంశము:- దేవుని మహిమ తిరిగి వచ్చుట - పరిశుద్ధత కొరకైన పిలుపు**

**1-5వ. ముందుగా వెళ్ళిపోయిన దేవుని మహిమ తిరిగి వచ్చుట:-** యెహె. 11:23లో దేవుని మహిమ వెళ్ళిపోవుట చూచితిమి. దేవాలయపు తూర్పు తట్టు గుమ్మము దగ్గరకు పోగా దేవుని ప్రభావము కనబడెను. విస్తార ధ్వని ప్రకాశము చేత భూమి దద్దరిల్లెను. యెహోవా తేజోమహిమ తూర్పు తట్టు నుండి మందిరములోనికి ప్రవేశించి మందిరమును నింపెను.

**6-9వ. పరిశుద్ధత కొరకైన పిలుపు:-** ఇశ్రాయేలీయులు గత కాలములో చేసిన విగ్రహారాధన, జారత్వమునుబట్టి దేవుడు కోపగించి నాశనము చేసెను. కాని ఇప్పుడు వారు జారత్వము చేయక దేవుని పరిశుద్ధ నామమును అపవిత్రపరచకయుండుటను బట్టి దేవుడు తానే వారి మధ్య నిత్యము నివసించి యెరూషలేమును పాదపీఠముగా చేసికొందునని సెలవిచ్చుచున్నాడు.

**10-12వ. మందిరము యొక్క విధి:-** ఇశ్రాయేలీయులు తాము చేసిన దోషమును బట్టి సిగ్గుపడినందున మందిరము యొక్క బహిర్గమ స్థానముల విధులు, అంతర్గమ స్థానముల విధులన్నిటిని ఆచార క్రమముగా కనుపరిచి మందిరమును గూర్చిన విధిగా "పర్వతము మీద మందిరమునకు చేరిన స్థలమంతటిని అతి పరిశుద్ధము" అని వ్రాయించుమని దేవుడు సెలవిచ్చాడు. పై భాగముల యందు ఇశ్రాయేలు పశ్చాత్తాపపడిన యెడల దేవుడు వారి మధ్య నిత్యము నివసించుచు తాను వారిని పరిశుద్ధముగా కాపాడుకొందునని చెప్పుచున్నాడు.

**13-17వ. బలిపీఠపు కొలతలు:-** ఈ కొలతలు సంపూర్ణమైనవి. బలిపీఠము పైన బల్ల పరుపుగా నుండి నాలుగు మూలలకు నాలుగు కొమ్ములుండును. దీని పైకి ఎక్కుటకు మెట్లు ఉండెను. బలిపీఠము ఎంతో పెద్దది. క్రీస్తు బల్యర్పణ అనగా పాప పరిహారకార్యము ఎంతో గొప్పది.

**18-27వ. బలిపీఠమునకు ప్రాయశ్చిత్తము:-** రక్తములో బలిపీఠమును దాని కొమ్ములను చమరవలెను. పాపపరిహారార్థ బలి పశువును దహనము చేయవలెను. ఏడు దినములు వరుసగా బలిపీఠమునకు ప్రాయశ్చిత్తము చేయుచు దానిని పవిత్రపరచి ప్రతిష్ఠించవలెను. దహన, సమాధానబలిని అర్పించగా ఇశ్రాయేలీయులను దేవుడు అంగీకరించెను. దహనబలి సంపూర్ణ సమర్పణకు దేవునితో నిత్యము సమాధానబలి సమాధానస్థితిని కాపాడుకొనుటను నేర్చుకొనుచున్నాము.

### (12) 44-46అ. క్రొత్త ఆరాధనక్రమము

**44అ. యాజకుల కట్టడలు - నిబంధనలు. 45అ. దేశము - విధులు 46అ. అధిపతి, యాజకుల, జనుల ఆరాధనను గూర్చిన విధులు**

## 44వ. అధ్యాయము (3+6+7+5+5+5=31వ)

అంశము:- యాజకుల కట్టడలు - నిబంధనలు

**1-3వ. మూయబడిన తూర్పు ద్వారము:-** దేవుని మహిమ తూర్పు ద్వారము గుండా ప్రవేశించిన పిదప ఏ మానవుడు ఆ ద్వారమున ప్రవేశింపకుండునట్లు ఆ ద్వారము మూయబడినది. అధిపతి మాత్రము మంటప మార్గమున ప్రవేశించి మంటప మార్గమున బయటకు పోవలెను. ఆహారము భుజించునప్పుడు మాత్రమే అచ్చట కూర్చుండును. మందిర

ద్వారము మూయబడుట దేవుని మహిమ మరెన్నడు వారిని విడువక వారి మధ్య నుండి నివసించుటను సూచించును.స

**4-9వ. మందిర మహిమ మందిరమును కాపాడుటను గూర్చిన విధి:-** మందిరము మహిమతో నింపబడుట యెహెజ్కేలు చూచి సాగిలపడుట మన ఆరాధన కూడికకు ఎంతో చక్కని హెచ్చరికగా నున్నది. మందిరమును నింపిన దేవుని మహిమను ఆరాధికులు చూడగలిగిన పరిస్థితి మందిరమందున్న యెడల ఆరాధికుడు సాగిలపడి సంపూర్తిగా ఆరాధించగల స్థితియుండును. హృదయమందు శరీరమందు సున్నతి లేని అన్యుడు మందిరమును ప్రవేశించకూడదని మందిర పరిచర్యలో పాల్గొనకూడదను దేవుని విధిని సెలవిచ్చాడు.

**10-16వ. విగ్రహారాధికులైన లేవీయులకు వచ్చు శిక్ష:- నమ్మకస్తులైన సాదోకు కుమారులకు అప్పగించబడిన పరిచర్య:-** లేవీయులు గతములో విగ్రహారాధన చేసినందున వారికి యాజకత్వము అప్పగింపబడక జరుగుచున్న పనులను విచారించుచూ కాపాడు పని అప్పగింపబడినది. సాదోకు సంతతి వారైన యాజకులు దావీదుకు కష్ట సమయములలో సహాయకులై నమ్మకస్తులుగా నుండినందున యాజక పరిచర్య వారికప్పగింబడినది. (2 సమూ. 15:24).

**17-21వ. యాజకుల వస్త్రములు - వివాహములు:-** యాజకులు జనుపనార వస్త్రములు మాత్రమే ధరించాలి. నార వస్త్రములు ప్రక. 19:8 ప్రకారము నీతిక్రియలకుగుర్తు. చెమట మలినమునకు గుర్తు కనుక చెమట పుట్టించునది ధరింపకూడదన్నాడు. యాజకులు బయటి ఆవరణములోనికి జనుల యొద్దకు వెళ్ళునప్పుడు ప్రతిష్ఠిత వస్త్రములు గదులలో ఉంచి మామూలు బట్టలతో వెళ్లవలెనని ఆజ్ఞాపించుట యాజకుల ప్రత్యేకతను, పరిచర్య యొక్క ప్రత్యేకతను సూచించును. తల వెంట్రుకలు శరీరము నుండి స్వాభావికముగా పెరుగునవి గనుక విశ్వాసిలో నుండు శరీర స్వభావమునకు గుర్తు. క్షౌరము చేయుట శరీర స్వభావమును పూర్తిగా తీసివేయుటను సూచించును. శరీరమున్నంత కాలము శరీర స్వభావమును పూర్తిగా తీసివేయలేము. కాని, వెంట్రుకలు కత్తెరతో కత్తిరించునట్లు ప్రభువుకు అయిష్టమైన శరీర కార్యములను వాక్యమను కత్తెరతో కత్తిరించాలి. ద్రాక్షారసము మత్తుకు నిద్రకు గుర్తు. ఎఫెసీ. 5:14 ప్రకారము నిద్రించుచున్న వారు మేల్కొని జీవించుటను సూచించిను.

**22-26వ. యాజకులు పరిశుద్ధులై న్యాయాధిపతులుగా నుండుట:-** విధవరాండ్రను, విడువబడిన దానిని వివాహమాడి అపవిత్రులు కాకూడదు. సమీప బంధువులు శవములు తప్ప ఇతర మనుష్య శరీరములను ముట్టి తమ్మును అపవిత్రపరచుకొనకూడదు. జనులు

వ్యాజ్యమాడునప్పుడు యాజకుడు తీర్పు తీర్చవలసినవాడు కనుక తన మట్టుకు తాను పవిత్రతను కాపాడుకొనుచు తీర్పు తీర్చువాడై యుండాలి. ఒకవేళ యాజకుడు అపవిత్రుడైన యెడల ఏడు దినములైన తదుపరి లోపలి ఆవరణములోనికి వచ్చి పాపపరిహారార్థబలిని అర్పింపవలెను. తదుపరి పరిచర్య చేయవచ్చును. నూతన నిబంధనలో ప్రతి విశ్వాసి యాజకుడు కనుక మనమందరము పరిశుద్ధతను కాపాడుకొనవలెనని నేర్చుకొందము.

**27-31వ. యాజకుల స్వాస్థ్యము:-** ఇశ్రాయేలీయుల మధ్య వారికి ఏ స్వాస్థ్యము ఇవ్వబడలేదు. దేవుడు తానే వారికి స్వాస్థ్యమని సెలవిచ్చాడు. కాని దేవునికి అర్పింపబడిన ప్రతిష్ఠిత వస్తువులన్నియు పాపపరిహారార్థ బలిపశువు మాంసము, అపరాధ పరిహారార్థ బలిపశువు మాంసము యాజకులది. ప్రథమ ఫలములు, తొలిచూలులు యాజకులవి. ముందుగా పిసికిన పిండిముద్ద యాజకులది. కాని పక్షులు పశువులలో తనకు తాను చచ్చిన దానిని యాజకుడు తినరాదు. యాజకులు, స్థిరమైన ఏ స్వాస్థ్యము లేనివారై దేవుని బిడ్డలు పరదేశులు అను సత్యమును నేర్పుచున్నాడు. కాని తన పనికై యాజకుడు ప్రత్యేకించబడి ప్రతిష్ఠింపబడినందున దేవునిగా ఇశ్రాయేలీయులు తెచ్చు భాగము యాజకులకు ఇచ్చుచున్నాడు.

## 45వ. అధ్యాయము (8+9+8=25వ)

అంశము:- నూతన ఆరాధన క్రమము

**1-8వ. ప్రతిష్ఠించబడిన భూమి:-** 1-2వ. యెహోవాకు ప్రతిష్ఠ అర్పణమైన భూమి భాగము యొక్క కొలతలు చెప్పబడ్డాయి. అందులో చచ్చౌకమైన పరిశుద్ధ స్థలము, మైదానము ఉండవలెను. 3-4వ. యాజకులకు ఏర్పాటైన మహా పరిశుద్ధస్థలము యొక్క కొలతల వివరాలు చెప్పబడ్డాయి. 5వ. ఈ భాతములో పరిచర్యచేయు లేవీయులకు స్వాస్థ్యమైన నివాస స్థలము యొక్క కొలతలు చెప్పబడ్డాయి. 6వ. ఇశ్రాయేలీయుల కందరికి స్వాస్థ్యముగా నుండు పట్టణ వివరాలు చెప్పబడ్డాయి. 7-8వ. అధిపతికి ఏర్పాటు చేయబడిన భూమి వివరాలు చెప్పబడ్డాయి. ప్రతిష్ఠ అర్పణముల భూమి, యాజకులకు ఏర్పాటైన మహా పరిశుద్ధస్థలము, లేవీయుల పరిచర్య స్థలములు కొలత కలిగినవి. కొలత క్రమమును, నియమమును సూచించును. కనుక యాజకులు, లేవీయులు తమ అర్పణములన్నిటిని నియమప్రకారము చేయవలెనని గమనించాలి.

**9-17వ. అధిపతి విధులు - అధిపతి ప్రజల అర్పణలను మందిరమున కిచ్చుట:-** 9-12వ. ఇశ్రాయేలీయుల అధిపతులు బలాత్కారము చేయుట మాని జనుల సొమ్మును అపహరింపక నీతి న్యాయముల ననుసరించి నడుచుకొనాలని చెప్పబడినది. ఖరాత్రాసులను,

ఖరాపడిని, ఖరాతూమును ఒక్కొక్కటే ఉంచుకొనవలెను అన్నాడు. సరియైన కొలతలు, తూకములు ఉండాలన్నాడు. 13-17వ. ప్రజలు గోధుమలలో, తైలములో, గొఱ్ఱలలో ప్రతిష్ఠితార్పణలు నియమించబడిన ప్రకారముగా చెల్లింపవలెను. ఇశ్రాయేలీయులలోని అధిపతికి ఈ ప్రకారముగా చెల్లింపవలసిన అర్పణము తెచ్చుటకు దేశమునకు చేరిన జనులందరును బద్ధులై యుందురు. వీటిలో నుండి ఇశ్రాయేలీయులు కూడుకొను నియామక కాలములలో వాడబడు దహనబలులను, నైవేద్యములను, పానార్పణములను సరిచూచుట అధిపతి భారము. అతడు ఇశ్రాయేలీయుల నిమిత్తము ప్రాయశ్చిత్తము చేయుటకై పాపపరిహారార్థబలి పశువులను, నైవేద్యములను, దహనబలులను, సమాధానబలి పశువులను సిద్ధపరచవలెను. దీనిభావము సంఘములలోని అధిపతులగు సువార్తికులు, పెద్దలు సంఘ విశ్వాసులను సంపూర్ణ సమర్పనకు, దేవునితో నిత్య సమాధాన స్థితిలోనికి నడిపించాలి.

నేటికాల సంఘముల అధిపతులగు పెద్దలు, సువార్తికులు బలాత్కారము చేయుట, జనుల సొమ్మును అపహరించుట మాని నీతి న్యాయముల ననుసరించి నడుచుకొనాలి. విశ్వాసులకు దేవుని భాగము దేవుని కిచ్చుట నేర్పించాలని పాటము నేర్చుకొందము.

**18-25వ. పండుగలలో అర్పించవలసిన విధులు:-** 18-20వ.లో మొదటి నెల మొదటి దినమున అర్పించవలసిన బలుల వివరములు చెప్పబడ్డాయి. మొదటి నెల పదునాల్గవ దినమున పస్కాపండుగలో అర్పించవలసిన బలులను గూర్చిన విధులు 21-24వ.లోను చెప్పబడినవి. ఏడవ నెల పదునైదవ దినమున పర్ణశాలల పండుగలో అర్పించవలసిన బలులను గూర్చిన విధులు 25వ.లో చెప్పబడ్డాయి.

## 46వ. అధ్యాయము (8+7+9=24వ)

**అంశము:- అధిపతి - యాజకులు - ప్రజల ఆరాధనను గూర్చిన విధులు.**

**1-8వ. అధిపతి ఆరాధన:-** అధిపతి పండుగలకు మాత్రము కాక అమావాస్య, విశ్రాంతి దినములకు అర్పణలు అర్పించును. అధిపతి బయట మంటపమునకు పోవు మార్గముగా ప్రవేశించి, గుమ్మపు ద్వారబంధముల దగ్గర నిలువబడగా, యాజకులు దహనబలి పశువులను సమాధానబలి పశువులను అతనికి సిద్ధపరచవలెను; అతడు గుమ్మము దగ్గర నిలువబడి ఆరాధన చేసిన తరువాత వెలుపలికి పోవును.

సాయంకాలము కాకమునుపే గుమ్మము మూయకూడదు. విశ్రాంతి దినములలోను అమావాస్యలలోను దేశజనులు ఆ తలుపు దగ్గర నిలువబడి ఆరాధన చేయవలెను. లోపటి ఆవరణలోనికి యాజకులకు, లేవీయులకు మాత్రమే ప్రవేశము కలదు. కనుక లోపటి ఆవరణపు గుమ్మము, పనిచేయు ఆరుదినములు మూయబడి యుండును.

**9-15వ. దేశపు జనుల ఆరాధన:-** 9-10వ. అయితే దేశజనులు నియామక కాలముల యందు యెహోవా సన్నిధిని ఆరాధన చేయుటకై వచ్చునప్పుడు ఉత్తరపు గుమ్మపు మార్గముగా వచ్చినవారు దక్షిణపు గుమ్మపు మార్గమున వెళ్లవలెను. దక్షిణపు గుమ్మము మార్గముగా వచ్చినవారు ఉత్తరపు గుమ్మపు మార్గముగా వెళ్లవలెను. తాము వచ్చిన దారినే యెవరును తిరిగిపోక అందరును తిన్నగా వెలుపలికి పోవలెను. అధిపతి వారితో కలిసి ప్రవేశింపగా వారు ప్రవేశించుదురు, వారు బయలు వెళ్లునప్పుడు అందరును కూడి బయలు వెళ్లవలెను. 11వ. పండుగ దినములలో అర్పణలు: అధిపతి ప్రజలకొరకు అర్పించు వివిధ అర్పణలు ఇక్కడ చెప్పబడ్డాయి. పండుగ దినములలోను నియామక కాలములలోను ఎద్దుతోగాని పొట్టేలుతోగాని తూమెడు పిండియు, గొఱ్ఱెపిల్లలతో శక్తికొలది పిండియు, తూము ఒకటింటికి మూడుపళ్ల నూనెయు నైవేద్యముగా అర్పింపవలెను. 12వ. స్వేచ్ఛార్పణబలి: యెహోవాకు స్వేచ్ఛార్పణగా దహనబలినైనను స్వేచ్ఛార్పణమైన సమాధానబలినైనను అధిపతి అర్పించునప్పుడు తూర్పుతట్టు గుమ్మము తీయవలెను; విశ్రాంతి దినమున అర్పించునట్లు దహనబలిని సమాధాన బలిని అర్పించి వెళ్లిపోవలెను; అతడు వెళ్లిపోయిన తరువాత గుమ్మము మూయబడవలెను. 13-15వ. అనుదిన బలులు: మరియు ప్రతి దినము నిర్దోషమైన యేడాది మగ గొఱ్ఱెపిల్లను దహనబలిగా అర్పింపవలెను; అనుదినము ఉదయమున దానిని అర్పింపవలెను. మరియు అనుదినము ఉదయమున దానితో నైవేద్యము చేయవలెను. అది ఎట్లనగా తూమెడు గోధుమ పిండిలో పాలును, పిండి కలుపుటకు పడి నూనెయు నుండవలెను; ఇవి ఎవరును రద్దుపరచలేని నిత్యమైన కట్టడలు, గొఱ్ఱెపిల్లలను, నైవేద్యమును, నూనెను అనుదినము ఉదయముననే నిత్యదహనబలిగా అర్పింవలెను.

నేటి సంఘ కాలములో విశ్వాసులు అధిపతులగు సువార్తికులు, పెద్దలు నియమ ప్రకారము దహనబలిని (సంపూర్ణ సమర్పణకు గుర్తు), మిగిలిన బలులను అర్పించాలి.

**16-24వ. అధిపతి కుమారులకిచ్చిన స్వాస్థ్యము (16-18)- యాజకుల కొరకు (19-20), జనులకొరకు (21-24) వంట చేయు స్థలము:-** 16-18వ. అధిపతి తన కుమారులలో ఎవనికైనను భూమి ఇచ్చిన యెడల అది అతని కుమారునికి స్వాస్థ్యమైనందున అతని కుమారుల దగును. అది వారసత్వము వలన వచ్చిన దానివంటి స్వాస్థ్యము. అయితే అతడు తన పనివారిలో ఎవనికైనను భూమి ఇచ్చిన యెడల లేవి 25:5,10 ప్రకారము విడుదల సంవత్సరము వరకే అది వాని హక్కై తరువాత అధిపతికి మరల వచ్చును; అప్పుడు అతని కుమారులు అతని స్వాస్థ్యమునకు మాత్రము హక్కుదారులగుదురు. జనులు తమ స్వాస్థ్యమును అనుభవింపకుండ అధిపతి వారి భూమిని ఆక్రమింపకూడదు. జనులు తమ భూములను విడిచి చెదరిపోకుండునట్లు అధిపతి తన భూమిలో నుండియే తన కుమారులకు భాగముల నియ్యవలెను.

19-24వ. 19-20వ.లో యాజకులకు వంట చేయు గదుల వివరాలు చెప్పబడ్డాయి. 21-24వ.లో ప్రజల కొరకు వంటచేయుటను గూర్చిన వివరములు చెప్పబడినవి. 2 దిన 35:11-13. ప్రకారము లేవీయులు పస్కాపశువులను వధించి ఒలిచి మోషే గ్రంథములో వ్రాయబడిన ప్రకారము జనుల కుటుంబముల విభాగము చొప్పున యెహోవాకు అర్పణగా ఇచ్చుటకు దహనబలి పశుమాంసమును యాజకులు తీసికొనిరి. వారు ఎడ్లనుకూడ ఆ ప్రకారముగానే చేసిరి. వారు విధిప్రకారము పస్కాపశుమాంసమును నిప్పు మీద కాల్చిరి గాని యితరమైన ప్రతిష్ఠార్పణలను కుండలలోను బోరుసులలోను పెనములలోను ఉడికించి జనులందరికి త్వరగా వడ్డించిరి. దీని భావము సంఘాలలో సేవచేయు సువార్తికులు, పెద్దలు విశ్వాసులగు జనులకు వాక్యమను ఆహారమును ఉడికించి (ప్రార్థించుటే ఉడికించుట) ప్రార్థనా పూర్వకముగా వడ్డించాలి. ఎంతగా ఉడుకుతే అనగా ప్రార్థించితే అంత ప్రయోజనకరముగా నుండి ఫలితమిచ్చును.

### (13) 47-48అ. క్రొత్త పవిత్ర స్వాస్థ్యము

## 47వ. అధ్యాయము (6+6+11=23వ)

### అంశము:- నూతన పవిత్ర భూమి

**1-6వ. మందిరపు గడప క్రింద నుండి నీళ్లు ఉబికి తూర్పుగా పారుట:-** 1-2వ. ఆ నీళ్లు బలిపీఠమునకు దక్షిణముగా మందిరపు కుడిప్రక్కను క్రింద నుండి పారుచుండెను. 3-5వ. ఆ మనుష్యుడు కొలనూలుచేత పట్టుకొని తూర్పు మార్గమున బయలువెళ్లి వెయ్యిమూరలు కొలిచి ఆ నీళ్లగుండ నన్ను నడిపింపగా నీళ్లు చీలమండలోతుండెను. అయన మరి వెయ్యి మూరలు కొలిచి నీళ్లగుండ నడిపింపగా నీళ్లు మోకాళ్ల లోతుండెను, ఇంక ఆయన వెయ్యిమూరలు కొలిచి నీళ్ల గుండ నడిపింపగా నీళ్లు మొల లోతుండెను. ఆయన ఇంకను వెయ్యి మూరలు కొలువగా నీళ్లు మిక్కిలి లోతై దాట వీలులేకుండ ఈదవలసినంత నీరుగల నదియాయెను. నీరు దేవుని వాక్యము, నది సంఘము. వాక్యము ఎంతో లోతైనది. సంఘ సత్య మర్మములు ఈదవలసినంత లోతైనవి. మోకాళ్ళు ప్రార్థన జీవితమును చూపును. మోకాళ్ళ ప్రార్థనతో వాక్యపు లోతులను/సంఘ సత్య మర్మములను మనము ఈదగలుగుట అనగా అనుభవ పూర్వకముగా నేర్చుకొనాలి.

**7-12వ. నదీతీరమున ఇరుప్రక్కల విస్తారముగా నున్న చెట్లు - జీవమిచ్చు నీళ్ళు:-**

8-11వ. అప్పుడాయన నాతో ఇట్లనెను, ఈ నీళ్లు ఉబికి తూర్పుగానున్న ప్రదేశమునకు పారి అరబాలోనికి దిగి సముద్రములో పడును, అప్పుడు సముద్రపు నీళ్లు మంచినీళ్లు అగును. వడిగా పారు ఈ నది వచ్చుచోట్ల నెల్ల జలచరములన్నియు బ్రదుకును. ఈ

నీళ్లు అక్కడికి వచ్చుట వలన ఆ నీరు మంచి నీళ్లగును గనుక చేపలు బహు విస్తారములగును; ఈ నది యెక్కడికి పారునో అక్కడ సమస్తమును బ్రదుకును. మహా సముద్రములో నున్నట్లు సకల జాతి చేపలును దానియందు బహు విస్తారముగా నుండును. కొద్ది ప్రాంతమగు సముద్రపు బురద స్థలములును, ఊబి స్థలములును ఉప్పుగలవై యుండి బాగుకాక యుండును. 7వ. 12వ. నదీతీరమున ఇరు ప్రక్కల చెట్లు విస్తారముగా కనబడెను. నదీతీరమున ఇరుప్రక్కల ఆహారమిచ్చు సకలజాతి వృక్షములు పెరుగును, వాటి ఆకులు వాడిపోవు, వాటి కాయలు ఎప్పటికిని రాలవు. ఈ నదినీరు పరిశుద్ధ స్థలములోనుండి పారుచున్నది గనుక ఆ చెట్లు నెల నెలకు కాయలు కాయును, వాటి పండ్లు ఆహారమునకును వాటి ఆకులు ఔషదమునకును వినియోగించును. ఈ నది, వృక్షము వేయి ఏండ్ల కాలమునకు చెందినవైనను ప్రక 22:1-7లో నిత్యకాలములో ఉండబోవు జీవజలనది, జీవ వృక్షముతో పోలికలు కలవిగా నున్నవి.

**13-23వ. గోత్రముల ప్రకారము మీరు స్వాస్థ్యముగా పంచుకొనవలసిన భూమి వివరములు:-** పితరులకు వాగ్ధానము చేసిన ప్రకారము లేవి గోత్రమునకు తప్ప ప్రతి గోత్రమునకు స్వాస్థ్యము ఇవ్వబడినది. సంఖ్యా 34:1-12లో నున్న భూమి వివరములతో పోల్చవచ్చును. యెహె 44:28, 45:4, 48:13 ప్రకారము లేవీయులకు స్వాస్థ్యము లేదు. అందునుబట్టి యోసేపు కుమారులగు ఎఫ్రాయీము, మనష్షే గోత్రములకు స్వాస్థ్యములు ఇవ్వబడినది. మధ్యనున్న పరిశుద్ధ భూమి, మరియు మందిరములో సమకూడు అర్పణల ద్వారా లేవీయుల పోషణ జరగాలి. ఈ దినములలో సంఘము ద్వారా ప్రత్యేకించబడిన సువార్తికులు ఏ ఇతర రాబడి లేక జీవించువారు కనుక వారి పోషణ 1 కొరి 9:14 ప్రకారము సంఘము ద్వారానే జరుగాలి. ఈ స్వాస్థ్యము యొక్క నాలుగు దిక్కుల సరిహద్దులు చెప్పబడినవి.

## 48వ. అధ్యాయము (7+7+8+6=35వ)

**అంశము:- నూతన పవిత్ర భూమి.**

**1-7వ. ఏడు గోత్రములకు స్వాస్థ్యము:-** ఉత్తర దిక్కున వున్న భూమి ఏడు గోత్రములకు దాను, ఆశేరు, నఫ్తాలి, మనష్షే, ఎఫ్రాయీము, రూబేను, మరియు యూదా గోత్రములకు స్వాస్థ్యముగా పైనుండి క్రిందకు పంచబడినది. యూదా గోత్రము పరిశుద్ధ స్థలమునకు అతి సమీపముగా నున్నది.

**8-14వ. ప్రతిష్ఠిత భూమి:-** ప్రతిష్ఠిత భూమి (8వ.), యాజకుల భాగము (10-12వ.) లేవీయుల భాగముల వివరములు (13-14వ.) కలవు.

**15-22వ.** గ్రామ కంఠముగా ఏర్పరచబడిన పట్టణములోని భాగము:- పట్టణము (15-20వ.), ప్రధాని భాగముల (21-22వ.) వివరములు చెప్పబడినవి.

**23-29వ.** ఐదు గోత్రములకు స్వాస్థ్యము:- దక్షిణమున క్రింద నుండి పైకి షిమ్యోను, ఇష్శాఖారు, జెబూలును, గాదు, మరియు బెన్యామీను గోత్రములకు స్వాస్థ్యము పంచి పెట్టబడెను. బెన్యామీను గోత్రము యూదా గోత్రమువలె పరిశుద్ధ స్థలమునకు అతిసమీపముగా నున్నది. బెన్యామీను, యూదా వారిని పాలించిన రాజులలో కొద్ది మంది భక్తిపరులైనందున వారికి పరిశుద్ధ స్థలమునకు సమీపముగా భాగములు ఇవ్వబడెను.

**30-35వ.** పట్టణ స్థాన వివరములు:- యెహోవా యుండు స్థలమని నాటనుండి ఆ పట్టణమునకు పేరు. పట్టణము, ఉత్తరమున, తూర్పున, దక్షిణమున, పడమరన నాలుగువేల ఐదువందల కొలకఱ్ఱల పరిమాణము. దాని కైవారము పదునెనిమిదివేల కొలకఱ్ఱల పరిమాణము. ఇశ్రాయేలీయుల గోత్రపు పేళ్లనుబట్టి పట్టణపు గుమ్మములకు పేళ్లు పెట్టవలెను. ఉత్తరపు తట్టున రూబేనుదనియు, యూదాదనియు, లేవీదనియు, మూడు గుమ్మములుండవలెను. తూర్పు తట్టున యోసేపుదనియు, బెన్యామీనుదనియు, దానుదనియు, మూడు గుమ్మములుండవలెను. దక్షిణము తట్టున షిమ్యోనుదనియు, ఇశ్శాఖారుదనియు, జెబూలూనుదనియు, మూడు గుమ్మము లుండవలెను. పడమటి తట్టున గాదుదనియు, ఆషేరుదనియు, నఫ్తాలిదనియు మూడు గుమ్మము లుండవలెను.

రానున్న మెస్సియా రాజ్యములో జరుగు విషయముల వివరాలు దర్శన రూపముగా యెహెజ్కేలుకు తెలియపరచబడ్డాయి. కొందరు ఇవన్నియు వాస్తవముగా జరుగవేమో అనుకొనుచున్నారు, కాని మందిరము మిగిలిన అన్ని విషయములు వాస్తవముగా వేయి ఏండ్ల కాలములో జరుగునని గుర్తింతము.

# ఇశ్రాయేలు దేశము - చుట్టునున్న ఆరు శత్రు దేశాలు 25-32 అధ్యా

<u>తూర్పున</u>:- 1. అమ్మోను 25అ., 2. మోయాబు 25అ., <u>పడమర</u>:- 3. ఫిలిస్తియ 25అ.

<u>ఉత్తరమున</u> :- 4. తూరు 26-28అ. <u>దక్షిణమున</u>:- 5. ఐగుప్తు 29-32 అ., 6. ఎదోము 25అ.

